THAILAND PACKAGE
With 1N SRILANKA FREE
GROUP DEPARTURE ON 25FEB'18
INR 28,999* Per Person.
Above cost includes : 4Nights / 5Days
Airfare ex Hyderabad on Srilankan Airlines / Airport Taxes.
Airport transfers / 2N Pattaya - 1N Bangkok - 1N Negambo
Stay in 3* Hotel with Breakfast / Coral island tour with lunch
City tour of Bangkok / City tour of Colombo.
*Terms and conditions apply:
Booking First come basis only / Govt Taxes extra.
Visa charges extra / Rates are subject to change.
Contact us @ Hyd office :
040 23311495 / 9553304546. SriLankan Holidays

ఆంధ్రభూమి

RAMAYANA Tour Package
in SRI LANKA.
INR 34,999* Per person. 4Nights / 5Days
1N Dambulla / 2N Kandy / 1N Negambo
Above cost includes:
Airfare ex Hyderabad on Srilankan Airlines / Current Taxes / Visa charges.
Stay for 4N in Budget hotel with Breakfast- Lunch - Dinners / Transfers.
Visit 4 Ramayana Sites & Shankari Devi temple (Shakti Peetam)
City tour of Kandy / City tour of Nuwara Eliya / City tour of Colombo.
*Terms & Conditions Apply :
Fixed Group Departure on 31JAN'18.
Valid for booking before 17JAN'18 Only.
Contact us @ Hyd office :
040 23311495 / 9553304546 SriLankan Holidays

సంపుటి: 29 • సంచిక: 217 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శనివారం 6 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: ₹3.00

శుభోదయం

కలియుగం - 5119

శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥ దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, కృష్ణపక్షం; తిథి: శుద్ధ పంచమి రా.10.44; నక్షత్రం: మఖ ఉ.7.47; వర్జ్యం: మ.3.31 నుండి 5.03 వరకు
విశేషాలు: శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన
దుర్ముహూర్తం: ఉ.06.00 నుండి 7.36 వరకు
రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు

పాక్‌కు భారీ ఝలక్!

సైనిక సాయం నిలిపివేతకు అమెరికా నిర్ణయం

• ట్రంప్ ప్రభుత్వం కఠిన వైఖరి • ఉగ్రవాద ద్వంద్వ వైఖరిపై సీరియస్

వాషింగ్టన్/ఇస్లామాబాద్, జనవరి 5: ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న పాకిస్తాన్‌కు అమెరికా గట్టి షాక్ ఇచ్చింది. పాకిస్తాన్‌కు ప్రకటించిన 1.15 బిలియన్ డాలర్ల సాయం ఆపేయాలని అమెరికా నిర్ణయించింది. ఉగ్రవాదంపై కఠినంగా ఉన్నామని మాయమాటల చెబుతూ 15 ఏళ్లుగా అమెరికా సాయం పొందుతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్రంగా దుయ్యబట్టారు. ఆఫ్గనిస్తాన్‌లో ఉగ్రవాదంపై తాము పోరాడుతుంటే సహకరించడంపోయి విచ్ఛిన్నశక్తులకు వంతపాడుతోందని న్యూఇయర్ సందేశంలో ట్రంప్ ట్వీట్ చేశారు. తాలిబన్, హక్కానీ నెట్‌వర్క్‌ను అదుపుచేయలేకపోవడానికి పాకిస్తాన్ వైఖరే కారణమని అమెరికా అధ్యక్షుడు ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో పాక్‌పై కఠిన చర్యలకు ట్రంప్ ప్రభుత్వం ఉపక్రమించింది. 2016 సంవత్సరంలో ప్రకటించిన విదేశీ సైనిక నిధి(ఎఫ్ఎంఎఫ్) 255 డాలర్ల ఆర్థిక సహాయం నిలిపివేయాలని నిర్ణయించారు. అలాగే కొయిలేషన్ సపోర్ట్ ఫండ్(సీఎస్ఎఫ్)కింద అందజేయాల్సిన 900 మిలియన్ డాలర్ల సాయం నిలిచిపోనుంది. 2017 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖర్చుచేయకుండా మిగిలిపోయిన నిధులను అమెరికా రక్షణ శాఖ సస్పెండ్ చేసింది.' జాతీయ భద్రత సహాయ నిధులు ఆపేయాలని శుక్రవారం నిర్ణయించాం. ఉగ్రవాదం, ఉగ్రవాద సంస్థల విషయంలో పాక్ వైఖరి మారేవరకూ ఆర్థిక సహాయం ఇవ్వకూడదని ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది'అని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి హీథర్ నాయెర్ట్ వెల్లడించారు. హక్కానీ నెట్‌వర్క్, ఆఫ్గనిస్తాన్‌లో తాలిబన్ల నిర్మూలనకు జరుగుతున్న పోరుకు పాకిస్తాన్ సహకరించాల్సిందేనని అన్నారు.'ఆఫ్గనిస్తాన్‌ను అస్థిరపరచడాన్ని మేం ఎంత మాత్రం అంగీకరించం. పైగా ఉగ్రవాద గ్రూపులు మా దళాలను లక్ష్యంగా చేసుకుని పని చేస్తున్నాయి'అని ప్రతినిధి చెప్పారు. భద్రతకు సంబంధించి పాక్‌కు ప్రకటించిన ఆర్థిక సాయాన్ని నిలిపివేస్తామని ఆమె పునరుద్ఘాటించారు. సైనిక సహకారం అలాగే ఆయుధాలు సమకూర్చుకునేందుకు అందజేస్తామన్న ఆర్థిక సహాయాన్ని ఆపేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈమేరకు అధ్యక్షుడు ట్రంప్ గతంలోనే పాక్‌ను హెచ్చరించినట్టు ఆమె గుర్తుచేశారు. అమెరికా ప్రభుత్వ తాజా'ఆంక్షల'పై పాకిస్తాన్ స్పందించింది.'ట్రంప్ ప్రభుత్వంతో సంప్రదిస్తున్నాం. భద్రతా సహకారానికి

- మిగతా 7వ పేజీలో



గజల్ శ్రీనివాస్‌కు చుక్కెదురు

• బెయిలు మంజూరుకు నాంపల్లి కోర్టు నిరాకరణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: లైంగిక ఆరోపణల కేసులో చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న గాయకుడు గజల్ శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. శుక్రవారం శ్రీనివాస్ తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన పిటీషన్‌ను కోర్టు తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని, కేసులో రెండో నిందితురాలిని ఇంకా అరెస్టు చేయాల్సి ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని పోలీసుల తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఇంకా మరికొందరు బాధితులు తమ ముందుకొచ్చి నిందితుడిపై ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నందున విచారణకు బెయిల్ అడ్డంకిగా మారుతుందని చెప్పడంతో పోలీసుల వాదనతో ఏకీభవించిన కోర్టు బెయిల్ ఇచ్చేందుకు

- మిగతా 7వ పేజీలో





బొబ్బిలిలో శుక్రవారం నిర్వహించిన జన్మభూమి సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. సభకు హాజరైన జనం

శతశాతం అక్షరాస్యత

2019 నాటికి సాధించి చూపిస్తా • రూ. 5 వేల కోట్లతో స్కూళ్లలో మౌలిక వసతులు

ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతా • జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయనగరం, జనవరి 5: చదువు మన జీవితాలను మార్చేస్తుంది. తెలివి భవిష్యత్‌ను నిర్ధేశిస్తుంది. అందువల్లే తాను విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నానని, వచ్చే ఏడాది చివరినాటికి రాష్ట్రంలో శతశాతం అక్షరాస్యత సాధిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఇందుకు రేపటి నుంచి శ్రీకారం చుట్టనున్నట్టు చెప్పారు. ఐదో విడత జన్మభూమి- మావూరు కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయన బొబ్బిలిలోని రాజా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో మార్చినాటికి శతశాతం ఓపీఎఫ్ సాధిస్తామన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రూ.5వేల కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఐదు వేల పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు, వర్చువల్ క్లాసులు నిర్వహిస్తున్నామని బాబు వివరించారు. రాష్ట్రంలో ఎస్ఆర్ఎం, విట్, సెంచూరియన్ వర్శిటీలను ఏర్పాటు చేశామని, రానున్న కాలంలో అమెడీ, వెన్‌టెక్, అమృత్ విశ్వవిద్యాలయాలు రాష్ట్రానికి రానున్నాయని వివరించారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న విజయనగరం జిల్లాను విద్యారంగంలో అన్ని విధాల అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. భారత్‌లో యువత అత్యధికంగా ఉన్నారని, రానున్న కాలంలో ప్రపంచాన్ని శాసించే స్థాయికి భారత్ ఎదగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం చంద్రబాబు పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. జిల్లాకు ఎన్‌టిఆర్ జలసిరి కింద 25వేల బోర్లను మంజూరు చేసినట్టు ప్రకటించారు. బొబ్బిలి నియోజకవర్గానికి సంబంధించి మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు చేసిన వంద పడకల ఆసుపత్రి, గొల్లాది బ్రిడ్జి, ఇతర ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, మృణాళిని, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసులనాయుడు, డి.జగదీష్, సంధ్యారాణి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమవతి, తెంటు లక్ష్మునాయుడు, పడాల అరుణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు మహంతి తదితరులు పాల్గొన్నారు.



కోడి పందేలకు కౌంట్‌డౌన్!

ఇతర రాష్ట్రాల నుంచీ ఆటగాళ్లు

బ్యాంకుల్లో పెరిగిన విత్‌డ్రాలు

తొలి పందెం బీజేపీ పెద్దలదే..

ఆంధ్రభూమి బ్యూరో

భీమవరం, జనవరి 5: సంక్రాంతి పండుగకు మరో పది రోజులు మాత్రమే గడువున్న నేపథ్యంలో గోదావరి జిల్లాల్లో కోడి పందాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ నెల 13వ తేదీ నుంచి బరుల్లో కోడి పందాలకు పందాలరాయుళ్లు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఆరు నూరైనా బరిలో పందెం పుంజు కొట్లాడాల్సిందేనని పందేలరాయుళ్లు వ్యూహాలు రచిస్తున్నారు. కోడి పందేలు జరగనీయరాదని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే మరోపక్క పందాల నిర్వాహకుల ఆహ్వానాలు దాదాపుగా అన్ని వర్గాల వారికి చేరుకున్నాయి. ముందుగా ఢిల్లీ, ముంబై, కర్ణాటక, తెలంగాణ, ఒడిస్సా, చెన్నై తదితర రాష్ట్రాల్లో ఉన్న బంధువర్గం ఈ నెల 7వ తేదీ నాటికే తమ స్వగ్రామాలకు చేరుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరు పందాల నిర్వాహకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటున్నట్లు తెలిసింది. ఈ ఏడాది కోడి పందాలను వీక్షించడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా నేతలు తరలిరానున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా ఇప్పటి నుంచే పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని దాదాపుగా అన్ని బ్యాంకుల్లో నగదు విత్‌డ్రాలు పెరిగాయి. ఈ జిల్లాలో పందేలు రూ.కోట్లలో

- మిగతా 7లో

కాఫర్ డ్యాంకు కేంద్రం ఓకే

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: పోలవరం ప్రాజెక్టులో భాగంగా కాఫర్ డ్యాం నిర్మాణానికి కేంద్రం ఓకే చెప్పింది. డ్యాం నిర్మాణానికి పోలవరం డ్యాం డిజైన్ రివ్యూ కమిటీ (డీడీఆర్‌సీ) సైతం ఆమోదం తెలిపింది. శుక్రవారం సెంట్రల్ వాటర్ కమిషన్ కార్యాలయంలో కేంద్ర జల వనరుల శాఖ అధికారులు, ఏపీ నీటి పారుదల శాఖ అధికారులు, పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ ప్రతినిధులు సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టులో కాఫర్ డ్యాం నిర్మాణం చెప్పట్టాలని ఏపీ సర్కారు భావించటం తెలిసిందే. అయితే కాఫర్ డ్యాం నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై కేంద్రం నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ)ను అధ్యయనం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఎన్‌హెచ్‌పీసీ కాఫర్ డ్యాంకి బదులుగా వివిధ ప్రత్యమ్నాయాలను చూపించింది. ఎన్‌హెచ్‌పీసీ చూపించిన ప్రత్యామ్నాయాల్లో ఏదీ అమలు సాధ్యం కాదని సమావేశంలో అధికారులు నిర్థారణకు వచ్చారు. ఈ పరిస్థితులలో ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన కాఫర్ డ్యాంకు సంబంధించిన పనులకు ఆమోదం తెలిపారు. అలాగే పోలవరం డ్యాం డిజైన్ రివ్యూ కమిటీ (డీడీఆర్‌సీ) కూడా ఆమోదం తెలిపింది. కాఫర్ డ్యాం ఎత్తు ఎంతుండాలి అన్న దానిపై తదుపరి భేటీలో నిర్ణయం తీసుకోవాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు.



రాష్ట్ర సమస్యలపై ప్రధాని మోదీకి వినతిపత్రం ఇస్తున్న తెలుగుదేశం ఎంపీలు

సమస్యలపై టాస్క్ ఫోర్స్

• ప్రధాని హామీ ఇచ్చారన్న టీడీపీ ఎంపీలు

• రాష్ట్ర సమస్యలపై మోదీకి వినతిపత్రం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తాను ఎప్పుడూ కృషి చేస్తానని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు వచ్చేవారం ఢిల్లీకి వచ్చినప్పుడు అన్ని విషయాలూ చర్చిస్తానని హామీ ఇచ్చారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు త్వరితగతిన అమలయ్యేలా చూసేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తానని నరేంద్ర మోదీ హామీ ఇచ్చినట్టు తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు, కేంద్ర మంత్రి సుజనా చౌదరి తెలిపారు. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ తెలుగుదేశం సభ్యులు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీకి వినతిపత్రం అందజేశారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు, కేంద్ర మంత్రి సుజనా చౌదరి నాయకత్వంలో పార్టీ ఎంపీలు శుక్రవారం పార్లమెంటు ఆవరణలో ప్రధానిని కలిసి ఇంతవరకు అమలు కాని విభజన హామీలను వివరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేవీపీ రామచందర్‌రావు

- మిగతా 7వ పేజీలో

ట్రిపుల్ తలాక్!

ఇక బడ్జెట్ పార్లమెంట్‌లోనే.. శీతాకాల సమావేశాలు నిరవధిక వాయిదా



శీతాకాల సమావేశాల్లో చివరి రోజు శుక్రవారం లోక్‌సభ దృశ్యం

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: పార్లమెంటు శీతాకాల సమావేశాలు చారిత్రాత్మిక ట్రిపుల్ తలాక్ నిషేధ బిల్లుకు చట్టరూపం ఇవ్వకుండానే నిరవధికంగా వాయిదా పడ్డాయి. ట్రిపుల్ తలాక్ బిల్లును లోక్‌సభ ఆమోదించి రాజ్యసభకు పంపించటం తెలిసిందే. ట్రిపుల్ తలాక్ బిల్లును లోక్‌సభలో సమర్థించిన కాంగ్రెస్ రాజ్యసభలో అడ్డుకుంటూ సవరణలకు డిమాండ్ చేసింది. బిల్లులోని మూడేళ్ల శిక్షాకాలాన్ని తగ్గించాలని కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు, బీజేపీ మిత్రపక్షాలైన తెలుగుదేశం, అన్నాడీఎంకె, బీజూ జనతాదళ్ డిమాండ్ చేశాయి. సవరణల కోసం బిల్లును రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపాలని పార్టీలు పట్టుబట్టాయి. అయితే ప్రభుత్వం మాత్రం బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించేందుకు అంగీకరించలేదు. లోక్‌సభ ఆమోదించిన ట్రిపుల్ తలాక్ బిల్లును న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభలో చర్చకు ప్రతిపాదించారు. ట్రిపుల్ తలాక్ బిల్లుపై చర్చ జరపకుండా సెలెక్ట్ కమిటీకి పంపించాలని ప్రతిపక్షంతోపాటు కొన్ని బీజేపీ మిత్రపక్షాలూ డిమాండ్

- మిగతా 7వ పేజీలో

29నుంచి బడ్జెట్ భేటీ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 29 నుండి ప్రారంభమవుతాయి. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న 2018 వార్షిక ప్రణాళికను లోక్‌సభలో ప్రతిపాదిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ ప్రకటించారు. శుక్రవారం పార్లమెంటు శీతాకాల సమావేశాల ముగింపు సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కొత్త రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జనవరి 29న పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. వెంటనే ఆర్థిక సర్వేను పార్లమెంటుకు సమర్పిస్తారు. బడ్జెట్ మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 9వరకు జరుగుతాయి. రెండో విడత సమావేశాలు మార్చ్ 5నుండి ఏప్రిల్ 6వరకు జరుగుతాయని అనంతకుమార్ వెల్లడించారు.

ఫన్‌గామా



మీరు వాడేసిన చెడ్డీలన్నీ ఆ గుమ్మానికి తగిలించండి! వాళ్లకు నచ్చినవి పట్టుకెళ్తారు!!

ప్రపంచం మన జన్మభూమినే చూస్తోంది!

• 11వ తేదీకల్లా అన్ని ఫిర్యాదులూ రియల్ టైమ్‌లో • ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి • టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 5: మన జన్మభూమి ప్రపంచం మొత్తాన్ని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇది మనందరం గర్వపడాల్సిన అంశం అన్నారు. శుక్రవారం విశాఖపట్నం నుంచి జన్మభూమి నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గత మూడు రోజులు జన్మభూమి అద్భుతంగా జరిగిందని, ఇదే స్ఫూర్తిని రాబోయే 7రోజుల్లో కూడా చూపించాలని కోరారు. 15శాతం వృద్ధిరేటు రాబోయే 15ఏళ్లు కొనసాగించాలని, ప్రతి శాఖ సామర్థ్యం పెరగాలని, పనితీరు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు. 'ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి. ఒక్క ఫిర్యాదు కూడా పెండింగ్ ఉండకూడదు. 11వ తేదీకల్లా అన్ని ఫిర్యాదులు రియల్ టైంలో పరిష్కరించాలని' ఆదేశించారు. సాధికార మిత్రల సహకారంతో ఫిర్యాదుదారులను గుర్తించాలన్నారు. జనవరి వరకు 7,78,422 ఫిర్యాదులు పెండింగ్ ఉన్నాయని, ఈ జన్మభూమి 3రోజుల్లో 3,77,863 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. పింఛన్ల అర్జీలను త్వరితగతిన అప్‌లోడ్ చేయాలన్నారు. హౌసింగ్ 28వేలు, సివిల్ సప్లయిస్ 22వేలు, పెన్షన్లు 11,380, ఇళ్ల పట్టాల కోసం 10,134 అర్జీలు వచ్చాయని గుర్తుచేశారు. 'గ్రామసభల్లో మాట్లాడుతున్న చిన్నారులను చూస్తే ముచ్చట వేస్తోంది. మన పిల్లలు ప్రపంచానికే నాయకత్వం వహించే పరిస్థితి రావాలని' ఆకాంక్షించారు. గ్రామసభల్లో చిన్నారులతో మాట్లాడించి వారిలో సమస్యల పట్ల అవగాహన, సామాజిక బాధ్యత పెంచాలన్నారు. జన్మభూమిలో మీరు పాల్గొన్నారా అన్న ప్రశ్నకు 56 శాతం అవునని, 29శాతం లేదని, 15 శాతం తెలియదని అన్నారు. అధికారులు పాల్గొన్నారా అని అడిగితే 93 శాతం అవునని, 73 శాతం లేదని జవాబిచ్చారు. అధికారులు మీకు అవగాహన కల్పించారా అన్న ప్రశ్నకు 83 శాతం అవునని, 17 శాతం లేదని అన్నారు. సమస్యలపై అధికారుల స్పందన బాగుందా అని అడిగితే 75 శాతం అవునని, 25 శాతం లేదని అన్నారు. సాధికార మిత్రలు జన్మభూమిలో పాల్గొన్నారా అని అడిగితే 52 శాతం అవునని, 48 శాతం లేదని జవాబిచ్చారు. డిబేట్ చేసిన అంశం అర్థమైందా అని అడిగితే 88 శాతం అవునని, 12 శాతం లేదని తెలిపారు. జన్మభూమి మీకు ఉపయోగంగా ఉందా అన్న ప్రశ్నకు 87 శాతం అవునని, 13 శాతం లేదని అన్నారు. పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా అంటే 68 శాతం అవునని, 32 శాతం లేదని అన్నారు. రేషన్ కార్డులు వచ్చాయా అని అడిగితే 66 శాతం అవునని, 34 శాతం లేదని అన్నారు. చంద్రన్న బీమాపై సంతృప్తిగా ఉన్నారా అంటే 70 శాతం అవునని, 30 శాతం లేదని జవాబిచ్చారు. అర్జీల పరిష్కారంపై సంతృప్తిగా ఉన్నారా అంటే 49 శాతం అవునని, 51 శాతం లేదని అన్నారు. దీన్నిబట్టి ఫిర్యాదుల పరిష్కారం మరింత వేగం పుంజుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని ఆదేశించారు.

3వ రోజు టాప్ టెన్ మండలాలు, గ్రామాలు ఇవే

మూడవరోజున విశాఖ అర్బన్, చెరుకుపల్లి, విస్సన్నపేట, పెద్దాపురం, కడియం, యలమంచిలి, మొవ్వ, పెందుర్తి మండలాలు టాప్ టెన్ జాబితాలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన మండలాలు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని, ఒకరితో మరొకరు పోటీబడాలని పిలుపునిచ్చారు. కాకుమాను, పాలకొల్లు, పొన్నూరు, మేడికొండూరు రాజాం, ఉంగుటూరు, పెడన, కసింకోట, పామిడి గ్రామాలు టాప్ టెన్ జాబితాలో ఉన్నాయన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ప్రణాళికాశాఖ, రియల్ టైం గవర్నెన్స్, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన అధికారులు సంజయ్ గుప్తా, అహ్మద్ బాబు, రామాంజనేయులు, కృష్ణమోహన్, మురళి, వివిధ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా స్పందనతో కొత్త ఉత్సాహం

సమీక్షలో సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 5: రాష్ట్రంలో జరుగనున్న ఐదో విడత 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం తీరుతెన్నులు, శనివారం కార్యక్రమ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం క్యాంప్ ఆఫీస్‌లో సమీక్ష జరిపారు. 'జన్మభూమి-మాఊరు'కు వస్తున్న ప్రజాస్పందన, ముఖ్యంగా చిన్నారులు ఉత్సాహంగా ముందుకొచ్చి వేదికపై మాట్లాడటం సంతోషం కలిగిస్తోందని తెలిపారు. 'జన్మభూమి-మాఊరు'లో వచ్చిన వినతులు-పరిష్కారాలు, ఆస్తుల పంపిణీ, హాజరైన ప్రజల సంఖ్య, చేపట్టిన కార్యక్రమాలు తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తమ సమస్యల పరిష్కారానికి పెద్దఎత్తున ప్రజలు వచ్చేలా 'గ్రామసభ'ల నిర్వహణపై అందరికీ ముందస్తు సమాచారం ఇవ్వాలని, మండలానికో ఆటోను ఏర్పాటుచేసి ప్రచారం చేయాలన్నారు. మౌలిక సదుపాయాల్లో గృహ నిర్మాణాన్ని కూడా చేర్చాలన్నారు.



ఆంధ్రభూమి బ్యూరో

జన్మభూమిలో భారీగా వినతులు

సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వ సలహాదారు పరకాల

విజయవాడ, జనవరి 5: జన్మభూమి-మాఊరు కార్యక్రమం 2వ తేదీన మొదలై నాటి నుంచి ప్రజలు లక్షలాదిగా హాజరై తమ వినతులు సమర్పిస్తున్నారని, వాటిని అధికార యంత్రాంగం పరిష్కరించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో గల మీడియా పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు పరకాల మాట్లాడుతూ ఈనెల 2,3,4 తేదీల్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో 3,82,615 మంది నుంచి వినతులు వచ్చాయని, ఈ మూడు రోజుల్లో 18,86,783 మంది పాల్గొన్నారని తెలిపారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమాల్లో 67,356 మందికి రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. కొత్తగా అర్హులైన వారికి 42,489 కొత్త పెన్షన్లు మంజూరు చేశామన్నారు. 6,622 హెల్త్ క్యాంపులు నిర్వహించి, 3,88,570 మంది రోగులను పరీక్షించామన్నారు. కంటి సమస్యలపై పరీక్షించి 18,747 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. వెటర్నరీ క్యాంప్స్ 12,119 నిర్వహించామని, యాక్టివిటీస్ ఎ కింద ఈ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. యాక్టివిటీస్ బిలో వకృత్వం, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నవారికి బహుమతులు అందించామన్నారు. ఈ పోటీల్లో 61,235 మంది పాల్గొన్నారన్నారు. 2వ తేదీ కన్నా 3వ తేదీన అర్జీలు 140 శాతం పెరిగాయని, రెండో రోజు కన్నా మూడో రోజు మూడు శాతం అర్జీలు తగ్గాయన్నారు. ప్రజల హాజరు రోజు కన్నా రెండోరోజు (3వ తేదీ) 124 శాతం అధికంగా, రెండో రోజు కన్నా మూడో రోజు 4 శాతం తగ్గిందని, దీనికి కారణం మొదటిరోజు పెద్ద గ్రామాల నుంచి ప్రజలు హాజరయ్యారని భావిస్తున్నట్లు, తర్వాత చిన్న గ్రామాల నుంచి ప్రజలు రావటం వల్ల ఇది ఏర్పడినట్లు తెలుస్తుందన్నారు. మొత్తం మూడు రోజుల్లో గ్రామసభలు 28,998 నిర్వహించారన్నారు. మూడవరోజు 1,55,009 అర్జీలు రాగా గుంటూరు నుంచి 22,179 అర్జీలు వచ్చాయని, అత్యల్పంగా శ్రీకాకుళం నుంచి 3,019 వచ్చాయన్నారు. మూడవ రోజు 7,54,412 మంది హాజరు కాగా, అత్యధికంగా గుంటూరులో 98,557 మంది హాజరుకాగా, నెల్లూరులో అత్యల్పంగా 32,096 మంది హాజరయ్యారన్నారు. మూడవ రోజు రేషన్ కార్డులు మొత్తం 25,262 పంపిణీ చేశామన్నారు. మూడవరోజు పింఛన్లు 13,262 పంపిణీ చేశామన్నారు. ఇళ్ల స్థలాలు మూడవ రోజు 4,769 పంపిణీ చేశామన్నారు. పనిముట్ల పంపిణీ మూడవరోజు 24,842 పంపిణీ చేశామన్నారు. హెల్త్ క్యాంపులు 2,527 నిర్వహించారన్నారు. మూడవ రోజు జన్మభూమి కార్యక్రమంలో 1,55,026 మంది వైద్యం కోసం నమోదు చేసుకోగా కంటి సమస్యలపై 7,108 మందికి పరీక్షలు నిర్వహించారన్నారు. వెటర్నరీ క్యాంప్‌లు మొత్తం 5,629 నిర్వహించగా, చంద్రన్న బీమా క్లైమ్స్ 22,820 మూడవ రోజు పంపిణీ చేశారన్నారు.. గురువారం జరిగిన బి యాక్టివిటీస్ కింద 23,977 మంది హాజరయ్యారని తెలిపారు. 5వ తేదీ జన్మభూమి-మాఊరు కార్యక్రమం కింద సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన సమాచారం ప్రకారం ఇప్పటివరకు 64,855 వినతులు వచ్చాయన్నారు. ప్రజలు 3,65,868 మంది పాల్గొన్నారన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఫాదర్ ఫ్రాన్సిస్, తదితరులు

7న హైదరాబాద్‌లో క్యాథలిక్ ఎంపార్కీ

హైదరాబాద్/ ఖైరతాబాద్, జనవరి 5: దేశంలో అతి పెద్ద క్యాథలిక్ ఎంపార్కీని నగరంలోని శంషాబాద్‌లో ఈనెల 7న ప్రారంభిస్తున్నట్టు ఫాదర్ ఫ్రాన్సిస్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఫాదర్లు జోసఫ్, జాన్‌సన్, ఓ. థామస్‌లతో కలిసి వెల్లడించారు. 7న బాలపూర్‌లోని సీకేఆర్-కేటీ ఆర్ కన్వెన్షన్ హాలలో జరిగే ప్రారంబోత్సవ వేడుకలకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి కురియన్ జోసెఫ్, రోమ్ ప్రతినిధి డాక్టర్ సిరిల్ వాసిల్ ఎస్‌జే, హైదరాబాద్ ఆర్చిబిషప్ రెవరెండ్ తమ్మబాల, దేశంలోని వివిధ ప్రధాన చర్చిలకు చెందిన జార్జ్ కార్డినల్ అలెన్‌చెర్రి, మోరన్ మార్ బాసిలియోస్ కార్డినల్ క్లీమిస్ తదితరులు హాజరౌతున్నట్టు తెలిపారు. కేరళ ప్రధాన కేంద్రంగా 30 డయోసిస్‌లు కలిగిన తమ కేంద్రం నగరంలో 31వ డయోసిస్‌ను ప్రారంబిస్తున్నట్టు చెప్పారు. నూతనంగా ప్రారంభం అవుతున్న ఈ సెంటర్ ద్వారా దేశంలోని 23 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగుతాయని చెప్పారు. సుమారు 400 ఏళ్లుగా హైదరాబాద్ కేంద్రంలో డయోసిస్‌ను ప్రారంభించాలని చేస్తున్న ప్రయత్నాలు సఫలం అవుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తమ డయోసిస్ ద్వారా దేశవ్యాప్తంగా సేవ కార్యక్రమాలను విస్తృత పరచనున్నట్టు వివరించారు.

త్రిపుల్ తలాక్‌ను ఆమోదించండి

• బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మాలతీరాణి

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 5: పార్టీలకు అతీతంగా త్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభలో ఆమోదించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శరణాల మాలతీరాణి కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముమ్మారు తలాక్ చెప్పి విడాకులు ఇచ్చే దుస్సంప్రదాయం నుంచి ముస్లిం మహిళలకు న్యాయం చేసేలా త్రిపుల్ తలాక్ నిషేధ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దీన్ని లోక్‌సభలో అన్ని పార్టీలు ఆమోదించాయన్నారు. అయితే ఈ బిల్లు రాజ్యసభకు వచ్చేసరికి కాంగ్రెస్ సహా విపక్షాలు ఈ బిల్లును ఆమోదించకుండా అడ్డుకుంటున్నాయని విమర్శించారు. లోక్‌సభలో ఆమోదించి రాజ్యసభలో వ్యతిరేకించడంపై రాజకీయ పక్షాలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరారు. త్రిపుల్ తలాక్ మతపరమైన అంశంగా చూడరాదని, దాన్ని మహిళలకు జరుగుతున్న అన్యాయంగా చూడాలని అన్నారు. అందుకే ఈ త్రిపుల్ తలాక్ నిషేధంపై అన్ని వర్గాల్లోని మహిళల నుంచి సానుకూల స్పందన లభించిందని గుర్తుచేశారు. విలేఖరుల సమావేశంలో మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి పాల్గొన్నారు.

18,19 తేదీల్లో ఆర్టీసీ డిపోల్లో ధర్నాలు

• ఎన్‌ఎంయూ నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 5: అపరిష్కృత డిమాండ్ల సాధనకై ఈనెల 18,19 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 128 ఆర్టీసీ డిపోల్లో ధర్నాలు నిర్వహించాలని శుక్రవారం బస్ భవన్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన గుర్తింపు సంఘం నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర విస్తృత సమావేశం నిర్ణయించింది. పే స్కేల్స్ వెంటనే అమలుచేయాలని, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్సుల సంఖ్య పెంచాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు సి.చంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పివి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ముఖ్య ఉపాధ్యక్షులు డి.సూర్యప్రకాశరావుతో పాటు జోనల్, రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దివంగత రామ్మోహనరావు హయాంలో ఉమ్మడి రాష్ట్రానికి అధ్యక్షునిగా పనిచేసి గత 14 ఏళ్లుగా ఎంప్లాయీస్ యూనియన్‌లో కీలక పాత్ర వహిస్తూ వచ్చిన ఎ.సోమరాజు నేటి సమావేశంలో తిరిగి ఎన్‌ఎంయులో చేరారు. వీరితోపాటు అనంతపురం జిల్లాలో వివిధ డిపోలకు చెందిన 200 మంది కార్మికులు ఇయు నుంచి ఎన్‌ఎంయులో చేరారని డిఎస్‌పి రావు తెలిపారు. తమ డిమాండ్లపై ఉన్నతాధికారులందరికీ ఇప్పటికే వినతిపత్రాలు సమర్పించామన్నారు.

తాంత్రిక పూజలు నిజమే?

• సర్కారు విచారణలో తేలిందిదే • పెదవి విప్పని కమిషనర్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 5: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న దుర్గగుడిలో తాంత్రిక పూజల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. గుడిలో అర్ధరాత్రి తాంత్రిక పూజలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణలో అది నిజమేనని తేలినట్లు సమాచారం. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గుడిలో తాంత్రిక పూజలు జరిగాయని, ఒక అధికారి కోసమే అవి జరిగినట్లు ప్రభుత్వ విచారణలో తేలింది. వాటిని నిర్వహించిన పూజారుల విచారణలో స్పష్టమయినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా, రాష్ట్రంలో ఈ వ్యవహారంపై రచ్చ జరుగుతున్నా దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ ఇప్పటివరకూ దుర్గగుడికి రావడం గానీ, అధికారులతో సమీక్ష నిర్వహించడం గానీ చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కమిషనర్ జన్మభూమి కార్యక్రమంలో బిజీగా ఉన్నారని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ.. ప్రభుత్వ ప్రతిష్ఠకు సంబంధించి వస్తున్న విమర్శల నేపథ్యంలో, చర్యలు తీసుకోకుండా మౌనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

నేడు కమిషనర్‌కు నివేదిక

విజయవాడ (ఇంద్రకీలాద్రి): దుర్గగుడిలో తాంత్రిక పూజల వ్యవహారంపై శనివారం లోగా పూర్తి స్థాయి నివేదికను రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ వైవి అనూరాధకు అందచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు విచారణ కమిటీ సభ్యుడు ఎన్ రఘునాథ్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం విజయవాడ పాతబస్తీ బ్రాహ్మణ వీధిలోని దుర్గగుడి పరిపాలన భవన్‌లో రఘునాథ్, కమిటీ సభ్యుడైన ఆగమశాస్త్ర సలహాదారు శ్రీరామశర్మతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. ఈసందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ సంఘటన జరిగిన రోజు సీసీటీవీ పుటేజ్‌ని తెప్పించుకొని అందులో నమోదయిన సమయాన్ని సైతం పరిగణనలోనికి తీసుకొని విచారణ ప్రారంభించినట్లు వివరించారు. దేవస్థానం అస్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాద్, వైదిక కమిటీ సభ్యుడు శంకర శౌండల్య, తదితరులతోపాటు వైదిక కమిటీ సభ్యులు అందరినీ విచారించినట్లు చెప్పారు. అనంతరం అర్చకులు, సహాయ అర్చకులు, ఆలయ సిబ్బంది, సంఘటన జరిగిన రోజు రాత్రి 9గంటల నుండి మరుసటి రోజు ఉదయం వరకు విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్, పోలీస్ సిబ్బంది, తదితరులను విచారించినట్లు తెలిపారు. దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు సభ్యులను సైతం విచారించనున్నట్లు తెలిపారు. ఆ తరువాత పూర్తి స్థాయి నివేదికను కమిషనర్‌కు అందచేస్తామన్నారు. అడిగిన ప్రశ్నలకు మాత్రమే కమిటీ ముందు హాజరైన వారు జవాబులు చెప్పినట్లు ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. దుర్గగుడి ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులతో మాట్లాడితే, నివేదికను తయారు చేసి కమిషనర్ శుక్రవారమే అందించే అవకాశం ఉందని రఘునాథ్ చెప్పారు. ఆగమ శాస్త్ర సలహాదారుడు రామశర్మ మాట్లాడుతూ అమ్మవారి ముందు క్షుద్ర పూజలు చేసే సాహసం ఎవరూ చేయరన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

విద్యుత్ శాఖలో అదనపు పోస్టుల మంజూరు

• త్వరలో మంత్రిమండలి ఆమోదం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 5: ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్కో, ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థల్లోని వివిధ విభాగాల్లో అవసరమైన అదనపు పోస్టుల మంజూరుకు సంబంధించి త్వరలోనే రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం లభిస్తుందని ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరక్టర్ దినేష్ పరుచూరి ఆశాభావం వ్యక్తం చేశారు. గుణదలలో ఆంధప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు జేఎండీ దినేష్ పరుచూరి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఏపీ జెన్కో ఫైనాన్స్ డైరెక్టర్ ఆదినారాయణ, ఏపీ ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ టీవీఎస్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దినేష్ పరుచూరి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత సిబ్బంది కొరత కారణంగా పనిభారం ఉందని, దీన్ని అధిగమించేందుకు గాను అదనపు పోస్టుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ ప్రతిపాదనలు వీలైనంత త్వరలోనే రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం పొందే అవకాశం ఉందన్నారు. ఏపీ జెన్కో ఫైనాన్స్ డైరెక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ, అకౌంట్స్ విభాగంలో పనిచేసే సిబ్బంది బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ టీవీఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏపీ విద్యుత్ సంస్థల విద్యుత్ ప్రసార, పంపిణీ నష్టాలు సింగిల్ డిజిట్‌కు చేరుకున్నాయన్నారు. ఇందులో సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యరాజు, ప్రధాన కార్యదర్శి రమణరావు, ఏపీ జెన్కో ఎఫ్ఎ బివి రెడ్డి, డైరీ కమిటీ ప్రతినిధులు సత్యనారాయణ, నాగశ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

పోలీస్ స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్య

రేపల్లె, జనవరి 5: ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుంటూరు జిల్లా రేపల్లె పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని గుడికాయలంక గ్రామానికి చెందిన యరగళ్ల శ్రీనివాసరరావు(21) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. పండ్లవ్యాపారం కూడా చేస్తుంటాడు. శ్రీనివాసరావు స్థానిక 16వ వార్డుకు చెందిన బాలికతో కొంతకాలం నుండి ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడు. ఈ నేపథ్యంలోనే ఇరువురు నాలుగు రోజుల క్రితం ఇంటిలో చెప్పకుండా వివాహం పేరుతో వెళ్లిపోయారు. కూతురు స్కూల్ నుండి ఇంటికి రాకపోవటంతో రేపల్లె పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా పోలీసులు గాలించి పట్టుకొచ్చి వారి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు అత్యాచారయత్నం చేసి, బాలికను హింసించి నరకం చూపాడని మరో ఫిర్యాదు చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ నిమిత్తం ఆటోడ్రైవర్ శ్రీనివాసరావును గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని స్టేషన్ వెనుకవైపు వున్న ఖాళీ స్థలంలో ఉంచారు. రాత్రి 9 గంటల సమయంలో శ్రీనివాసరావు అక్కడ ఉన్న తాడుతో బాత్‌రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు వివరించారు. డ్యూటీ ఎక్కిన సెంట్రీకి శ్రీనివాసరావు కనిపించకపోవటంతో కంగారుగా వెతకగా బాత్‌రూంలో గడిపెట్టి వుండటాన్ని గమనించిన పోలీసులు బాత్‌రూం తలుపు పగలగొట్టగా శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడి వుండటాన్ని గమనించారు. వెంటనే అస్పత్రికి తరలించినా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆందోళనకు దిగిన మృతుడి బంధువులను రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ శాంతింపచేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాపట్ల డిఎస్పీ గంగాధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి-అనంత ఎక్స్‌ప్రెస్ హైవే

భూసేకరణకు 'రాజధాని ప్రయోగం'?

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన అమరావతి- అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవేకు కావాల్సిన భూమిని రాజధాని అమరావతి తరహాలో సమీకరించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. భూసేకరణకు నిధుల కేటాయింపు విషయమై కేంద్రం మొండి చేయి చూపిన నేపథ్యంలో ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. భూసేకరణ బదులు భూసమీకరణ చేస్తే ఏలా ఉంటుందన్న అంశంపై దృష్టి సారించింది. రాజధాని అమరావతి నుంచి అనంతపురం వరకూ నాలుగు జిల్లాల మీదుగా ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం న నిర్ణయించింది. ఈ రహదారికి సమాంతరంగా రైల్వే లైను వేసే అంశం కూడా పరిశీలనలో ఉంది. రహదారి నిర్మాణానికి దాదాపు 26 వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. రహదారి నిర్మాణానికి కావాల్సిన భూమిలో ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించి భూమి 23 వేల ఎకరాలు ఉంది. ఈ భూమిని సేకరించేందుకు దాదాపు 2500 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారి నిర్మాణ ఖర్చును భరించేందుకు ముందుకు వచ్చింది. భూసేకరణ చేసి ఇవ్వాలన్న షరతు విధించింది. దీంతో అసలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఇంత ఖర్చును భూసేకరణ కోసం భరించే స్థితిలో లేదు. ఇప్పటికే భూసేకరణ కార్యాలయాలను ఐదు చోట్ల ఏర్పాటు చేసి, భూసేకరణ ప్రక్రియకు అవసరమైన ముందుస్తు చర్యలు తీసుకున్నారు. భూసమీకరణకు నిధులు ఇచ్చేందుకు కేంద్రం విముఖత చూపుతుండటంతో ప్రత్యామ్నాయలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాజధాని తరహాలో భూసమీకరణ చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. అయితే భూములు ఇచ్చే వారికి ఏ విధమైన లబ్ధి, ఎలా చేకూర్చాలన్న అంశంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

గుంటూరు ట్రెజరీ 'స్కాం'లపై తుది దశకు విచారణ

• బెంబేలెత్తుతున్న అధికారులు, సిబ్బంది

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 5: ఏడాది క్రితం ప్రభుత్వ ట్రెజరీ కార్యాలయాల్లో భారీ అవినీతి అక్రమాలకు తెరలేపిన గుంటూరు జిల్లాలోని ఉప ఖజానా కార్యాలయాలపై ఇంతకాలం సాగుతూ వస్తున్న విచారణ ఆఖరి దశకు చేరుకుంది. దీంతో గుంటూరు, తెనాలి, రేపల్లె సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది బెంబేలెత్తుతున్నారు. గుంటూరు కార్యాలయంలో జరిగిన ప్రభుత్వ నిధులు అక్రమ తరలింపుపై ఇటీవల నెల రోజులు పైగా విచారణ జరిపి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందజేసిన విశాఖపట్టం సహాయ ఖజానా అధికారి షాబ్జాన్ తన తుది విచారణను శుక్రవారం గుంటూరు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ప్రారంభించారు. తొలి రోజున తాను గతంలో జారీచేసిన నోటీసులు అందుకున్నవారిని పిలిపించుకుని విచారణ జరిపారు. ఈ విచారణలో కనీసం మరో నాలుగైదు రోజులపాటు జరుగనున్నదని విశ్వసనీయంగా తెలియవచ్చింది. 2014 సంవత్సరంలో అటు ఉద్యోగిని ఇటు పెన్షనర్ కూడా కాని కామేశ్వరి అనే మహిళ బ్యాంక్ ఖాతాకు 9లక్షల రూపాయలు జమ కాగా ఆ తర్వాత ఎప్పటికో ఈ స్కాం వెలుగులోకి రావటంతో 2017లో గుట్టుచప్పుడు కాకుండా ఆ మొత్తాన్ని తిరిగి జమచేసినప్పటికీ అప్పట్లో దీనికి బాధ్యునిగా గుర్తించిన అధికారి ఒకరు నేటికీ ఆ కార్యాలయంలో కొనసాగుతుండటం గమనార్హం. అయితే ప్రాథమిక విచారణ సమయంలో జిల్లా ట్రెజరీ అధికారి సురేంద్రబాబు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి ఆ తర్వాత డిప్యుటేషన్‌పై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి వెళ్లారు. ఇక తెనాలి కార్యాలయంలో జరిగిన భారీ స్కాంపై తుది విచారణ నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డైరక్టర్ బోగారావు ఈనెల 10తేదీ తెనాలి రానున్నారు. ఈ భారీ స్కాంతో సంబంధం ఉందన్న ప్రాథమిక అభియోగాలపై 15 మంది సిబ్బందికి నోటీస్‌లు జారీ అయ్యాయి. ఇందులో ఒకరు సస్పెండ్ కాగా. మరో ఇద్దరు పదవీ విరమణ చేశారు. ఈనెల 10తేదీ వీరినందరినీ విచారించనున్నారు. ఇక రేపల్లె ఉప ఖజానా కార్యాలయం పరిధిలో విశ్వేశ్వరరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔట్ సోర్సింగ్‌లో ఒకే ఒక్కరు పనిచేస్తుంటే పది మంది బినామీ పేర్లతో దాదాపు 18 మాసాలపాటు రూ.10లక్షల మేర జీతాల చెల్లింపులు జరిగాయి. ఈ స్కాంలో అప్పట్లో గుంటూరు జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన గోపీనాయక్ ఇటీవల విజయవాడ కార్పొరేషన్‌లో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తుండగా సస్పెండ్ చేశారు. ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా రేపల్లె ఉప ఖజానా కార్యాలయంలో నాడు పనిచేసిన ఏడుగురిని కూడా సస్పెండ్ చేశారు. వీరిలో ఇద్దరు ఇటీవలే పదవీ విరమణ చేశారు. గుంటూరు జిల్లా తర్వాత దశలవారీగా ఇతర అన్ని జిల్లాల్లోనూ తుది విచారణకు రంగం సిద్ధమైంది.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు 12న ధర్మయుద్ధం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 5: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌పై ఈ నెల 12వ తేదీ ప్రభుత్వంపై ధర్మయుద్ధాన్ని జరుపబోతున్నామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. దేశంలో తొలిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమస్యపై స్పందించి గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ పునరుద్ధరిస్తూ గత జూన్, జూలై మాసాల్లో జారీ అయిన జీవోలు 107, 121 నేటికీ అమలు కాలేదన్నారు. శుక్రవారం ఆయన ఇతర నేతలతో కలిసి విలేఖరులతో మాట్లాడుతూ ఈ జీవోలు అమలుతో పాటు సీపీఎస్ రద్దు కోసం సహా రాష్ట్ర ట్రెజరీ శాఖ డైరెక్టర్ కార్యాలయంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని సబ్ ట్రెజరీ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నామన్నారు.

అదే విధంగా ఫిబ్రవరి 9,10,11 తేదీల్లో కాకినాడలో 5వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.



బీసీ సంఘాల రాష్ట్రస్థాయి సమావేశానికి హాజరైన నేతలు

ముద్రగడ వ్యాఖ్యలు సరికాదు

• బీసీ సంఘాల అభ్యంతరం

• కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు, జనవరి 5: కాపు రిజర్వేషన్‌ను నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం ప్రకటిస్తే, ముద్రగడ సంక్రాంతిలోపు 15 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు విమర్శించారు. రాజ్యాంగాన్ని అతిక్రమించి రిజర్వేషన్లు కల్పిస్తే బీసీలు చూస్తూ ఊరుకోరని, న్యాయపోరాటం చేస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వాలు బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక నగరంపాలెంలోని కెఅండ్ఎం సమావేశ మందిరంలో సంఘ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం ప్రధాన కార్యదర్శి అంగిరేకుల ఆదిశేషు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి సంఘ నిర్మాణం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర కార్యాలయాన్ని గుంటూరులో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సమర్ధులకు పదవులు కేటాయించి సంఘాన్ని పునర్వవస్థీకరించడంతో పాటు ప్రతి సభ్యునికి గుర్తింపుకార్డులతో, సభ్యత్వాన్ని కూడా జారీ చేయనున్నట్లు తెలిపారు.

కేంద్రంపై టీడీపీ దుష్ప్రచారం

బీజేపీ నాయకురాలు పురంధ్రీశ్వరి



పలాస, జనవరి 5: టీడీపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురంధ్రీశ్వరి ఆరోపించారు. ఇక్కడి దీనదయాళ్ ప్రాంగణంలో శుక్రవారం బీజేపీ బూత్ కమిటీ మహా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు బీజేపీ లక్ష్యాలను నిర్దేశించి అనంతరం ప్రత్యేకంగా విలేఖరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అనవసర రాద్ధాంతం చేస్తోందని, ఆ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం పూర్తి చేస్తుందని, ఇందుకు జలవనరుల శాఖ మంత్రి గడ్కరీ ప్రతి నెల ప్రాజెక్టు పనులను స్వయంగా పరిశీలిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పంపిణీలో బీజేపీ కార్యకర్తలకు అవకాశం ఇవ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని, కేంద్రం అందిస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం హైజాక్ చేసి తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీతో పొత్తు విషయమై జాతీయ పార్టీ నిర్ణయం తీసుకుంటుందని, ఇక్కడ జరుగుతున్న విషయాలన్నీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లడమే మా బాధ్యత అని అన్నారు. ఏ పార్టీతో పొత్తు లేకుండా 175 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను బరిలో దింపుతామని స్పష్టం చేశారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ ఒడిశావాసుల అభ్యర్థనతో సాంకేతిక సమస్యలు ఉన్నాయన్నారు. లేకుంటే ఇప్పటికే మంజూరు అయ్యేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీఆర్ రవీంద్రరాజు, రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాల్, బీజేపీ నాయకులు కె.నారాయణరావు, కణితి విశ్వనాథం, పి.సన్యాసిరాజు, పూడి తిరుపతిరావు, రవీంద్ర, చిరంజీవి, ఆత్రేయ ప్రసాద్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ట్రాయ్ మిషనరీ సీజ్‌కు యత్నం

రూ.120 కోట్ల వసూలుకు రంగంలో దిగిన దేనా బ్యాంకు అధికారులు

పోలవరం, జనవరి 5: ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్న ట్రాన్స్‌ట్రాయ్ కాంట్రాక్టు ఏజన్సీకి ప్రాజెక్టు నిర్మాణం ప్రాంతంలో ఉన్న యంత్రాలను దేనా బ్యాంకు అధికారులు శుక్రవారం సీజ్‌చేయడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ప్రభుత్వానికి చెందిన ప్రాజెక్టు నిర్మాణ స్థలంలోని యంత్రసామాగ్రిని సీజ్‌చేసే అధికారం బ్యాంకు అధికార్లకు లేదని జిల్లా యంత్రాంగం స్పష్టంచేయడంతో వ్యవహారం వివాదాస్పదంగా మారింది. వివరాలిలావున్నాయి... ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ వివిధ వాహనాలు, యంత్రపరికరాల కొనుగోలుకు నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లోని దేనా బ్యాంకు నుండి రూ.87 కోట్లు రుణం తీసుకుంది. అయితే అప్పటి నుంచి ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామని బ్యాంకు ఏజీఎం ప్రకాశరావు తెలిపారు. వడ్డీతో సహా తమ బ్యాంకుకు చెల్లించాల్సిన రూ.120 కోట్ల బకాయిల నిమిత్తం సంస్థకు చెందిన మిషనరీ సీజ్ చేయడానికి గత సంవత్సరం నవంబర్ 29న హైకోర్టు ఉత్తర్వులు జారీచేసినట్టు తెలిపారు. దీంతో కోర్టు నియమించిన అడ్వకేట్ కమిషనర్ డీ రాజారత్నంను వెంటబెట్టుకుని బ్యాంకు కాకినాడ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ డీ వెంకటేశ్వరరావు ఇతర సిబ్బంది శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి చేరుకున్నారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణ ప్రాంతంలో వోల్వో కంపెనీకి చెందిన మోడల్ 700, మరో మోడల్ 480 పొక్లయినర్లను సీజ్ చేశారు. అలాగే మరో పొక్లయినర్ 902 కొండపై గుర్తించి దానినీ



నిర్మాణ ప్రాంతంలో మెషినరీ సీజ్ చేయడానికి వచ్చిన బ్యాంకు అధికారులు

సీజ్ చేశారు. 902 కొండ వద్ద బ్యాంకు సిబ్బంది ఉండగా, కలెక్టర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఆర్డీవో కే మోహన్‌కుమార్ అక్కడకు చేరుకుని ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న మిషనరీని సీజ్ చేస్తే పనులు ఆగిపోతాయని, సీజ్ చేసే విషయం ముందుగా కలెక్టర్‌కు గానీ, కంపెనీ ప్రతినిధులకు గానీ తెలియజేయాల్సి ఉందని ఏజీఎం ప్రకాశరావుకు తెలిపారు. బకాయిలు చెల్లించమని హైదరాబాద్‌లో ట్రాన్స్‌ట్రాయ్ కార్యాలయానికి వెళ్లినా స్పందించడం లేదని, హైకోర్టు ఉత్తర్వులు వచ్చినా వారిలో ఏ విధమైన స్పందన లేకపోవడంతో సీజ్ చేసేందుకు వచ్చామని ఏజీఎం తదితర బ్యాంకు అధికారులు ఆర్డీవోకు తెలిపారు. కొద్ది రోజులు వేచిచూస్తే, జిల్లా కలెక్టర్ ట్రాన్స్‌ట్రాయ్ ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తారని ఆర్డీవో తెలపడంతో ఏజీఎం అక్కడ నుంచే బ్యాంకు ఉన్నతాధికారులకు ఫోను ద్వారా విషయాన్ని వివరించారు. అయితే బ్యాంకు ఉన్నతాధికారులు మాత్రం మిషనరీ సీజ్ చేయమని ఆదేశించడంతో ఆ విషయాన్ని ఏజీఎం ప్రకాశరావు ఆర్డీవో, అక్కడకు వచ్చిన ఇరిగేషన్ శాఖ ఈఈలు సుధాకర్, ఎస్ఈ హుస్సేన్‌కు తెలిపారు. పోలవరం నిర్మాణ ప్రాంతంలో మిషనరీ సీజ్ చేసే అధికారం బ్యాంకు అధికార్లకు లేదని ఈసందర్భంగా ఆర్డీవో ఏజీఎంకు స్పష్టంచేశారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం ట్రాన్స్‌ట్రాయ్ కార్యాలయం కాదని, ప్రభుత్వానిదని, మిషనరీ కొనుగోలుకు కాంట్రాక్టు ఏజెన్సీకి ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చిందని ఆయన బ్యాంకు అధికారులకు తెలిపారు. తాము హైకోర్టు ఉత్తర్వులతో వచ్చామని బ్యాంకు ఏజీఎం చెప్పడంతో జిల్లా కలెక్టర్ కూడా మెజిస్ట్రేట్ కదా... ఆయనను కలిసి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో మోహన్‌కుమార్ అన్నారు. దీంతో బ్యాంకు జోనల్ హెడ్ సంతోష్, రికవరీ అధికారి రాంబాబు కలెక్టర్‌ను కలవడానికి బ్యాంకు అధికారులు జిల్లా కేంద్రం ఏలూరు వెళ్లారు. కలెక్టర్ భాస్కర్ అందుబాటులో లేకపోవడంతో వేచి చూసి, వెనుదిరిగారు. ఈ విషయమై శనివారం మరోసారి ప్రయత్నించి, తదుపరి నిర్ణయం తీసుకుంటామని బ్యాంకు అధికారులు తెలిపారు.


ఏపీని అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు



దర్శసాగరం సభలో ప్రసంగిస్తున్న సీఎం

నర్సీపట్నం, జనవరి 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచంలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. విశాఖ జిల్లా నర్సీపట్నం మండలంలోని దర్శసాగరం గ్రామంలో శుక్రవారం జన్మభూమి-మావూరు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహం వలన రాష్ట్ర విభజన హేతుబద్ధంగా జరగలేదన్నారు. కట్టుబట్టలతో వచ్చేశామన్నారు. మూడున్నరేళ్ళు శ్రమించడం వలన మంచి ఫలితాలు వస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో మరింత కష్టపడితే మన రాష్ట్రం మంచి అభివృద్ధిలోకి వస్తుందన్నారు. హైదరాబాద్‌ను నాలెడ్జ్ నగరంగా తీర్చిదిద్దడానికి ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. పారిశ్రామికవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు జన్మభూమి రుణం తీర్చుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జన్మభూమికి సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఈసారి జన్మభూమిలో ప్రజల నుంచి వచ్చే ప్రతీ ఫిర్యాదును పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతీ ఇంటిని విజ్ఞాన ఖనిగా చేయడానికి ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఆహార భద్రతను కల్పించామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతీ కుటుంబానికి పెద్ద కొడుకుగా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి బాబు పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో 50 లక్షల సామాజిక పింఛన్లు ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కుటుంబాల్లో ఆడ పిల్లల పెళ్లికి 30 వేల నుంచి 50 వేల రూపాయల వరకు ఇచ్చేందుకు పెళ్లి కానుక పథకాన్ని వచ్చే మార్చి నెల నుంచి అమలు చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పెంచుతామని, విద్యార్థులకు వర్చువల్ డిజిటల్ సౌకర్యాలను కల్పిస్తున్నామని బాబు వివరించారు. అలాగే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 75 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. మార్చిలోగా ఓడీఎఫ్ రాష్ట్రంగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేదవాళ్లకు రాష్ట్రం ఒకటిన్నరేళ్లలో 19 లక్షల ఇళ్ళు నిర్మిస్తామని, ప్రతీ కుటుంబానికి 10 వేల రూపాయల ఆదాయం వచ్చే విధంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నామని, గ్రామీణప్రాంతాల్లో నూరుశాతం సిమెంట్ రోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అన్ని గ్రామాలకు ఎల్ఇడి బల్బుల సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును 25 వేల కోట్ల రూపాయలతో చేపడుతున్నామని వివరించారు. ఈప్రాజెక్టు పూర్తయితే లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రెండో దశలో పోలవరం ప్రాజెక్టు పూర్తితోపాటు వంశధార నుండి పెన్నా వరకు నదుల అనుసంధానం చేస్తామన్నారు. భూగర్భజలాల పెంపునకు పలు కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సాగునీరు, ఎరువుల కొరత లేకుండా చేసి వ్యవసాయ పంటల దిగుబడిని పెంచి సుస్థిర వ్యవసాయానికి నాంది పలుకుతామని, అవినీతి లేని సుపరిపాలన అందించేందుకు ముందుకు వెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వం అస్తవ్యస్త పాలన వలన పలు సమస్యలు ఏర్పడుతున్నాయని, వనరులను సక్రమంగా వినియోగించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో ఇటీవల నియమించిన సాధికార మిత్రలు బ్రహ్మాండంగా పనిచేస్తున్నారని చెప్పారు. ప్రజల కష్టసుఖాలు చూడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. వీరి సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.



కోస్ట్‌గార్డు అమ్ముల పొదిలో మరో నౌక

ముత్తుకూరు, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ శుక్రవారం కృష్ణపట్నం ఓడరేవులో సి-436 కోస్టుగార్డ్ గస్తీ నౌకను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత గోపాలపురం కెఇఎస్‌ఎస్‌పిఎల్ శిక్షణ కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆక్వసెక్యూరిటీ నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. తదుపరి పోర్టు సిఇఓ. అనిల్ యండ్లూరితో కలిసి ఓడరేవుకు చేరుకున్నారు. అనంతరం తీరప్రాంత రక్షణ నౌకాదళం నుంచి గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై చీఫ్ సెక్రెటరీ దినేష్‌కుమార్ మాట్లాడారు. తీరప్రాంత పరిరక్షణలో గస్తీ నౌకలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఇప్పటికే కొన్ని గస్తీ నౌకలు ఓడరేవు కోస్టుగార్డ్‌కు ఉన్నప్పటికీ ప్రభుత్వం మరో గస్తీ నౌకను ఏర్పాటు చేయడంతో తీరంలో రక్షణ మరింత ప్రతిష్ఠం కానున్నదని తెలిపారు. తీవ్రవాదులు సముద్ర తీరంలోకి చొరబడకుండా ఎప్పటికప్పుడు గస్తీ నిర్వహించేందుకు ఈ నౌక ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సి-430 గస్తీనౌక 45 నాటికల్ మైలు వేగమంతంతో ప్రయాణిస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అన్నారు. కోస్టుగార్డ్ సిబ్బంది సముద్రంలో గస్తీ నిర్వహించడం సాహసంతో కూడుకున్న పని అని ఆయన తెలిపారు. అనంతరం కోస్టుగార్డ్ ముఖ్య అధికారులు మాట్లాడుతూ శత్రువుల కదలికలను పసిగట్టడంలో సి-430 గస్తీ నౌక ప్రత్యేక టెక్నాలజీతో ఏర్పాటయిందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దినేష్‌కుమార్ రిమోట్ ప్రజంటేషన్ ద్వారా గస్తీనౌకను ప్రారంభించారు. పోర్టు సిఇఓ అనిల్ యండ్లూరి, కోస్టుగార్డ్ అధికారులతో నౌకను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు పీఆర్ హెడ్ వేణుగోపాల్, కోస్టుగార్డు అధికారులు ఎకె హర్‌బోలా, రాజన్ బరగోత్రా పాల్గొన్నారు.

పులికాట్‌లో కిలకిలా రావాలు

సూళ్లూరుపేటలో రేపటి నుంచి పక్షుల పండుగ

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, జనవరి 5 : విదేశీ విహంగాల విడిది కేంద్రాలకు పండుగ కళ వచ్చింది...పులికాట్ సరస్సు, నేలపట్టులో కిలకిల రావాలుచేస్తూ పడవల అందాలు ప్రకృతి ప్రేమికులను పరవశ కరింపజేసే పక్షులు సందర్శకుల కనువిందుకు సిద్ధమవుతున్నాయి. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట జూనియర్ కళాశాల వేదికగా ఈనెల 7నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ పేరిట వైభవంగా నిర్వహించనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్ని జిల్లా అధికార బృందం సర్వం సిద్ధం చేశారు. ప్రారంభం రోజు రాష్ట్ర మంత్రులు భూమా అఖిలప్రియ, పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, శిద్దా రాఘవరావు రానున్నారు. మంత్రి నారా లోకేష్ ప్రారంభానికి లేదా ముగింపు రోజు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ ముత్యాల రాజు ఆదేశాల మేరకు జెసి ఇంతియాజ్ అహ్మద్ ఇప్పటికే పైడాయం, బీవీపాలెం, నేలపట్టు వసతులకు కల్పనకు ప్రత్యేక కమిటీలు నియమించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నారు. బీవీపాళెం పడవల రేవు వద్ద సందర్శకులు ఉచితంగా బోటు షికారు చేసేందుకు, పులికాట్‌ను సందర్శించేందుకు ప్రత్యేక ఉచిత బస్సులతో పాటు తాగునీటి సౌకర్యం అన్ని వసతులు కల్పించారు. సాయం వేళల్లో సినీ తారలచే సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. విదేశాల నుంచి శీతాకాలంలో విదేశీ పక్షులు పులికాట్ సరస్సు, నేలపట్టు ప్రాంతాలకు వలస వస్తాయి. ఇక్కడకు ఆస్ట్రేలియా, శ్రీలంక, సైబీరియా తదితర దేశాల నుంచి శీతాకాలంలో ఆహారం కోసం వలస వచ్చి ఇక్కడే గుడ్లు పెట్టి పొదిగి పిల్లలకు రెక్కలు వచ్చిన తరువాత వాటితోకలిసి ఎగిరిపోతాయి. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం గూడ బాతుల సంతానోత్పత్తి కేంద్రంగా ప్రసిద్ధి గాంచింది. అరుదైన నత్తగుల్ల కొంగ, నీటికాకి, తెల్లకంకణాయి, శకలి కొంగ, ఎర్రకాళ్లకొంగ, పెలికాన్, సముద్రపు రామ చిలుక(ఫ్లెమింగో), నారాయణ పక్షి, గార్దభి తదితర 117 రకాల పక్షులు ఇక్కడే వస్తాయి. విదేశీ అతిథులకు స్వాగతం పలుకుతూ విస్తృతమైన ఏర్పాట్లు చేశారు.




అదనపు బిల్లులతో ఖజానాకు చిల్లు

- ★ పోలవరం నిర్మాణాలపై శ్వేతపత్రం అడిగితే కోపం ఎందుకు?
- ★ పనుల నాణ్యతపై అనుమానాలున్నాయి: ఉండవల్లి

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 5: పోలవరం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న ఆటవల్ల ఆంధ్రప్రదేశ్ నాశనం అవుతోందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. పోలవరం ప్రాజెక్టులో చేసిన పని కంటే అదనంగా బిల్లులు పెట్టారని నిరూపించడానికి తాను సిద్ధమన్నారు. పోలవరంలో కనీస స్థాయిలో కూడా పనులు జరగడం లేదని, ప్రజలను వంచనకు గురి చేస్తే క్షమించరని విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రహించాలన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం ఉండవల్లి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరుతుంటే ముఖ్యమంత్రికి ఎందుకు కోపం వస్తుందో తెలియడం లేదన్నారు. పనుల నాణ్యతపై అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తిచేయాలన్నారు. నాణ్యతలో పెద్దగా తేడా వస్తే కనీసం ప్రశ్నించడానికి కూడా ప్రజలు మిగలరన్నారు. ఇప్పటికే పోల




వరం ప్రాజెక్టులో చిల్లింగ్ ప్లాంట్ కూడా నిర్మాణం జరిగిన క్రమంలో 2019 నాటికి పోలవరం పూర్తవుతుందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ 2015 నివేదిక మేరకు 2019 నాటికి పోలవరం పూర్తికాదని తేల్చిందన్నారు. విభజన చట్టంలో పొందుపరచిన గాలేరు నగరి ప్రాజెక్టుకు సంబంధించి 2014 నాటికి రూ.5013 కోట్లు ఖర్చుపెట్టారని, ఈ మూడున్నరేళ్లలో రూ.1945 కోట్లు మొత్తం రూ. 6958 కోట్లు ఖర్చుపెట్టారని, అయితే కడప జిల్లాలో జన్మభూమి వేదికపై ఈ వివరాలు చెబుతున్న ఎంపీని ముఖ్యమంత్రి విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. వైఎస్ హయాంలో జరిగిన పనిని ప్రస్తావిస్తే అంత ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. అదే విధంగా వెలిగొండలో రూ. 4492 కోట్లు ఖర్చు చేస్తే చంద్రబాబునాయుడు వచ్చిన తర్వాత రూ. 3905 కోట్లు ఖర్చు చేశారని, హంద్రీనీవాలో రూ. 9839 కోట్లు ఖర్చు చేస్తే బాబు వచ్చిన తర్వాత రూ. 6500 కోట్లు ఖర్చు చేశారని, వైఎస్ హయాంలో పూర్తయిన పని శాతాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఎంపీ చెబుతుంటే మైకు లాక్కోవడం సరికాదని అన్నారు. గత నెల 31 నుంచి డిసెంబర్ వరకు పనులు జరిగిన తీరును పరిశీలిస్తే.. ఎర్త్‌వర్క్‌లో 5 శాతం, కాంక్రీటు పనిలో 6 శాతం మాత్రమే జరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రిని శ్వేతపత్రం కోరుతుంటే నెట్‌లో అన్నీ వివరాలు వుంటాయని చెబుతున్నారని, నెట్‌లో పరిశీలిస్తుంటే పాస్‌వర్డు అడుగుతోందని, సీఎం పెట్టిన వర్చువల్ నివేదికల్లో మాత్రం త్రివేణి సంస్థ వివరణ ఒకటి తెలిపిందని, అవిమిటంటే పేమెంట్ లేక మిషన్ కదలడానికి ఆయిల్‌కు డబ్బుల్లేవని పెట్టారన్నారు.

ఎక్కడికీ పారిపోలేదు

టీవీ యాంకర్ ప్రదీప్

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, జనవరి 5: తాగి వాహనం నడిపి డిసెంబర్ 31 రాత్రి పోలీసు తనిఖీల్లో దొరికిపోయి, కౌన్సిలింగ్‌కు గైర్హాజరవుతున్న టీవీ యాంకర్ ప్రదీప్ ఎట్టకేలకు నోరు విప్పాడు. పోలీసులు నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సి ఉండగా శుక్రవారం వరకు రాకపోవడంతో ప్రదీప్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం జరిగింది. మరోవైపు పోలీసులు కూడా ప్రదీప్ కోసం గాలించి కనిపించకపోవడంతో నిబంధనల ఉల్లంఘన కింద అరెస్టు చేయాల్సి ఉంటుందని హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితిలో శుక్రవారం టీవీ చానెళ్లకు తాను మాట్లాడుతున్న వీడియో క్లిప్పింగ్స్‌ను పంపించాడు. 'నేను ఎక్కడికీ పారిపోలేదు, ముందుగా అంగీకరించిన కార్యక్రమాల షూటింగ్‌లలో బిజీగా ఉండడం వల్ల కౌన్సిలింగ్‌కు హాజరు కాలేకపోయాను, ఫోన్లు ఎక్కువగా వస్తుండడం వల్ల కొన్ని ముఖ్యమైన కాల్స్ కూడా మాట్లాడలేకపోయాను, పోలీసులు, కోర్టు నిబంధనలను తప్పకుండా పాటిస్తాను, గతంలో ఒక వీడియోలో మద్యం తాగి వాహనం నడపవద్దని తాను చెప్పడం జరిగింది, కానీ అనుకోని పరిస్థితిలో నేనే తప్పు చేశాను, నిబంధనలు ఉల్లంఘించిన మాట వాస్తవమే, దయచేసి క్షమించండి, నేను చేసిన తప్పు ఇక మీదట ఎవరూ చేయవద్దు, నేనే వచ్చి పోలీసు కౌన్సిలింగ్‌కు హాజరవుతా' అంటూ ఆ వీడియోలో సమాచారం ఇచ్చారు. కాగా ప్రదీప్ శుక్రవారం లోగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సి ఉంది.

హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

దుర్గగుడి వ్యవహారంపై రఘువీరారెడ్డి డిమాండ్

విజయవాడ (కార్పొరేషన్), జనవరి 5: కనకదుర్గమ్మ అమ్మవారి గుడిలో జరిగిన తాంత్రిక పూజలపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. గతంలో 9ఏళ్ల టీడీపీ పాలనలో అమ్మవారి కిరీటం దొంగల పాలైతే, నకిలీ కిరీటం పెట్టి మభ్య పెట్టిన వైనాన్ని మరిచిపోకుండానే ఇప్పుడు మళ్లీ తాంత్రిక పూజల నిర్వహణతో టీడీపీ పాలకులు భక్తుల మనోభావాలను దెబ్బతీయడం ఆందోళనకరం అన్నారు. ఏపీ యువజన కాంగ్రెస్ సంస్థాగత సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి ఆలయంలో తాంత్రిక పూజలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై అధికారులు, మంత్రులు పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని, దీనిపై టీడీపీ ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ నివేదిక అంతా కంటితుడుపుగానే ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ ఎమ్మెల్యే తహశీల్దార్‌పై దాడి చేసిన ఘటన, గోదావరి పుష్కరాల తొక్కిసలాటలో జరిగిన ప్రాణనష్టం ఘటన, కృష్ణా, గోదావరి పవిత్ర సంగమం వద్ద జరిగిన బోటు ప్రమాదం ఇలా..గతంలో జరిగిన అనేక ఘటనలపై వేసిన కమిటీల విచారణ నివేదికలపై ఇంతవరకు అతీగతీ లేదని గుర్తు చేసిన ఆయన ప్రస్తుత కమిటీ పై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. తాంత్రిక పూజలు ఎవరు, ఎవరి కోసం జరిపించారన్న విషయాన్ని వాస్తవాలు బహిర్గతమైతేనే ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా ఉంటాయన్నారు. యూత్ కాంగ్రెస్ నమోదుకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సును నిర్ణయించామని, ఫిబ్రవరి 28వ తేదీతో ముగిసే ఈ నమోదు ప్రక్రియ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల వారీగా జరుగుతుందన్నారు. జన్మభూమి సభల నిర్వహణలో ప్రభుత్వ డొల్లతనం కనిపిస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారం కన్నా అధికార టీడీపీ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్న వైనం అప్రజాస్వామ్యమన్నారు. ప్రజా ధనంతో నిర్వహిస్తున్న సభలలో మళ్లీ మాకే ఓటువేసి గెలిపించాలని, మమ్మల్నే అధికారం గెలిపించాలంటూ చెప్పడం ప్రసంగాలు అనైతికమన్నారు. మార్చి లోపు మరుగుదొడ్డి నిర్మించకపోతే డీలర్ చేస్తామనడం చంద్రబాబు మాటలు అర్థరహితమైనవన్నారు, మరుగుదొడ్లు కట్టుకునేందుకు వీలుగా స్థలాలు లేని నిరుపేదలు లక్షలాది మంది ఉన్నారని, వారు ఏవిధంగా దొడ్లను కట్టుకుంటారో స్పష్టం చేయాలన్నారు. కట్టిన వాటికి సకాలంలో బిల్లులివ్వకుండా వేధిస్తున్న యంత్రాంగం చర్యలు గర్హనీయమన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుపై ప్రధాని నరేంద్ర మోదీ వద్ద దీక్ష చేసేస్థితిలో ప్రయోజనం చేకూర్చిందన్నారు.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
శనివారం, 6 జనవరి 2018

అనివార్య పరిణామం

అమెరికా చర్య తీసుకుంది. ఐదారు సంవత్సరాలుగా హెచ్చరికలతోను బెదిరింపుల తోను "సరిపుచ్చిన" అమెరికా ప్రభుత్వం శుక్రవారం పాకిస్తాన్‌పై 'బ్రహ్మాస్త్ర' ప్రయోగం చేసింది. పాకిస్తాన్‌కు అందజేస్తున్న 'రక్షణ సహాయం' నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. జిహాదీ ఉగ్రకలాపాలకు పాకిస్తాన్ ప్రభుత్వం పాల్పడుతున్నంతకాలం ఈ 'రక్షణ నిధి'ని అంద చేయరాదన్నది అమెరికా ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన నిర్ణయం.. ఈ నిర్ణయం మన ప్రభుత్వానికి లభించిన వ్యూహాత్మక విజయం! ఈ నిర్ణయం వల్ల పాకిస్తాన్‌కు అమెరికా నుంచి ఈ "ఏడాది లభించవలసిన" దాదాపు పదిహేడు వందల కోట్ల రూపాయల సైనిక సహాయం 'ఆగి పోయిందట'! దీర్ఘకాల పథకం కింద గత సంవత్సరాలలో అమెరికా అందజేయగల మరో నాలుగువేల కోట్ల రూపాయిల ప్రభుత్వ సహాయం కూడ పాకిస్తాన్‌కు అందబోదు. "గత పదిహేను సంవత్సరాలు అమెరికా ప్రభుత్వం అమాయ కంగా - తెలివితేటలు లేకుండా - పాకిస్తాన్‌కు దాదాపు రెండు లక్షల పదిహేడు వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందజేసింది.." అన్నది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాలుగు రోజుల క్రితం చెప్పిన మాట! అయితే పాకిస్తాన్ మాత్రం తమ దేశాన్ని వంచించిందని, అబద్ధాలు చెప్పిందని అమెరికా అధ్యక్షుడు ఆరోపించాడు! పాకిస్తాన్ జిహాదీ బీభత్సకారులకు 'స్వర్గం'గా మారిందన్నది అమెరికా అధ్యక్షుడు కొత్తగా ధ్రువపరచిన పాత నిజం!! ప్రత్యక్ష పరోక్ష బీభత్స చర్యలకు సృష్టి చెప్పుకొని యున్నట్టయితే 'సహాయాన్ని' ఆపివేస్తామని గత రెండేళ్లలో అమెరికా ప్రభుత్వం పాకిస్తాన్‌ను అనేకసార్లు హెచ్చరించింది. పాకిస్తాన్ మాత్రం బీభత్స కలాపాలను మాన లేదు. ఇటు మనదేశం లోకి ఇటు ఆఫ్ఘనిస్తాన్‌లోకి 'టెర్రరిస్ట్'లను ఉసి గొల్పడం ఆపలేదు, కాని అమెరికా ప్రభుత్వం సైనిక కలాపాలకోసం, ఆయుధ సేకరణ కోసం పాకిస్తాన్‌కు ఆర్థిక సహాయం అందచేయడం ఆప లేదు! అందువల్ల నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక గత ప్రకటనలకు పునరావృత్తి మాత్రమేనన్న భావం కలిగింది. కాని డొనాల్డ్ ట్రంప్ తాను కేవలం మాటల వాడిని కానని, చేతల వాడినని నిరూపించుకున్నాడు. ఈ చర్యలకు కారణం అమెరికా ప్రభుత్వానికి మనదేశం పట్ల ఉన్న మైత్రీభావం మాత్రమేకాదు! చైనా వ్యూహాత్మక విస్తరణను అడ్డుకోవడంలో భాగంగా అమెరికా ప్రభుత్వానికి ఏర్పడిన అనివార్యం ఇది! అయినప్పటికీ 'పాకిస్తాన్ చైనా'ల ఉమ్మడి 'దురాక్రమణ'ను ప్రతిఘటించడానికి మన ప్రభుత్వం చేస్తున్న కృషికి శుక్రవారం నాటి అమెరికా నిర్ణయం బలం చేకూర్చగలదు!!

పదిహేను సంవత్సరాలుగా అమెరికా ప్రభుత్వం అమాయకంగానో, అజ్ఞానంతోనో పాకిస్తాన్‌కు సహాయం చేయలేదు. తమ వ్యూహాత్మక ప్రయోజనాల పరిరక్షణలో భాగంగా మాత్రమే అమెరికా పాకిస్తాన్‌ను 'మేపింది'. ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్లను అల్‌ఖాయిదాను అణచివేయడంలో పాకిస్తాన్ ప్రభుత్వం తమకు మద్దతునిస్తుందన్నది పదిహేను ఏళ్లుగా అమెరికా విశ్వాసం. 2001లో 'తాలిబన్, అల్‌ఖాయిదా' జిహాదీ హంతకులు తమ దేశంపై దాడి చేసి, న్యూయార్క్‌లోని 'ప్రపంచ వాణిజ్య కేంద్రం' - వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను ధ్వంసం చేసిన తరువాత మాత్రమే అమెరికా ప్రభుత్వం జిహాదీ ఉగ్రవాదంపై కక్షకట్టింది. అంతకుపూర్వం ఏళ్ల తరబడి మన దేశానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ ప్రభుత్వం జిహాదీ బీభత్సకారులను ఉసిగొల్పిన సంగతి అమెరికాకు తెలుసు! అయినప్పటికీ పాకిస్తాన్ తమకు అత్యంత మిత్ర దేశమని 2008వ 2012వ సంవత్సరాల మధ్య అమెరికా ప్రభుత్వం ధ్రువపరచింది!! ఆఫ్ఘనిస్తాన్‌లో 'తాలిబన్ అల్‌ఖాయిదా' మూకలను అణచివేయడానికి సహకరించినంతవరకు, పాకిస్తాన్ ప్రభుత్వ భారత వ్యతిరేక బీభత్స చర్యలను పట్టించుకోరాదన్నది అమెరికా విధానమైంది!!

అల్‌ఖాయిదా ముఠాకు చెందిన ఒసామా బిన్ లాడెన్‌కు పాకిస్తాన్ ప్రభుత్వం తమ దేశంలో సురక్షిత స్థావరాన్ని కల్పించినట్టు ధ్రువపడిన తరువాత కూడ అమెరికా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోలేదు. లాడెన్‌ను అమెరికా దళాలు వధించిన తరువాత పాకిస్తాన్ ప్రభుత్వం కూడ 'తేలు కుట్టిన దొంగ'లా మౌనంగా ఉండిపోయింది! ఆ తరువాత కూడ అమెరికా ప్రభుత్వం పాకిస్తాన్‌కు సైనిక కలాపాల కోసం ఆర్థిక సహాయం కొనసాగించింది! ఇందుకు మౌలిక కారణం చైనా విస్తరణ. 'సోవియట్ సమాఖ్య' - సోవియట్ రష్యా - కమ్యూనిస్ట్ వ్యవస్థ కుప్పకూలిపోయిన తరువాత, 'సమాఖ్య' పదిహేను దేశాలుగా విడిపోయిన తరువాత, రష్యా బలహీనపడింది. 1945 నుంచి సాగిన 'ప్రచ్ఛన్న యుద్ధం' ముగిసింది, అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా ఏర్పడింది! 1991 నుంచి పదిహేనేళ్లకు పైగా కొనసాగిన ఈ అగ్రాధిపత్యానికి పోటీగా చైనా ఎదిగిపోవడం గత పదేళ్ల చరిత్ర! ఇప్పుడు 'ప్రచ్ఛన్నయుద్ధం' అమెరికాకు, చైనాకు మధ్య నడుస్తోంది. అందువల్ల పాకిస్తాన్ చైనాతో జట్టు కట్టకుండా నిరోధించడంలో భాగంగా అమెరికా 'సాయాన్ని' కొనసాగించింది! కానీ అమెరికా వైపున ఉండడం కంటె చైనాతో చేరిపోవడం ప్రయోజనమన్నది పాకిస్తాన్ భావం! పాకిస్తాన్‌లోని 'గ్వాదర్' ఓడరేవును నిర్మించడం మొదలైంది! గ్వాదర్ నుంచి సింకియాంగ్ వరకు 'ఆర్థిక వాటిక'ను చైనా ఏర్పాటు చేస్తోంది! ఆఫ్ఘనిస్తాన్ నుంచి 2014లో అమెరికా దళాల నిష్క్రమించిన తరువాత పాకిస్తాన్, చైనా ప్రభుత్వాలు ఆ దేశంలోకి వ్యూహాత్మకంగా చొరబడిపోయాయి! ఈ 'ఆర్థిక వాటిక'లోకి ఆఫ్ఘనిస్తాన్ కూడా చేర్చుకొనడానికి పాకిస్తాన్, చైనాలు కృషి చేస్తున్నాయి! డొనాల్డ్ ట్రంప్ కనిపెట్టిన వంచనకు పరాకాష్ట ఇది! ఇలా పాకిస్తాన్ స్వయంగా అమెరికా నుంచి దూరంగా జరిగింది. అమెరికా ప్రభుత్వం వారి 'సహాయం రద్దు' ప్రకటన ఈ వికృత వాస్తవానికి ధ్రువీకరణ మాత్రమే!!

అమెరికా పాకిస్తాన్‌కు మాత్రమేకాదు, పశ్చిమ ఆసియాలోని ఉత్తర ఆఫ్రికాలోని అనేక ఇస్లాం మత రాజ్యాలకు కూడా అమెరికా సైనిక వ్యూహాత్మక 'కోసం' ఆర్థిక సహాయం చేస్తోంది. ఈ దేశాలు పరోక్షంగా జిహాదీ బీభత్సకాండను ప్రోత్సహిస్తున్నాయి. కానీ పాకిస్తాన్ సహా ఈ దేశాలన్నీ అమెరికా బహుళ జాతీయ వాణిజ్య సంస్థల వద్ద ఆయుధాలు కొంటున్నాయి. ఇదీ.. 'సహాయం' ఇన్నాళ్లూ కొనసాగించడానికి రెండవ కారణం. ఏమయినప్పటికీ ట్రంప్ నిర్ణయంతో మనకు అమెరికాకు మధ్య మైత్రి మరింత బలపడగలదు.


హెచ్-1బి వీసాలపై ఎందుకింత ఆందోళన?

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైనప్పటి నుండి భారతీయులలో పలువురి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ముఖ్యంగా మనవాళ్లలో ఆ దేశంలో ఐటి రంగంలో ఉద్యోగాలు చేస్తున్న వారు, ఉద్యోగాలు ఆశిస్తున్న వారు, వారి కుటుంబ సభ్యులు, భారతదేశంలో ఐటి రంగంపై ఆధారపడుతున్నవారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక సంస్కరణల సమయం నుండి ప్రపంచీకరణ అందిస్తున్న ప్రయోజనాలను అందిపుచ్చుకోవడంలో, అందుకు తగిన విధంగా మన నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడంలో ఒక విధంగా భారతీయులు సరైన దృష్టి కేంద్రీకరించలేకపోయారు. ఐటి రంగం అందించిన నడమంత్రపు సిరితో పొంగిపోయి, అదే సౌభాగ్యం అనుకొంటూ, ఆ దిశలో పరిగెత్తడం ప్రారంభించాము. దానితో పలు మౌలిక రంగాలలో పురోగతిని విస్మరించాము. ముఖ్యంగా ఉత్పత్తి రంగం, మధ్యతరహా పరిశ్రమల రంగంపట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపించాము. దానితో ఇప్పుడు మనం నిద్రలేని రాత్రులు గడపవలసి వస్తున్నది.

గత రెండున్నర దశాబ్దాలుగా అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులకు అవసరానికి మించి ప్రాధాన్యత ఇస్తున్నాము. ప్రవాస భారతీయ సదస్సులు అంటూ జరిపి వారికి రెడ్‌కార్పెట్ స్వాగతాలు పలుకుతున్నాము. అనేకమంది ముఖ్యమంత్రులు తరచు అమెరికా పర్యటనలు జరుపుతూ ప్రవాస భారతీయులను ఆకట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. వారిని ఇక్కడకు వచ్చి పెట్టుబడులు పెట్టమని ప్రాధేయపడుతున్నాము. అందుకోసం అనేక రాయితీలు, సదుపాయాలు ఇవ్వజూపుతున్నాము.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జరుపుతున్న విదేశీ పర్యటనలలో సహితం ఆయా దేశాల అధినేతలతో వ్యూహాత్మక భాగస్వామ్యం పొందే ప్రయత్నాలపట్ల కన్నా అక్కడగల ప్రవాస భారతీయులను ఆకట్టుకోవడం పైననే ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అయితే ఇద్దరు ప్రవాస భారతీయులతో వారిని ఆకట్టుకోవడం కోసం రెండు కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగా ప్రాధేయపడుతున్నా మనకు లభిస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అత్యంత స్వల్పంగానే ఉంటున్నాయి. మన ఆర్థిక వృద్ధిలో వాటి భాగస్వామ్యం నామమాత్రంగానే ఉంటున్నది. కానీ మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్న స్థానికులపట్ల నిర్లక్ష్యం చూపుతున్నాం. వారిని ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్నాము. మనకున్న వనరులను విస్మరించి మరెక్కడో వెదుక్కొంటున్నాము. ప్రభుత్వం అనుసరిస్తున్న లోపభూయిష్ట విధానాలకు ఇంతకన్నా మరో తార్కాణం అవసరమా? ఇప్పుడు ఏకంగా ప్రవాస భారతీయులకు ఆన్‌లైన్‌లో ఇక్కడ ఓటు హక్కు ఉపయోగించుకొనే సదుపాయం కల్పించడం పట్ల దృష్టి సారిస్తున్నాం. వారికి అంతగా ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉందా?



అకస్మాత్తుగా ప్రవాస భారతీయులలో 'జన్మభూమి' పట్ల గత కొంతకాలంగా ఎందుకు ఆసక్తి వ్యక్తం అవుతున్నదో గమనించలేకపోతున్నాము. 1990 ప్రాంతంలో మన దేశం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నది. విదేశీ మారకద్రవ్యం నిల్వలు అడుగంటిపోవడంతో మన బంగారాన్ని విదేశాలలో తాకట్టుపెట్టి రుణాలు తీసుకోవలసి వచ్చింది. అటువంటి క్లిష్ట సమయంలో అమెరికాలో గాని, ఇతర చోట్ల ఉన్న ప్రవాస భారతీయులుగానీ ఎవరూ మాతృదేశాన్ని ఆర్థిక ఇబ్బందులలో ఆదుకోవడానికి ముందుకు రానే రాలేదు. కనీసం సానుభూతి చూపే ప్రయత్నం కూడా చేయలేదు. వారెవ్వరూ మన దేశంవైపు కన్నెత్తి చూడనే లేదు.

అయితే అమెరికా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడం, అక్కడ ఒక్కొక్క బ్యాంక్ కుప్పకూలే పరిస్థితులు ఏర్పడటం, బ్యాంకులలో పెట్టుబడులకు హామీ లేదనే అభిప్రాయం కలగడం, స్టాక్ మార్కెట్‌లు కూడా ప్రమాదకరంగా మారడంతో తాము కూడబెట్టుకున్న సంపదలకు భద్రత లేదని భయం వారిని వెంటాడటం మొదలుపెట్టింది. బ్యాంకులలో డిపాజిట్‌లపై వడ్డీలు లేకపోగా అసలుకే మోసం వస్తుందనే ఆందోళన బయలుదేరింది. అటువంటి క్లిష్ట పరిస్థితులలో తాము కూడబెట్టుకున్న సంపదను కాపాడుకోవడం కోసం స్వదేశం వైపు చూడడం ప్రారంభించారు. తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడం వరకు ఊరుకొంటే సరిపోయేది. పెట్టుబడులు పెడతాం అంటూ స్వదేశంలో తిరగడం, రాజకీయ నాయకత్వాన్ని మచ్చిక చేసుకొని అపరిమితమైన రాయితీలు పొందడం, ఈలోగా రాజకీయ నాయకులకు ముడుపులు చెల్లించి తమ కుటుంబ సభ్యులకు ఎన్నికలలో సీట్లు ఇప్పించుకోవడం, వారు చట్ట సభలకు ఎన్నికయ్యే విధంగా చూడడం ప్రారంభించారు. ఆ విధంగా ఎన్నికలలో అభ్యర్థులు పెట్టే ఎన్నికల ప్రచారవ్యయం విపరీతంగా పెరగడానికి వారు కొంతవరకు కారణం అవుతున్నారు.

పైగా అవినీతి పద్ధతుల ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడం ప్రారంభించారు. ప్రభుత్వ అధికారులను, రాజకీయ నాయకులను అమెరికాకు సదస్సుల పేరుతో తీసుకువెళ్లి, వారిని ప్రలోభాలకు గురిచేసి, అందుకు ప్రతిఫలంగా ఇక్కడ అనేక రాయితీలు పొందుతున్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు జరుపుతున్న విదేశీ పర్యటనలు, అందుకు ప్రతిఫలంగా ఆయా దేశాలలోని ప్రవాస భారతీయులకు సంబంధించి ఇక్కడ అందిస్తున్న రాయితీలని పరిశీలిస్తే ఈ అంశాలను స్పష్టం కాగలవు.

తమ దేశ యువకుల ఉపాధి అవకాశాలను కాపాడుకోవడం కోసం ట్రంప్ కొన్ని చర్యలను తీసుకొంటుంటే వాటిని చూసి ట్రంప్ ఏదో ఘోరం చేస్తున్నట్లు ప్రచారం చేయడంలో అర్థం లేదు. అసలు ఇతర రంగాలను నిర్లక్ష్యం చేసి ఐటి రంగాలపైననే దృష్టి సారించడం వల్లన మన సామాజిక జీవనంలో ఎన్నో అనర్థాలు చెలరేగుతున్నాయి. హైదరాబాద్ వంటి నగరాలలో పబ్‌ల సంస్కృతి ప్రారంభం కావడం, అర్ధరాత్రి దాటే వరకు మద్యం మత్తులో యువకుల నృత్యాలతో గడుపుతూ ఒక వినూత్న సంస్కృతి వ్యాప్తి చెందడానికి ఐటి కంపెనీలే కారణం కాదా?

గంజాయి సంస్కృతి, కుటుంబ జీవనంలో తీవ్రమైన వత్తిడులు, అపనమ్మకాలు, విడాకులు పెరిగిపోవడానికి సహితం ఐటి రంగం దోహదపడుతున్నది. ఎటువంటి ప్రభుత్వ పర్యక్షవేణ లేకుండా ఐటి కంపెనీలు వ్యాప్తి చెందుతున్నాయి. అవి కేవలం అమెరికాలోని కంపెనీలకు గుమస్తా పనులు చేసే కంపెనీలుగా మారడం, అత్యాధునిక సాంకేతికతను అలవరచుకొనే ప్రయత్నం చేయకపోవడంతో మరో నాలుగైదు సంవత్సరాలలో మన ఐటి పరిశ్రమ కుప్పకూలడానికి సిద్ధంగా ఉన్నట్లు నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. పైగా గతంలో కేవలం భారత్‌లోనే లభించే ఇటువంటి సేవలను అందించడానికి ఇప్పుడు చైనా, దక్షిణ కొరియాలతోసహా అనేక దేశాలు పోటీ పడుతున్నాయి. దానితో ఈ రంగంలో భారత్ గుత్తాధిపత్యానికి బీటలు పడటం ప్రారంభమైంది.

ఐటి ఉద్యోగాల మోజులో కుప్పలు తెప్పలుగా వేల సంఖ్యలో వెలసిన ఇంజనీరింగ్ కళాశాలలు కనీస నాణ్యత ప్రమాణాలను కూడా పాటించడం లేదు. దానితో యువతను ఎందుకూ పనికిరాని నిరుద్యోగులుగా మలచడంలో ఇవి పోటీపడుతున్నాయి. ఇంజనీరింగ్ డిగ్రీలు ఉన్నా ఏదో కంప్యూటర్ కోర్స్ అంటూ ఐదారు నెలలు మరోచోట శిక్షణ పొందితేగానీ ఉద్యోగాలకు పనికి రావడం లేదు.

అమెరికాలో శాశ్వత నివాసం ఏర్పాటుకు అవసరమైన గ్రీన్ కార్డులు పొందడానికి ఎదురుచూస్తున్న వారికి హెచ్-1బి వీసాల పొడిగింపునకు అడ్డంకులు ఏర్పడుతుండగా, అందుకు కాలపరిమితి పెరగకుండా వెనుకకు పంపే విధంగా కొత్త నిబంధనలను రూపొందించడం కోసం ట్రంప్ సిద్ధపడినట్లు వచ్చిన కథనాలు తాజాగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటువంటి నిబంధనలు రూపొందిస్తే 5 నుండి 7.5 లక్షల మేరకు భారతీయ ఉద్యోగులు స్వదేశానికి తిరిగి రావలసి వస్తుందని భావిస్తున్నారు. వీరిలో అత్యధికులు ఐటి రంగానికి చెందిన వారే కావడం గమనార్హం.

ఇటువంటి పరిస్థితులు వ్యక్తిగతంగా స్వదేశం వదిలి సంపాదన కోసం అమెరికాకు పరిగెత్తిన వారికి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ మనం ఒక గొప్ప అవకాశంగా భావించాలి. అత్యున్నత నైపుణ్యం గల మన యువకుల మేధో సంపదను అమెరికాకు ధారపోయడం కన్నా స్వదేశంలో ఉపయోగించుకొనే అవకాశం ఏర్పడినట్లు భావించాలి. ఆ దిశలో అవసరమైన ప్రణాళికలను, విధానాలను ఇక్కడి ప్రభుత్వాలు రూపొందించాలి. అటువంటి వారికి ఘన స్వాగతం పలకాలని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్ర సూచించారు. హెచ్-1బి వర్కింగ్ వీసా నిబంధనలు కఠినతరమైతే ఆదోళన అక్కర్లేదని, అక్కడి నుంచి వచ్చే వేలాది మంది నిపుణులతో భారత్ మరింతగా వెలిగిపోతుందని ఆనంద్ మహీంద్రా విశ్వాసం వ్యక్తం చేశారు. అదే జరిగితే "స్వాగతం. స్వదేశానికి రండి. మీ రాక భారత్ వృద్ధికి దోహదపడుతుంది" అన్నారు.

ప్రస్తుతం హెచ్-1బి వీసాలను అమెరికాలో స్వల్పకాలిక ఉద్యోగ అనుమతికిగాను జారీ చేస్తున్నారు. ఇవి మూడేళ్లపాటు చెల్లుబాటు అవుతాయి. వాటిని మరో మూడేళ్లు పొడిగించుకునే అవకాశం ఉంది. అంటే ఆరేళ్లపాటు ఉండవచ్చు. ఈలోగా గ్రీన్ కార్డు పొందటం సాధారణంగా సాధ్యం కాదు. ప్రస్తుతం 12 ఏళ్ల వరకు ఈ వీసాలను పొడిగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆరేళ్లకు మించి పొడిగించ రాదనే ప్రతిపాదనను హోంలాండ్ సెక్యూరిటీ విభాగం పరిశీలిస్తున్నది. అదే జరిగితే అమెరికాలో ఉద్యోగం చేస్తున్న లక్షలాదిమంది భారతీయులు వెనుకకు రావలసి ఉంటుంది.

నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఎదుర్కొంటున్న సమయంలో జాతీయ ప్రయోజనాలకోసం అమెరికా హెచ్-1బి వీసాలను ప్రవేశపెట్టింది. కానీ ఇప్పుడు తమ యువతకు ఉపాధి అవకాశాలను కాపాడుకోవడం కోసం ఇప్పుడు దీనిని కఠినతరం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే అమెరికన్ల నిరుద్యోగాన్ని దూరం చేస్తామంటూ ఎన్నికల్లో పెద్దఎత్తున ప్రచారం చేసిన ట్రంప్ ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

అమెరికాలోని భారతీయ ఉద్యోగులు, వ్యాపారులలో సంపన్న వర్గాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. అయితే వారు తమ సంపాదనలో స్వదేశానికి తీసుకువస్తున్న మొత్తాలు చాలా స్వల్పమని గ్రహించాలి. వారికన్నా గల్ఫ్ దేశాలలో నిర్మాణ రంగం, ఆటో రంగం, ఇతర రంగాలలో చిన్నచిన్న నైపుణ్యం గల ఉద్యోగాలు చేస్తున్న కార్మికులు స్వదేశానికి తమ కుటుంబం పోషణకు కావచ్చు, ఇతరత్రా కావచ్చు పెద్ద మొత్తాలలో నిధులను స్వదేశానికి తీసుకువస్తున్నారు. ప్రవాస భారతీయుల నుండి స్వదేశానికి సంక్రమిస్తున్న విదేశీ మారకద్రవ్యంలో 90 శాతం వరకు ఇటువంటి కార్మికుల నుండి మాత్రమే వస్తున్నాయి.

అయితే మనం అమెరికా, ఇతర ఐరోపా దేశాలలోని ప్రవాశ భారతీయుల పట్ల చూపుతున్న శ్రద్ధ, వారికిస్తున్న ప్రత్యేకతలను గల్ఫ్ తదితర దేశాలలో కార్మికులుగా పనిచేస్తున్న భారతీయులకు ఇవ్వడం లేదు. వారక్కడ అనేక భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొంటూ ఉంటే, అకారణంగా ఏళ్ల తరబడి జైళ్లలో మ్రగ్గవలసి వస్తుంటే, పలు వేధింపులకు గురవుతూ ఉంటే వారి సంక్షేమం పట్ల తగు శ్రద్ధ చూపడం లేదు. మన జాతీయ అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి పరచుకొనే ప్రయత్నం చేయాలి. దేశ ఆర్థిక వృద్ధిలో కీలకపాత్ర వహించగల మధ్య తరహా, చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు ఇతోధికంగా ప్రోత్సాహం ఇచ్చే విధంగా ప్రభుత్వాలు దృష్టి సారించాలి.

-చలసాని నరేంద్ర | 849569050

కలవరపెడుతున్న కుల ఘర్షణలు

భారత సమాజం అభివృద్ధి కుల నిర్మూలనతోనే సాధ్యమని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. ఆధునికత పెరిగే కొద్దీ కులం గోడలు బలహీనపడతాయని ఆశించారు. అయితే దురదృష్టవశాత్తూ దేశం ఆ దిశగా పనియంచడం లేదు. అందుకు పూర్తి వ్యతిరేక దిశలో కుల స్థిరీకరణ దిశగా సాగుతోంది. కులాన్ని కానీ, మతాన్ని కానీ ఒక అస్తిత్వ చిహ్నంగా భావించినంతవరకూ ఏ గొవడా లేదు. ఎవరి అభిప్రాయం వారిది అని సరిపెట్టుకోవచ్చు. అయితే ఆ పేరుతో సమాజంలో ద్వేషం పెరిగేలా చర్యలుంటే సామాజిక శాంతికి భంగకరం. అలాంటి పెడ ధోరణులు తలెత్తకుండా ప్రభుత్వాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే ప్రభుత్వాల్ని నడిపే పార్టీలకు గానీ, ఎదురు నిలిచే పార్టీలకు గానీ ఆ చిత్తశుద్ధి లేదు. రాజకీయ పక్షాలు నిలవడానికైనా, నడవడానికైనా కులం అన్నది ఒక ఊతకర్రలా తయారైంది. అభివృద్ధి, సేవ తదితర మార్గాల ద్వారా మనగలగడం కన్నా, సులభమార్గంలో కులాల కూడికలు, తీసివేతల కార్యక్రమాల ద్వారా అధికారం అందుకోవడమే ముఖ్యమైపోయింది. అందువల్ల దేశాన్ని కుల నిర్మూలన దిశగా ముందుండి నడపించాల్సిన రాజకీయ పార్టీలు, బాధ్యతారహితంగా కులాల కుంపట్లను రాజేసి, తాత్కాలికంగా చలి కాచుకుంటున్నాయి. దేశానికి శాశ్వత నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఉపాధి అవకాశాలు తగ్గినప్పుడు సాధారణంగానే పౌరుల్లో అభద్రత నెలకొంటుంది. విద్య, ఉద్యోగ అవకాశాలు అందరికీ పెంచేందుకు అవసరమైన వనరులు దేశంలో ఉన్నాయి. అవినీతి లేకుండా, సమర్థవంతంగా వనరుల్ని ఉపయోగించుకోగలిగితే దేశంలో అందరికీ అభివృద్ధి ఫలాల్ని అందజెయ్యొచ్చు. ఆ రకమైన భరోసా ప్రభుత్వాలు ప్రజల్లో కలిగించాలి. ఆ నమ్మకం లోపించడం వల్లనే అభివృద్ధి చెందిన వర్గాలు కూడా రిజర్వేషన్ల కోసం అడిగే పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయి. సామాజిక సమానత్వం సాధించడానికి ఉద్దేశించబడిన వెసులుబాట్లు రాజకీయ పక్షాల హామీలుగా మారుతున్నాయి. ఈ ధోరణి ప్రమాదకరం. మహారాష్ట్రలో కోరేగాం సంబంధిత ఆందోళనలు పూర్తిగా నివారించతగ్గవి. నిష్పక్షపాత ధోరణిలో, కొంచెం ముందుచూపుతో అక్కడి ప్రభుత్వం వ్యవహరించి వుంటే సమస్య ఏర్పడేదే కాదు. దళితులు, అగ్రవర్ణాలకు చెందినవారి మధ్య 200 క్రితం జరిగిన యుద్ధంలో అసువులు బాసిన నిమ్నవర్గాల వారి స్మృతిగా నిర్వహించే వార్షిక కార్యక్రమం ఇన్నాళ్లూ చడీచప్పుడూ లేకుండా సాగిపోయేది. కానీ ఇప్పుడే ఎందుకు వివాదంగా మారింది. స్థానికంగా ఉన్న దళిత, అగ్రవర్ణాల మధ్య విభేదాలు, రాజకీయాలు, ఉపాధి కల్పనలో అంతరాలు వివాదానికి ఆజ్యం పోశాయి. మారిన రాజకీయ పరిస్థితుల్లో మహారాష్ట్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇలా మారేది కాదు. సమాజంలో కుల, మతాల వారీ గొడవలు పెరగకుండా ఉండాలంటే ముందుగా రాజకీయ పక్షాల ఆలోచనా దృక్పథంలో మార్పు చాలా అవసరం.

-డా.డి.వి.జి.శంకరరావు

సోఫియా మేధకు అంతా ఫిదా!

కొత్త సంవత్సరం వేడుకలు బొంబాయి ఐఐటిలో ఒకరోజు ముందే వినూత్నంగా ప్రారంభమయ్యాయి. డిసెంబరు 30న సౌదీ అరేబియా పౌరసత్వంగల మరమనిషి (రోబో) సోఫియా ఆ ప్రాంగణంలో మొదటిసారి అడుగిడింది. 'టెక్‌ఫెస్ట్ 2017' పేర నిర్వహించిన కార్యక్రమంలో సోఫియా చీరకట్టులో కనిపించి ఎందరినో ముగ్ధుల్ని చేసింది. తన మాటలతో పరిణతిని ప్రదర్శించి కృత్రిమ మేధ కొంగొత్త మెరుపులను వేల మంది ఐఐటి విద్యార్థుల మెదళ్లలో మెరిపించింది.

భారతదేశ కంప్యూటర్ రంగ చరిత్రలో అదొక అపురూపమైన ఘటనగా నిలిచిపోతుంది. సోషల్ మీడియా గుర్చి బహుళ చర్చ జరుగుతున్న తరుణంలో 'సోషల్ రోబో'గా సోఫియా సందడి చేసింది. ఎందరో యువకుల మనసులను కొల్లగొట్టింది. చాలామందికి డార్లింగ్‌గా తన మాటలతో, హావభావాలతో ఆకట్టుకుంది. కొత్త సంవత్సరానికి కొత్త ఉత్తేజం తీసుకొచ్చింది.

కృత్రిమ మేధ, సోషల్ రోబోలపట్ల భయాందోళనలు వద్దని, రోబోలు - మనుషుల మధ్య సహాయ సహకారాలు తప్ప పోటీ ఉండరాదని అభిప్రాయపడింది. మనిషిలో సామాజిక, సృజనాత్మక నైపుణ్యాలు ఎక్కువని ప్రస్తుతం తాను వాటిని నేర్చుకుంటున్నానని తెలిపింది. కృత్రిమ మేధ, రోబోలు మానవ నాగరికతకు మేలు చేస్తాయని, భవిష్యత్‌లో యంత్రాలు స్వయంగా నేర్చుకుని (మెషిన్ లెర్నింగ్) గొప్ప సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయని, ఇది విని కొందరు భయపడుతున్నారని, తనను మానవుడే సృష్టించాడు కదా?.. అని సాంత్వన వచనాలు పలికింది. తనకిప్పుడు ఒకటి, రెండు భాషలొచ్చని, మరిన్ని నేర్చుకుంటానని వివరించింది. మనుషుల ముఖాలను చూసి గుర్తుపట్టి పలకరించగలనని వెల్లడించింది. చిరునవ్వులు చిందిస్తూ, కనురెప్పలు కదిలిస్తూ, సందర్భానుసారం మెడ తిప్పుతూ వేదికపై అడిగిన అనేక ప్రశ్నలకు ఎలాంటి తడబాటు లేకుండా స్పష్టంగా, అద్భుతంగా సమాధానాలు ఇచ్చింది. ఆ సమయస్ఫూర్తికి, 'ఇండియాకు నమస్కార్' అన్నప్పుడు సభికుల హర్షధ్వానాలు మారుమోగాయి. మళ్లీ మళ్లీ ఆ గొంతు వినేలా శ్రావ్యంగా ఉండటంతో సభికులు ఎంతో కుతూహలంగా సోఫియా మాటల్ని విన్నారు. ఇంటర్వ్యూ చేసిన మహిళ ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నప్పుడు సోఫియా ఉత్కంఠతో ఆమెనే చూస్తు ప్రశ్న పూర్తయిన వెంటనే సమాధానమివ్వడం అనిర్వచనీయమైన అనుభూతిగా సభికులు భావించారు.

సోఫియా సౌదీ అరేబియా పౌరసత్వం పొందాక అనేక దేశాల్లో తన ఇంటర్వ్యూలనిచ్చింది. ఎన్నో టెలివిజన్ స్టూడియోలలో ప్రముఖులతో మాట్లాడింది. ఆయా దేశాల విశేషాలను వివరించింది. ప్రతిచోట సోఫియా పలుకులకు, మాటతీరుకు ముగ్ధులై ముసిముసి నవ్వులు నవ్వడమేగాక కొందరు ఆశ్చర్యంతో, తన్మయత్వంతో పొంగిపోయి, ఇది కలయా? నిజమా?.. అని విస్తుపోయి నవ్వినవారున్నారు. చివరకు ఐక్యరాజ్య సమితిలోనూ అడిగిన ప్రశ్నలకు దీటైన సమాధానాలిచ్చింది.

మన పొరుగున వున్న బంగ్లాదేశ్‌లోనూ సోఫియా ఎందరినో ఆకట్టుకుంది. ఆ దేశ ప్రధాన మంత్రితో ముచ్చటించింది. ప్రధాని మనవరాలి పేరు తన పేరు ఒకటేనని గుర్తు చేయడంతో విస్తుపోవడం ఆ దేశ ప్రధాని వంతయింది. ఇంకా ఎన్నో ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు విని బంగ్లాదేశ్ మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు విస్తుపోయారు. వారెవ్వా.. అని అభినందించారు.

సౌదీ పౌరసత్వం గల సోఫియా మాదిరి అనేక అంశాలపై అడిగే ప్రశ్నలకు సమాధానాలిచ్చే రోబోలిప్పుడు వివిధ ఖండాలలో కనిపిస్తాయి. వాటికీ పౌరసత్వం లభించినా ఆశ్చర్యపోనవసరం లేదు. చైనా, జపాన్, హాంగ్‌కాంగ్, ఇలా అనేక దేశాల్లో పరిగెత్తే, బరువులు మోసే, నాట్యం చేసే పాటలు పాడే రోబోలు సందడి చేస్తున్నాయి. చైనాలో అందగత్తె రోబోను దాని సృష్టికర్త పెళ్లి చేసుకున్నాడు. ఆ అందెగత్తె సోషల్ మీడియాలో చాలాకాలం హల్‌చల్ చేసింది. ప్యారిస్‌లో ఓ మహిళ రోబోను వివాహం చేసుకుంది. సోఫియాను పెళ్లి చేసుకుంటానని ఓ కొంటె కుర్రాడు బొంబాయి ఐఐటిలో ప్రపోజ్ చేయగా, ఆ రోబో సున్నితంగా తిరస్కరించింది. ఆ 'టెక్ ఫెస్ట్'లో ఎంతమంది పాల్గొంటున్నది కచ్చితత్వంతో చెప్పి నిర్వాహకులను ఆశ్చర్యపరిచింది. ఆడ రోబోల పరిస్థితి ఇలా ఉంటే మగ రోబోలు కఠినమైన విధులను నిర్వహిస్తున్నాయి. దుబాయ్‌లో ఓ రోబో పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భారతదేశంలో తొలి రోబో పోలీసు హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విధులను త్వరలో నిర్వహించనున్నది. ముంబాయిలోని పలు బ్యాంకుల్లో చేసే పనులను ఈ రోబోలు నిర్వహిస్తున్నాయి. ఉద్యోగులు చేసే పనులను ఈ రోబోలు ఎంతో సమర్థవంతంగా చేస్తున్నాయి. ఖాతాదారులకు మర్యాదపూర్వకంగా సేవలందిస్తున్నాయి. వారెంతో ప్రసన్నంగా కనిపిస్తున్నారు.





ఇక పరిశ్రమల్లో, కార్పొరేట్ సంస్థల్లో, రోబోలు తమకు కేటాయించిన పనులను విసుగు-విరామం లేకుండా చేస్తున్నాయి. కచ్చితత్వం వీటి ప్రత్యేకత కావడంతో రోబోల నియామకాల కోసం, కృత్రిమ మేధ ఉపయోగం కోసం చాలామంది ఉవ్విళ్లూరుతున్నారు. ఈ-కామర్స్, వైద్యరంగంలో రోబోల సంఖ్య పెరుగుతోంది. ఈ పరిణామాలు ఆర్థిక, సామాజిక పరిస్థితులపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. ఇప్పటికే పాశ్చాత్య దేశాల్లో ఆ పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరికొన్ని సంవత్సరాల్లో డ్రైవర్‌లెస్ కార్లు ప్రవేశపెడితే పరిస్థితిలో మరింత మార్పు రావడం ఖాయం. సోఫియాలాంటి రోబోల 'ప్రోగ్రాం' మరింత మెరుగుపరిచే పని ఓ పక్క జరుగుతోంది. మనుషులకు రోబోలు మరింత సహాయకారిగా నిలిచే రోజు మరెంతో దూరం లేదని నిపుణులు నిత్యం వివిధ సదస్సులు, సమావేశాల్లో చెబుతూ ఉన్నారు. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీలో కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్‌పై శిక్షణ ఇటీవల ప్రారంభమైంది. ఆటోమేషన్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్‌డేటా విశ్లేషణ, నానో టెక్నాలజీ, త్రీడీ ప్రింటింగ్, హ్యూమనాయిడ్ రోబో, డ్రైవర్‌లెస్ కార్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఇలా అబ్బురపరిచే సాంకేతిక విజ్ఞానమిప్పుడు కృత్రిమ మేధ ఆధారంగా ఉన్నతీకరణ చెందుతున్నది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఇదంతా 'సైన్స్ ఫిక్షన్'లోని పాత్రలు, సంఘటనలు, సమాచారమనుకునే వాళ్లిప్పుడు కళ్లారా వాటిని చూస్తూ ఆశ్చర్యపోతున్నారు. ఎంతలో ఎంత మార్పు! మానవ జీవితాన్ని సంపూర్ణంగా మార్చే దిశలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతోంది. దాన్ని అన్ని దేశాలు ఆహ్వానిస్తున్నాయి. ఒక రకంగా పోటీపడుతున్నాయి. ఇకపై సంపద సృష్టి ఈ రంగాలతో ముడిపడి ఉండటం వల్ల ఈ అభివృద్ధిని వీలైనంత త్వరగా అక్కున చేర్చుకుని సంపద సృష్టించడానికి దేశాల మధ్య పోటీ పెరిగింది. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు సైతం ఈ పోటీలో అగ్రభాగాన నిలిచాయి. దాంతో మొత్తం 'దృశ్యం' మారబోతోంది. దానికి సజీవ సాక్ష్యం సోఫియా!

ఎన్నో శాస్త్రాల సమాహారమే సోఫియా! మనిషికుండే భావోద్వేగాలు, ఆకాంక్షలు రోబోలకు సైతం ఉంటాయని, ఆరోజు ఎంతో దూరం లేదని నిపుణులు చెబుతున్నారు. కెనడా దేశంలో ఉంటున్న భారత సంతతికి చెందిన 13-14 సంవత్సరాల తన్మయ్‌భక్షి తెలివితేటలు, ఆల్గరిథమ్స్‌పై పట్టు, ప్రోగామ్స్ రాయడంలో నైపుణ్యం, కంప్యూటర్ రంగంలో గల జ్ఞానం, అనర్గళంగా ప్రసంగించే నైపుణ్యం, అంతర్జాతీయ సదస్సుల్లో సాంకేతికతపై కీలకోపన్యాసాలు చేయడం, క్షణం తీరికలేకుండా "జ్ఞాన యంత్రం"లా పనిచేస్తుంటే మానవునిమేధ ఎంత ఉన్నత శిఖరాలకు చేరిందో అర్థమవుతున్నది. ఆ మేధ నుంచే కృత్రిమ మేధ పుట్టుకొచ్చింది. దానితోనే పోటీ పడుతోంది. ఇదే ఇప్పుడు 'సవాల్'గా సమస్త రంగాల నిపుణులు భావిస్తున్నారు. ఆ స్పర్థతోనే అన్ని ఖండాలలో సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నారు.

రేపు భారతదేశంలో సోఫియాలాంటి హ్యూమనాయిడ్ రోబో తయారైనా ఆశ్చర్యపోనవసరం లేదు. హైదరాబాద్‌లోని రోబో పోలీసును స్వదేశీ పరిజ్ఞానంతోనే రూపొందించారు. ఇటీవల ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సులో అమెరికా అధ్యక్షుడి కూతురు ఇవాంక ట్రంప్‌ను పలకరించిన రోబో సైతం స్వదేశీ పరిజ్ఞానంతోనే తయారైంది. మానవరూపంలోనే గాక జంతు, కీటక రూపాల్లోనూ రోబోలు దర్శనమిస్తున్నాయి. ఆపిల్, ఫేస్‌బుక్, గూగుల్‌లాంటి అగ్రశ్రేణి టెక్ సంస్థలు భారీ మొత్తంలో కృత్రిమ మేధపై ఖర్చు చేస్తున్నాయి. మన తెలుగువాడు రాజ్‌రెడ్డి లాంటి రోబోటిక్స్ నిపుణులు తమ జీవితాల్ని ఇందుకు అంకితం చేశారు. ఆ'శ్రమ' ఫలితంగానే అనేక రోబోలు వైద్యరంగంలో కీలకమైన సర్జరీలు చేయగలుగుతున్నాయి. కచ్చితత్వంతో చెప్పిన పనిని నిర్వహించగలుగుతున్నాయి.

విచిత్రమేమంటే రోబో విలేఖరులు వచ్చేశారు. న్యూస్‌రీడర్లు దర్శనమిస్తున్నారు. ఒకటా.. రెండా అనేక రంగాలలో రోబోలు దర్శనమిస్తున్నాయి. క్లిష్టమైన పనులను కృత్రిమ మేధకు అప్పగించి మనుషులు గొప్ప ఫలితాలు రాబడుతున్నారు. ఆర్థిక మేనేజర్లుగా, ఫండ్లను నిర్వహించే మేనేజర్లుగా ఇప్పటికే వివిధ దేశాల్లో రోబోలు విధులు నిర్వహిస్తున్నాయి. రోబో సైనికులు సైతం రంగంలోకి దిగుతున్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం విశ్వరూపం నేపథ్యంలో మావోయిస్టుల మాటలకు మాన్యత ఉందంటారా?

-వుప్పల నరసింహం
9985781799

ఉత్తరాయణం

బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమచేయాలి

ఆలయ సిబ్బంది, ఉద్యోగుల వేతనాలను వారి బ్యాంకు ఖాతాల్లో వేయాలన్న జీవో 577లో లొసుగులున్నాయి. దీనివల్ల జీతంలో కొంత నేరుగా చెల్లిస్తూ, కొంత బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. తెలంగాణ అభివృద్ధికి, ప్రజలు సుఖశాంతులతో ఉండేందుకు అర్చకుల ఆశీర్వాదం కావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారు. అందువల్లే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అర్చకులకు ఆలయ సిబ్బందికి 2015 పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించారు. డిసెంబర్ 1వ తేదీకి యావత్ 5625 సిబ్బందికి తమ తమ బ్యాంకు ఖాతాలలో జమ అవుతాయని చెప్పారు. తెలంగాణకు జూన్ 2వ తేదీ ఎంత ముఖ్యమో, అర్చక ఉద్యోగులకు డిసెంబర్ 1వ తేదీ అంతే గొప్పదని ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి అన్నారు. ఆయన ప్రకటనతో అందరూ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే కేవలం 734 మందికి మాత్రమే, అది కూడా పిఆర్‌సి ప్రకారం పెరిగిన మొత్తాన్ని మాత్రమే బ్యాంకు ఖాతాలో జమ చేశారు. వీరికి రావలసిన మిగతా మొత్తం ఎప్పటిలా ఆలయాల నుండి ఇచ్చేలా నిర్ణయించారు. ఒక చిన్న జీతాన్ని రెండుగా విభజించి ఇవ్వాలా? తిరకాసులతో ఉన్న జీఓ 577ను సవరించి జీతం ఏకమొత్తంగా బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా ప్రభుత్వం చర్య తీసుకోవాలి. ఒక ఉద్యోగం -ఒకే జీతం విధానాన్ని అమలు చేయాలి.

-చామర్తి వెంకటరామకృష్ణ, హైదరాబాద్

దమ్ముంటే విచారణ జరిపించండి

లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీకి సీఎం సవాల్

పుదుచ్చేరి, జనవరి 5: సంక్షేమ పథకాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని పుదుచ్చేరి ముఖ్యమంత్రి వి.నారాయణస్వామి ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడికి సవాల్ విసిరారు. పథకాల అమలులో అక్రమాలు జరిగాయంటూ ప్రధానమంత్రికి ఆమె లేఖ రాశారని, నిజానిజాల నిగ్గు తేల్చాలంటే సమగ్ర విచారణ జరిపించాలని ఆయన అన్నారు. లేఖలు రాయడం కాదు, దర్యాప్తు జరిపిస్తేనే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. సంక్షేమ పథకాల్లో అక్రమాలు జరిగాయంటూ కిరణ్ బేడీ తరచూ వ్యాఖ్యానాలు చేస్తున్నారని, తాజాగా ప్రధానికి లేఖ రాశారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. వాట్సాప్‌లో లేదా ట్విట్టర్‌లో ముఖ్యమంత్రి పాలనపై వ్యాఖ్యలు చేయడం, లేఖలు రాయడం అభ్యంతరకర విషయమన్నారు. 'పథకాలకు సంబంధించి చేస్తున్న ఆరోపణలను కిరణ్ బేడీ నిరూపించగలరా?'- అని ఆయన ప్రశ్నించారు. సంక్షేమ కార్యక్రమాలు, రాయితీ పథకాలపై అంత ఆసక్తి ఉంటే సమగ్ర విచారణకు లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు ఇవ్వాలన్నారు. కిరణ్ బేడీ రాజ్యాంగ పరిధిలో ఉంటూ, రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని సీఎం సూచించారు. ఉచిత బియ్యం పథకం, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన ఫైళ్లను లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదానికి పంపాలనడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయడమే కిరణ్ బేడీ ఏకైక లక్ష్యమని, సంక్షేమ పథకాలపై పదే పదే ఆరోపణలు చేయడం ఇందులో భాగమేనన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి కిరణ్ బేడీ సరిపోరన్న విషయం ఆమె ప్రవర్తన తీరు తేటతెల్లం చేస్తోందని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

ట్రక్కును ఢీకొన్న స్కూల్ బస్సు

ఇండోర్‌లో ఐదుగురు విద్యార్థులు, డ్రైవర్ మృతి

ఇండోర్, జనవరి 5: ఓ స్కూల్ బస్సు ట్రక్కును ఢీకొన్న ఘటనలో అయిదుగురు విద్యార్థులు, బస్సు డ్రైవర్ మరణించారు. మధ్యప్రదేశ్‌లో ఇండోర్ వద్ద బైపాస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సు ట్రక్కును ఢీకొనగా అయిదుగురు విద్యార్థులు సహా బస్సు డ్రైవర్ మృతిచెందినట్లు ఇండోర్ డిఐజి హరినారాయణ్ చారి మిశ్రా తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన నలుగురు విద్యార్థులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులను వారి ఇళ్లవద్ద దింపేందుకు బస్సు బయలుదేరిందని, అదుపు తప్పిన బస్సు ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొందని అదనపు ఎస్పీ మనోజ్‌కుమార్ రే తెలిపారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనపై వెంటనే నివేదిక అందజేయాలని హోం మంత్రి భూపేంద్రసింగ్ పోలీసు, రవాణాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా, స్కూల్ బస్సుల విషయంలో కఠిన నిబంధనలు అమలు చేస్తామని విద్యాశాఖ మంత్రి దీపక్ జోషి తెలిపారు. పిల్లల భద్రతకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాలను పాటించాలని విద్యా సంస్థలకు ఇదివరకే ఆదేశాలు జారీ చేశామన్నారు.

కాకినాడ-పిఠాపురం రైల్వే లైన్ సమస్యను పరిష్కరించండి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ,జనవరి 5: కాకినాడ-పిఠాపురం రైల్వే లైన్ సమస్యను పరిష్కరించాలని కేంద్రమంత్రి పియూష్‌గోయల్‌కు భాజపా ఎంపీ కంభంపాటి హరిబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడు హరిబాబు నేతృత్వంలో పిఠాపురం భాజపా నాయకుల బృందం కేందమంత్రి పియూష్ గోయల్‌ను కలిశారు. ఈ లైన్‌కి ఇప్పటి వరకు రూ.25 కోట్లు ఖర్చుపెట్టారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ లైన్ వలన ప్రధాన రైల్వేలైన్‌కు అనుసంధానం చేస్తే కాకినాడ నగరానికి మరెంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ హరిబాబు వివరించారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్టు అనంతరం ఎంపీ హరిబాబు విలేఖరులకు తెలిపారు.





చలిగాలులు కార్మికుడి కడుపాకలిని చల్లార్చలేవు. మండుటెండైనా.. మంచు కొండలైనా కార్మికుల రెక్కల కష్టం కింద నక్కి ఉండాల్సిందే. అలహాబాద్‌లో కనిపించిన మంచు చిత్రాలివి. శీతల పవనాలు.. ఉత్తరాదిన రైళ్లను రద్దు చేయగలిగాయి కానీ, ఈ కార్మికుడి సైకిల్ యాత్రను అడ్డుకోలేకపోయాయని చెప్పడానికి మొదటి చిత్రమే ఉదాహరణ. ఆకలి సెగ తగ్గితే అంతటి కార్మికులకూ ఇలా రగ్గుల మాటున ఒగ్గక తప్పదనడానికి రెండో చిత్రం సాక్షి.

త్వరలోనే స్వదేశానికి రోహింగ్యాలు

బంగ్లాదేశ్ మంత్రి వెల్లడి

కోల్‌కతా, జనవరి 5: మైన్మార్‌లో సైనిక దాడులకు భయపడి తమ దేశానికి వలస వచ్చిన రోహ్యాంగాలను తిరిగి స్వదేశానికి పంపే ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తామని బంగ్లాదేశ్ సమాచార మంత్రి హసానూల్ హక్ వెల్లడించారు. రోహింగ్యా శరణార్థులందరినీ మైన్మార్ పంపుతామన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. గత నవంబర్‌లో చోటుచేసుకున్న సైనిక చర్యతో వేలాది మంది రోహ్యాంగాలు బంగ్లాదేశ్‌కు పారిపోయి వచ్చారు. 'రోహింగ్యా శరణార్థుల విషయంలో బంగ్లాదేశ్, మైన్మార్ ప్రభుత్వాల మధ్య ఓ ఒప్పదం కుదిరింది. వారిని మైన్మార్‌కు పంపే ప్రక్రియ త్వరలోనే మొదలవుతుంది' అని మంత్రి తెలిపారు. అయితే అది ఎప్పుడు మొదలెట్టాలన్న దానిపై కచ్చితమైన నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. రోహింగ్యాల వలసలపై తలెత్తిన సంక్షోభాన్ని ఎదుర్కోడానికి ప్రధాని షేక్ హసీనా అన్ని చర్యలూ తీసుకుంటున్నారని బంగ్లా మంత్రి వెల్లడించారు. శరణార్థులతో ఆర్థిక పరమైన సమస్యలు ఎదురైనప్పటికీ తమ ప్రభుత్వం తట్టుకుని నిలబడిందని హసానూల్ అన్నారు. 2017 ఆగస్టులో మైన్మార్‌లో రఖీనే రాష్ట్రంలో రోహింగ్యాలపై సైనిక చర్య జరిగింది.

దీంతో సుమారు 6 లక్షల మంది రోహింగ్యాలు సరిహద్దునే ఉన్న బంగ్లాదేశ్‌కు పారిపోయి వచ్చారు. శరణార్థ శిబిరాల్లో స్క్రూటినీ నిర్వహించిన తరువాత స్వదేశానికి పంపే కార్యక్రమం మొదలవుతుందన్నారు. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో చొరబాట్లపై సమాచారం లేదన్న మంత్రి భారత్-బంగ్లా ప్రజలు కుటుంబ సభ్యుల్లా మెలుగుతున్నారని కితాబిచ్చారు. త్రిపుర, అస్సాం రాష్ట్రాను ఆనుకుని బంగ్లాదేశ్ సరిహద్దు ఉంది. సరిహద్దులో శాంతియుత వాతావరణమే ఉందని, ఎక్కడా హింసాత్మక ఘటనలు జరిగిన దాఖలాలు లేవని ఆయన చెప్పారు. బంగ్లాదేశ్‌ను ఉగ్రవాదరహిత దేశంగా చేయడానికి హసీనా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఏ ప్రాంతమూ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం లేదని సమాచార మంత్రి స్పష్టం చేశారు.

హెచ్-1బీ వీసా మార్పులపై

అమెరికాలో వ్యతిరేకత

వాషింగ్టన్, జనవరి 5: హెచ్-1బీ వీసాల్లో మార్పులు చేయాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం పట్ల అమెరికాలో కొందరు ప్రజాప్రతినిధులు, న్యాయవాదుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనలతో అమెరికాకు నష్టం జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. హెచ్-1బీ వీసాల పొడిగింపును నిలిపివేస్తే 5లక్షల నుంచి 7.5 లక్షల మంది భారతీయ అమెరికన్లు వెనక్కి వెళ్లిపోవాల్సి ఉంటుందని, ఈ పరిణామాలు అమెరికాను ఇక్కట్లపాలు చేస్తాయని పలువురు నేతలు, న్యాయవాదులు అంచనా వేస్తున్నారు. నిపుణులు, ప్రతిభావంతులు వెనక్కివెళ్లిపోతే అమెరికాకు అన్ని విధాలా నష్టం జరుగుతుందని వారు విశ్లేషిస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల సందర్భంగా అమెరికాలో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కాలని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో గెలిచి దేశాధ్యక్ష పదవిని చేపట్టాక అమెరికన్లకు తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు హెచ్-1బీ వీసాలను పొడిగించరాదని ట్రంప్ నిర్ణయించారు.



హెచ్-1బీ వీసాల ద్వారా అమెరికాలోని కంపెనీలు తక్కువ వేతనాలకు భారత్ సహా ఇతర దేశాలకు చెందిన వారిని నియమించుకుంటున్నాయి.కాగా, ట్రంప్ పగ్గాలు చేపట్టాక ఈ వీసాలను తగ్గించాలని, కనీస వేతనాలను పెంచాలని, అమెరికన్లకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. హెచ్-1బీ వీసాల పొడిగింపును నిలిపివేస్తే అమెరికా నుంచి ఎన్నో కుటుంబాలు స్వదేశాలకు వెళ్లిపోతాయని, నైపుణ్యం ఉన్న ఉద్యోగులు వెనక్కి పోతారని, భారత్ సహా వివిధ దేశాలతో అమెరికా సంబంధాలు దెబ్బతింటాయని డెమొక్రటిక్ కాంగ్రెస్ నేత తులసి గబ్బార్డ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిపుణుల కొరత ఎదురైనపుడు 21వ శతాబ్దంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అమెరికా పోటీ పడలేదని ఆమె అంటున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న చిన్న పరిశ్రమల యాజమాన్యాలు, ఉపాధి చూపే సంస్థలు నష్టపోతాయని తులసి చెబుతున్నారు. ట్రంప్ నిర్ణయాలు అమెరికా ఆర్థిక వ్యవస్థకే గొడ్డలిపెట్టులా మారుతాయని హిందూ అమెరికన్ ఫౌండేషన్ కూడా అభిప్రాయపడుతోంది. హెచ్-1బీ వీసాల పొడిగింపును నిలిపివేస్తే నిపుణులు మరోదారి లేక స్వదేశాలకు వెళ్లకతప్పదని ఈ సంస్థ అంటోంది.

ఇండో-అమెరికన్ కాంగ్రెస్ నేత రాజా కృష్ణమూర్తి కూడా ట్రంప్ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, నిపుణుల అవసరం తీరాలంటే వీసా నిబంధనలను తొలగించాలన్నారు. అమెరికన్లు పెట్టుబడులు పెట్టి వ్యాపారాలు చేసుకోవాలన్నా ఇతర దేశాలకు చెందిన నిపుణుల అవసరం ఉందంటున్నారు. ట్రంప్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటారన్న ఆశాభావాన్ని రాజా కృష్ణమూర్తి వ్యక్తం చేశారు. 'ఇమిగ్రేషన్ వాయిస్' సంస్థకు చెందిన అమన్ కపూర్ మాట్లాడుతూ, హెచ్-1బీ వీసాలపై నిబంధనల వల్ల అన్ని స్థాయిల్లోనూ నష్టం జరగకతప్పదన్నారు. ఇండియన్ అమెరికన్ సమాజానికి ట్రంప్ నిర్ణయం వల్ల హాని జరుగుతుందన్నారు. ట్రంప్ నిర్ణయం ప్రభావం సాంకేతిక, పారిశ్రామిక రంగాలపై పడుతుందని ప్రముఖ న్యాయవాది టియాన్ చుడ్నొవస్కీ అన్నారు. మరికొందరు సీనియర్ న్యాయవాదులు కూడా వీసా నిబంధనల మార్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

'ఆధార్' సమాచారానికి భద్రత లేదు

అమెరికా విమర్శకుడి వాదన

న్యూఢిల్లీ, జనవరి 5: 'ఆధార్' సమాచారం పూర్తి భద్రతతో ఉందని, అది దుర్వినియోగమయ్యే అవకాశమే లేదని 'విశిష్ఠ గుర్తింపు ప్రాధికార సంస్థ' (యుఐడీఏఐ) ప్రకటించిన మర్నాడే- 'ఆధార్' సమచారం దుర్వినియోగమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ అమెరికాకు చెందిన విమర్శకుడు ఎడ్వర్డ్ స్నోడెన్ తన వాదన వినిపించారు. భారత ప్రభుత్వం 'ఆధార్' పేరిట సేకరించిన సమాచారానికి భద్రత ప్రశ్నార్థకమేనని, అది దుర్వినియోగమయ్యే వీలుందని ఆయన తెలిపారు. సిబీఎస్ జర్నలిస్టు జాక్ విట్టేకర్ చేసిన 'ట్వీట్'కు స్నోడెన్ స్పందిస్తూ, వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం ప్రభుత్వాలకు అలవాటేనని అన్నారు. నిజానికి చట్టాల ప్రసక్తే ఉండదని, సమచారం దుర్వినియోగం కావడం అన్నది చరిత్ర చెప్పిన సత్యమన్నారు. అంతకుముందు విట్టేకర్ తన అభిప్రాయాలను ట్వీట్ చేస్తూ, భారత ప్రభుత్వం 1.2 బిలియన్ల వ్యక్తులకు చెందిన సమాచారాన్ని సేకరించిందని, ఆ సమాచారం బయటకు పొక్కిందని, డబ్బులిచ్చి కొనుక్కునేందుకు కూడా సమచారం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై 'యుఐడీఏఐ' స్పందిస్తూ, 'ఆధార్' వివరాలకు భద్రత ఉందని, అవి బయటకు పొక్కే అవకాశం లేదని వివరణ ఇచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన ఎడ్వర్డ్ స్నోడెన్ ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయాలను వెల్లడించారు.

విభజన నాటికి ఆర్థిక సంక్షోభం లేదు

- ఏపీ ఆర్థిక పరిస్థితిపై లోక్‌సభలో కేంద్రం వెల్లడి
- లిఖితపూర్వక సమాధానమిచ్చిన మంత్రి రాధాకృష్ణన్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: విభజన నాటికి ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో లేదని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పొన్ను రాధాకృష్ణన్ వెల్లడించారు. విభజన నాటి ఏపీ, ప్రస్తుత ఏపీ ఆర్థిక స్థితిగతులపై వైకాపా లోక్‌సభ సభ్యుడు వై.వి సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి పొన్ను రాధాకృష్ణన్ శుక్రవారం నాడు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ విభజన నాటికి రుణభారం ఇతర రాష్ట్రాలతో పోల్చితే సాధారణంగానే ఉందని కేంద్రమంత్రి వెల్లడించారు. ఆర్థిక సంఘం అంచనాల పరిధిలోనే ఉందని ఆయన చెప్పారు. అలాగే 2016 మార్చి నాటికి ఏపీలో 1.73 లక్షల కోట్లు రూపాయలు, 2017 మార్చి నాటికి 1.92 లక్షల కోట్లు రూపాయలు అప్పుల్లో ఉందని చెప్పారు. అలాగే 2018 మార్చి నాటికి 2.16 లక్షల కోట్లు రూపాయలు రుణభారంలో ఏపీ ఉండనుందని కేంద్ర ఆర్థిక సహాయమంత్రి రాధాకృష్ణన్ వెల్లడించారు.

దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయండి: వై.వి సుబ్బారెడ్డి

దక్షిణ మధ్య రైల్వే జోన్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని వైకాపా ఎంపీ వై.వి సుబ్బారెడ్డి కేంద్ర రైల్వేశాఖ పియూష్ గోయల్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాడు కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసిన వై.వి సుబ్బారెడ్డి, గత మూడు సంవత్సరాల నుంచి దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయలేదని, ఈ ఏడాది దక్షిణ మధ్య రైల్వేజోన్ ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఒక వినతి పత్రం కేంద్రమంత్రికి సమర్పించారు. అలాగే విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఏపీ ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి పియూష్ గోయల్‌కు సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా విభజన హామీలను అమలు చేయాలని ప్రధాని మంత్రికి వై.వి సుబ్బారెడ్డి లేఖ రాశారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రధానమంత్రికి రాసిన లేఖలో వై.వి సుబ్బారెడ్డి వెల్లడించారు.

విదేశాలకు మొబైల్ ఫోన్ డేటా లీకేజి వాస్తవమే: మంత్రి మనోజ్‌సిన్హా

మొబైల్ ఫోన్ల నుంచి విదేశాలకు డేటా లీకవుతున్న విషయం వాస్తవమేనని, అయితే లీకవుతున్న సమాచారం ఎలాంటిదో కనిపెట్టడం కష్టమని కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి మనోజ్ సిన్హా వెల్లడించారు. మొబైల్ ఫోన్ల ద్వారా విదేశాలకు సమాచారం లీక్ అవుతున్నట్లుగా వచ్చిన వార్తలపై వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి శుక్రవారం నాడు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. మొబైల్ ఫోన్ల నుంచి షేర్ అవుతున్న డేటా సంక్షిప్త సందేశం (ఎస్‌క్రిప్ట్) రూపంలో ఉంటున్నందున అది ఎలాంటి సమాచారమో కనిపెట్టడం కష్టమవుతోందని మంత్రి మనోజ్ సిన్హా తెలిపారు.

పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణత తగ్గింది

ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఖరీఫ్‌లో పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణత తగ్గినట్లుగా వ్యవసాయ శాఖ సహాయమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. ఎంపీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లఖితపూర్వకంగా జవాబిస్తూ 2016-17 ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే, ఈ ఏడాది 2017-18 ఖరీఫ్ సీజన్ పప్పు ధాన్యాల సాగు తగ్గిందని మంత్రి వెల్లడించారు.

స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన అవినాష్‌రెడ్డి

కడపలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో తన గౌరవానికి భంగం కలిగించారంటూ కడప ఎంపీ అవినాష్‌రెడ్డి లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు శుక్రవారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను అవినాష్‌రెడ్డిని కలిశారు. కడపలోని తన నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తాను మాట్లాడుతుండగా మైక్ లాక్కొని అవమానించారని ఒక వినతి పత్రం స్పీకర్‌కు సమర్పించారు. అలాగే ఒక రౌడీషీటర్ వేదికపై ఉండటమే కాకుండా తన మైక్ లాక్కుని దౌర్జన్యానికి దిగారని, తన గౌరవానికి భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు సమర్పించిన వినతి పత్రంలో అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు.

లాలూకు నేడు శిక్ష ఖరారు?

తీర్పుపై కొనసాగుతున్న వాయిదాల పర్వం

రాంచీ, జనవరి 5: పశుదాణా కేసులో ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్‌ను దోషిగా నిర్ధారించిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం, శిక్షల తీర్పుపై మాత్రం వాయిదాల పర్వం కొనసాగిస్తోంది. డిసెంబర్ 23న లాలూను దోషిగా నిర్ధారించిన సీబీఐ కోర్టు, జనవరి 3న శిక్షలను ఖరారు చేయాల్సి ఉంది. కొన్ని కారణాలతో తీర్పు వాయిదా పడటంతో, లాలూకు శుక్రవారం శిక్షలు ఖరారు చేస్తారని అనుకున్నారు. శుక్రవారం సైతం శిక్షల తీర్పును వాయిదా వేసిన సీబీఐ కోర్టు, శనివారం మధ్యాహ్నం 2 గంటలకు శిక్షలు ఖరారు చేయనున్నట్టు వెల్లడించింది. ఇదిలావుంటే, దోషిగా నిర్ధారణ జరిగిన తరువాత బిర్సాముండా సెంట్రల్ జైలుకెళ్లిన లాలూ, సీబీఐ ప్రత్యేక కోర్టు శివపాల్ సింగ్ ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అనారోగ్యం, వయోభారం కారణంగా శిక్షలు తగ్గించాలంటూ రాతపూర్వకంగా కోర్టుకు విజ్ఞప్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని వీడియో కాన్ఫరెన్స్ విచారణ అనంతరం కోర్టు హాలు నుంచి బయటకు వచ్చిన లాలూ తరపు న్యాయవాది చిత్తరంజన్ ప్రసాద్ వెల్లడించారు. 'శిక్షల తీర్పు శనివారం ప్రకటించనున్నట్టు న్యాయమూర్తి వెల్లడించారు' అని మీడియాకు వివరించారు. పశు దాణా కుంభకోణానికి సబంధించి ప్రస్తుత కేసులో సీబీఐ కోర్టు ఇప్పటికే విచారణ ముగించింది. 1990 నుంచి 94 మధ్య బీహార్ సీఎంగా లాలూ ప్రసాద్ యాదవ్ ఉన్నపుడు పశువుల దాణా విషయంలో ట్రెజరీ నుంచి 89.27 లక్షల కుంభకోణానికి పాల్పడ్డారన్న అభియోగం నిర్ధారణ అయ్యింది. ఈ కేసులో లాలూ సహా పదిమందికి సీబీఐ కోర్టు శుక్రవారం శిక్షలు ఖరారు చేయాల్సి ఉన్నా వాయిదా పర్వం కొనసాగింది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు శిక్షల తీర్పు వెలువరించనున్నట్టు సీబీఐ ప్రత్యేక కోర్టు వెల్లడించింది. శిక్షణ తీర్పు విషయంలో శుక్రవారం లాలూ వాదన సహా ఆర్జేడీ నాయకుడు ఆర్‌కె రాణా, ఐఏఎస్ మాజీ అధికారి పూల్‌చంద్ సింగ్, మహేష్ ప్రసాద్, ప్రభుత్వ మాజీ ఉద్యోగి సుబీర్ భట్టాచార్య, సరఫరా/రవాణాదారు త్రిపురారి మోహన్ ప్రసాద్, సుశీల్ కుమార్ సిన్హా, సునీల్‌కుమార్ సిన్హా, రాజారాం జోషి, సంజయ్ అగర్వాల్, సునీల్ గాంధీల వాదనలు సైతం విన్నది. గురువారం నాటి పరిణామాల్లో ఐఏఎస్ మాజీ అధికారి బెక్ జులియస్, గోపీనాథ్ దాస్, ఆర్జేడీ నాయకుడు జగదీష్ శర్మ, రవాణా/ సరఫరాదారు జ్యోతికుమార్ ఝా, కృష్ణకుమార్ ప్రసాద్‌ల వాదనలు వినడం తెలిసిందే. కేసు తీవ్రత, జరిగిన వాదనలు, లాలూ విజ్ఞప్తి నేపథ్యంలో ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు కనిష్టంగా ఏడాది నుంచి గరిష్టంగా ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందని చిత్తరంజన్ ప్రసాద్ వివరించారు. ఇదికాకుండా ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ మెడకు మరో దాణా కేసు చుట్టుకుని ఉండటం తెలిసిందే.

హజ్ కోటాలో వివక్షా?

- కేంద్రాన్ని వివరణ కోరిన సుప్రీం
- కేరళ హజ్ కమిటీ పిటీషన్‌పై విచారణ


న్యూఢిల్లీ, జనవరి 5: రాష్ట్రాలకు హజ్ యాత్రీకుల కోటా పంపకాలకు సంబంధించి ఏ విధానాన్ని అనుసరిస్తున్నారో చెప్పాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. హజ్ కోటా పంపకాల్లో కేంద్రం అనుసరిస్తున్న విధానం రాష్ట్రాల పట్ల వివక్ష చూపుతున్నట్టుందని కేరళ హజ్ కమిటీ దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు శుక్రవారం విచారించింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం కాన్విల్కర్, జస్టిస్ డివై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కేసును విచారిస్తూ కేరళ హజ్ కమిటీ అభియోగంపై రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. కేసు విచారణకు సంబంధించి కేరళ హజ్ కమిటీ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ ఏటా 1.7 లక్షల మందిని భారత్ నుంచి హజ్ యాత్రకు యుఏఈ ప్రభుత్వం అనుమతించిందన్నారు. ఈ కోటా ప్రకారం రాష్ట్రాల్లోని ముస్లిం జనాభా ప్రాతిపదికన హజ్ యాత్రీకులను అనుమతిస్తున్నట్టు వివరించారు. అయితే, ఈ విధానం రాష్ట్రాల పట్ల వివక్షకు తావిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఉదాహరణకు బీహార్‌లో హజ్ యాత్ర కోసం 6.9వేల మంది దరఖాస్తు చేసుకుంటే 12వేల మందిని అనుమతించారని, అదే కేరళ నుంచి 95వేల మంది ముస్లింలు దరఖాస్తు చేసుకుంటే ఆరువేల మందికే అవకాశం దొరికిందని వివరించారు. 'కేంద్రం అనుసరిస్తోన్న విధానం వివక్ష చూపుతున్నట్టే ఉంది. బీహార్ నుంచి దరఖాస్తు చేసుకున్న ముస్లింలు అందరికీ హజ్ యాత్రకు అవకాశం లభిస్తే, కేరళలో దీనికి విరుద్ధమైన పరిస్థితి కనిపిస్తోంది' అని ప్రశాంత్ భూషణ్ వాదించారు. హజ్ యాత్ర కోసం దరఖాస్తు చేసుకున్న దేశంలోని ముస్లింలు అందరినీ డ్రా ప్రాతిపదికన అనుమతిస్తే వివక్షకు తావుండదని సూచించారు.

ఇళ్లు కొనాలంటే ఉద్యోగాలు ఇవ్వాలి

- ఉద్యోగాలివ్వాలంటే ఐటీ కంపెనీలకు స్పేస్ ఇవ్వాలి
- క్రెడాయ్ ప్రాపర్టీ షోలో మంత్రి నారా లోకేష్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 5: క్రెడాయ్ ఆధ్వర్యంలో కట్టిన ఇళ్లు నిండాలంటే రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, వారికి ఉద్యోగాలు ఇవ్వాలంటే ఐటీ కంపెనీలకు స్పేస్ ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. శుక్రవారం స్థానిక ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన క్రెడాయ్ ప్రాపర్టీ షోను ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను మంత్రి పరిశీలించిన తరువాత పాత్రికేయులతో మాట్లాడుతూ క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షోలో పాల్గొనడం సంతోషదాయకంగా ఉందన్నారు. 2014లో విభజనతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఉద్యోగస్థులు ఉండటానికి, పనిచేయడానికి ఆఫీసు గాని, రాజధాని గాని ఏపీకి లేవని, ఆ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపుతో రైతులకు ఇచ్చిన పిలుపు మేరకు అమరావతి రాజధాని కోసం 35వేల ఎకరాల భూమిని ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 16వేల కోట్ల రూపాయల లోటు బడ్జెట్ ఉందన్నారు. విభజనతో రాష్ట్రంలో కష్టాలు బహుముఖంగా వచ్చాయన్నారు. అయినా ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాజధాని ఏర్పాటు చేయడం ఆయన ముందుచూపునకు నిదర్శనమన్నారు. పాలన పారదర్శకంగా చేయడంతోపాటు ముఖ్యమంత్రి వికేంద్రీకరణ జరగాలని కోరుకుంటున్నారన్నారు. ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్‌కు కేంద్రంగా, రాయలసీమ ఎలక్ట్రానిక్స్ రంగానికి కేంద్రంగా, అమరావతి ఐటీలో ప్రముఖ సంస్థలకు నిలయంగా చేయబోతున్నామన్నారు. విశాఖపట్నంలో 60 శాతం ఐటీ పరిశ్రమలు, అమరావతిలో 25 శాతం, రాయలసీమలో 15 శాతం ఐటీ పరిశ్రమలు ఏర్పాటు జరుగుతుందన్నారు. ఈనెల 12న 12 ఐటీ కంపెనీలను రాయలసీమలో ప్రారంభిస్తున్నామన్నారు. ఇప్పటికే శ్రీసిటీలో మొబైల్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేశామన్నారు. విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో మొబైల్ తయారీ యూనిట్లు ఒక్కటి కూడా లేదని, ఈ మూడున్నర ఏళ్లల్లో రెండు మొబైల్ యూనిట్లు నెలకొల్పడం జరిగిందన్నారు. అమీర్‌పేటలో ఐటీ ట్రైనింగ్ సెంటర్ వల్ల హైదరాబాద్‌కు ఐటీ పరిశ్రమలు వేళ్లానుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. అమరావతి రాజధానిలో చిన్న సంస్థలు వచ్చేలా కృషి చేస్తున్నామని, దానికి తగిన విధంగా ఐటీ స్పేస్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. ఐటీ సంస్థల్లో లక్ష ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని తక్షణమే 60వేల ఉద్యోగాలు రాష్ట్రంలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు స్పేస్ ఉంటే ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఐటీ కంపెనీలు ఏర్పాటుకు 60 లక్షల చదరపు అడుగులు స్పేస్ అవసరమన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రెంటల్ గ్యారంటీ విధానం (డీటీపీ) తీసుకువచ్చామని, దీనివల్ల ఐటీ సంస్థలు ఏర్పాటు చేసేవారికి అద్దెలో కొంత భాగం లేక మొత్తంను ప్రభుత్వం చెల్లించే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రముఖ హౌసింగ్ కార్పొరేట్ సంస్థలు ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయని, ఐటీ రంగానికి సంబంధించి కూడా భవనాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. గూగుల్-ఎక్స్ లాంటి ప్రముఖ సంస్థల్లో కూడా మన ఆంధ్రులు ఉండటం మనకు గర్వకారణమన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో హౌసింగ్ స్కీమ్స్ విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందని, దానికి ప్రభుత్వం కూడా సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలో కన్‌స్ట్రక్షన్ రంగాన్ని బలోపేతం చేయడానికి ఉచిత ఇసుక పాలసీ తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఫీడ్‌బ్యాక్ ఇవ్వాల్సి ఉందని, అలా ఇస్తే ఆ సమస్యలను పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావు మాట్లాడుతూ జీఎస్‌టీ, రెరా యాక్ట్ సమస్యలను ప్రభుత్వం పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలో చేపడుతుందన్నారు. క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, ఉమామహేశ్వరరావు, బోడే ప్రసాద్, సీఆర్‌డీఏ కమిషనర్ శ్రీధర్, నగర మేయర్ శ్రీధర్, కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు శివారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



క్రెడాయ్ ప్రాపర్టీషోలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం. 7

30/2013 చట్టం నెం.లోని సెక్షన్ (1)19 మరియు రూలు (1)25 ప్రకారం

రూడి ప్రకటన

ఆర్.సి.జి1/22/2016 Gazette.No.85/KST/2017, Dt.25.12.2017

క్రింది షెడ్యూలులో నిర్దిష్ట పరచిన కృష్ణాజిల్లా మండవల్లి మండలం మొఖాసాకలవపూడి గ్రామములో గల య.0.24సెంట్లు భూమి ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం అనగా "విజయవాడ-గుడివాడ-భీమవరం-నిడదవోలు రైల్వేస్టేషన్‌ల మధ్య విద్యుత్‌తో కూడిన రెండు రైల్వే లైన్ల నిర్మాణమునకు గాను" అవసరమని అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన కృష్ణాజిల్లా కలెక్టరు గారు భావించుచున్నందున, చట్టం ప్రకారము సదరు 15లోని సెక్షన్ 30/2013 భూముల యందు ఆసక్తి గల వ్యక్తుల నుండి ఏ విధమైన అభ్యంతరములు రానందున చట్టం 30/2013 కేంద్ర చట్టం (30/2013లోని సెక్షన్ 19(1) ప్రకారము ఈ డిక్లరేషను చేయుచున్నారు.

దిగువ షెడ్యూలులో పేర్కొనిన య.0.24సెంట్లు భూమి, చట్టం 30/2013 కేంద్ర చట్టం 30/2013లోని సెక్షన్ 19(1) ప్రకారము డిప్యూటీ చీఫ్ ఇంజనీర్(కన్‌స్ట్రక్షన్), యస్.సి. రైల్వే, విజయవాడ వారిచే ప్రజాహిత కార్యక్రమాలకు అనగా "విజయవాడ-గుడివాడ-భీమవరం-నిడదవోలు రైల్వేస్టేషన్ల మధ్య విద్యుత్‌తో కూడిన రెండు రైల్వే లైన్ల నిర్మాణమునకు గాను" అంతే మొత్తము కొద్ది ఎక్కువ లేక తక్కువ, భూమి అవసరమని కృష్ణాజిల్లా కలెక్టరు గారు ధ్రువీకరించుచున్నారు.

షెడ్యూలు

గ్రామము : **మొఖాసాకలవపూడి** మండలము: **మండవల్లి** జిల్లా: **కృష్ణా**

వరుస నెం.	సర్వేనెం/ సబ్‌డివిజన్	మొత్తము విస్తీర్ణము (య.లలో)	సేకరించివలసిన విస్తీర్ణము (య.లలో)	ఆసక్తిగల వ్యక్తుల పేర్లు మరియు చిరునామా	హద్దులు: ఉత్తరము	దక్షిణము	తూర్పు	పడమర	చెట్లు కట్టడములు ఏవైనా
1	41/2ఎ	0.04	0.04	బొద్దులూరి దుర్గారావు	రైల్వేట్రాక్	140/2ఎ	140/2బి	రైల్వేట్రాక్	తాడిచెట్లు-8
2	60/1ఎ	0.13	0.13	కొండపనేని సీతారామయ్య	61/1	41	60/1బి	రైల్వేట్రాక్	తాడిచెట్లు-4
3	72/1ఎ	0.04	0.04	త్రిపురనేని కృష్ణచౌదరి	71	72/3బి	72/1బి	రైల్వేట్రాక్	----
4	72/3ఎ	0.02	0.02	త్రిపురనేని కృష్ణచౌదరి	72/1బి	73	72/3బి	రైల్వేట్రాక్	----
		మొత్తం	0.30						

రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు భూసేకరణ అధికారి, గుడివాడ నందు సదరు భూముల ప్లాను ఉంచినందున పనిదినములలో కార్యాలయ వేళలందు పరిశీలించు కొనవచ్చును.

బొగ్గు గనులు, యినపరాయి, పలకరాయి లేదా యితర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్ట్ నిర్మాణమునకు అవసరమైన భూ భాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుటగాని చేయవలెను.

సం/- **బి.లక్ష్మీకాంతం,**
కలెక్టరు, కృష్ణా.



కనీస నగదు నిల్వ తగ్గించనున్న ఎస్‌బీఐ

ముంబయి, జనవరి 5: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో దిగ్గజమైన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాదారులకు నిజంగా ఇది ఉపశమనం కలిగించే వార్త. పొదుపు ఖాతాల్లో కనీస నగదు నిల్వల మొత్తాన్ని తగ్గించాలని ఎస్‌బీఐ భావిస్తోంది. ప్రస్తుతం మెట్రో నగరాలకు సంబంధించి నెలవారీ కనీస నగదు నిల్వ లక్ష్యం 3,000 రూపాయలు కాగా దీన్ని 1,000 రూపాయలకు కుదించాలని బ్యాంకు యోచిస్తోంది. పొదుపుఖాతాల్లో కనీస నగదు నిల్వలు ఉంచని ఖాతాదారుల నుంచి అపరాధ రుసుము పేరిట వేల కోట్ల రూపాయలను వసూలు చేస్తూ ఎస్‌బీఐ లబ్ధి పొందుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణల దృష్ట్యా కనీస నగదు నిల్వల మొత్తంతో పాటు పెనాల్టీలను కూడా తగ్గించాలన్నది బ్యాంకు యోచనగా కనిపిస్తోంది.

దేశంలోనే అతి పెద్ద బ్యాంకు అయిన ఎస్‌బీఐకి 402 మిలియన్ల సేవింగ్స్ ఖాతాలున్నాయి. కనీస నగదు నిల్వ ఉంచని ఖాతాలపై పెనాల్టీలను వసూలు చేసే ప్రక్రియను అయిదేళ్ల విరామం అనంతరం 2017లో ప్రారంభించింది. మెట్రో నగరాల్లో 5వేలు, మిగతా ప్రాంతాల్లో వెయ్యి రూపాయల కనీస నగదు నిల్వ ఉండాలని మొదట్లో నిబంధన విధించింది. అయితే, ఆ తర్వాత మెట్రో నగరాల్లో కనీస నగదు నిల్వ మొత్తాన్ని 3వేలకు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో 2వేలకు, గ్రామీణ ప్రాంతాలకు వెయ్యి రూపాయలు ఉండేలా సడలించింది. కనీస నగదు ఉంచని ఖాతాదారుల నుంచి గత ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య 8 నెలల్లోనే అపరాధ రుసుము కింద 1,771.67 కోట్ల రూపాయలను ఎస్‌బీఐ వసూలు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ రెండో త్రైమాసిక లాభం రూ. 1581 కోట్ల కంటే అపరాధ రుసుము భారీగా ఉండడం గమనార్హం. ఈ గణాంకాలను ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా విశ్లేషించింది. కనీస నగదు నిల్వలు లేనందున 40.5 కోట్ల ఖాతాలను ఎస్‌బీఐ మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, పెన్షనర్లు, మైనర్లు, చిన్న మొత్తాల ఖాతాలను కనీస నగదు నిల్వ నుంచి మినహాయించినట్లు ఎస్‌బీఐ గతంలోనే ప్రకటించింది.

కాగా, ఎడాపెడా పెనాల్టీలు విధించి తమను బ్యాంకు ఇక్కట్లపాలు చేస్తోందని ఖాతాదారుల నుంచి విమర్శలు రావడంతో ఎస్‌బీఐ పునరాలోచనలో పడింది. కనీస నగదు నిల్వల తగ్గింపునకు సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటనను ఇంకా విడుదల చేయనప్పటికీ ఆ దిశగానే బ్యాంకు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

త్వరలో చలామణిలోకి రూ. పది నోటు

ఆర్‌బీఐ వెల్లడి

ముంబయి, జనవరి 5: రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) త్వరలో కొత్త పది రూపాయల నోటును చలామణిలోకి తేనుంది. చాక్లెట్ గోధుమ రంగులో ఉండే ఈ నోటుపై వెనుకవైపు దేశ వారసత్వ సాంస్కృతిక సంపద అయిన కోణార్క్ సూర్య దేవాలయం చిత్రాన్ని ముద్రించనున్నట్టు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర బ్యాంకు త్వరలో మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లో ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకంతో కొత్త పది రూపాయల నోటును మార్కెట్‌లోకి విడుదల చేయనుందని ఆ ప్రకటనలో వివరించింది. ఈ నోటు చాక్లెట్ గోధుమ రంగులో ఉంటుందని పేర్కొంది. ఈ నోటు ముందు వైపు మధ్యలో మహాత్మా గాంధీ చిత్రం ఉంటుంది. కుడివైపు అశోక స్తంభం చిహ్నం ముద్రించి ఉంటుంది. పైన ఎడమ వైపు, కింద కుడివైపు వాటర్ మార్క్స్, చిన్న పరిమాణం నుంచి పెద్ద పరిమాణం వరకు పెరుగుతున్న అంకెలతో కూడిన నంబర్ ప్యానల్ ఉంటాయని ఆర్‌బీఐ తెలిపింది. నోటుకు వెనుక భాగంలో ఎడమ వైపు నోటును ముద్రించిన సంవత్సరం ఉటుంది. దీంతో పాటు స్వచ్ భారత్ లోగో, నినాదం భాషా ప్యానెల్, కోణార్క్ సూర్య దేవాలయం, దేవనాగరి హిందీ లిపిలో 10 అంకెలతో కూడిన పది సంఖ్య ముద్రించి ఉంటాయి. ఆర్‌బీఐ గతంలో విడుదల చేసిన పది రూపాయల నోట్లనీ ఇక ముందు కూడా చెల్లుబాటు అవుతాయని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది.


కడప జిల్లాలో మెకాన్ బృందం పర్యటన

★ ఉక్కు పరిశ్రమకు భూముల పరిశీలన
★ 31న నివేదిక సమర్పణకు సన్నాహాలు

మైలవరం, జనవరి 5: కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో భాగంగా మెకాన్, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం జిల్లాకు చేరుకున్నాయి. బృందం సభ్యులు మైలవరం మండలంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు గల అనుకూల పరిస్థితులను అధ్యయనం చేశారు. నీటి లభ్యత విషయమై మైలవరం జలాశయాన్ని బృందం సభ్యులు పరిశీలించారు. అలాగే ఎం.కంబాలదిన్నె గ్రామ పరిధిలో ఒకే ప్రాంతంలో ఉన్న 3 వేల ఎకరాల భూమి అనుకూలతను పరిశీలించి, రెవెన్యూ అధికారుల ద్వారా వివరాలు సేకరించారు. అలాగే తలమంచిపట్నం గ్రామం వద్ద ఉన్న పవర్‌గ్రిడ్, ప్రధాన రహదారి అనుకూలతను పరిశీలించారు. జమ్మలమడుగు ప్రాంతంలో రైలుమార్గం అందుబాటుపై ఆరా తీశారు. ఈనెలలోనే మరోసారి మెకాన్, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు మండలంలో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. చివరగా సమర్పించే నివేదికల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బృందం సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిసి మరిన్ని వివరాలు సేకరించి, తుది నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పర్యటనలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ జయలక్ష్మి, జేడీ శ్రీనివాసయాదవ్, గనులు, భూగర్భశాఖ జేడీ నాగరాజు, ఏడీ చంద్రమౌళి, ఆర్డీవో నాగన్న, తహసీల్దార్ పీయస్.మొహిద్దీన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



కడప జిల్లా మైలవరం మండలంలో పర్యటించిన టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు భూముల లభ్యత గురించి వివరాలు తెలుసుకుంటున్న దృశ్యం



నాలుగేళ్ల కనిష్టానికి జీడీపీ వృద్ధి రేటు

★ 6.5 శాతమేనని సీఎస్‌ఓ అంచనా
★ తయారీ రంగంపై జీఎస్‌టీ ప్రభావం, వ్యవసాయోత్పత్తులు తగ్గడమే కారణం

న్యూఢిల్లీ, జనవరి 5: దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు ఈ ఆర్థిక సంవత్సరం (2017-18)లో నాలుగేళ్ల కనిష్ట స్థాయి అయిన 6.5 శాతానికి దిగజారుతుందని అంచనా. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇంత తక్కువ స్థాయిలో ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు పడిపోవడం ఇదే మొదటిసారి. ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు పడిపోవడానికి ప్రధాన కారణాలు దేశ తయారీ రంగం (మానుఫాక్చరింగ్ సెక్టార్)పై కొత్తగా ప్రవేశపెట్టిన వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు తగ్గడమని సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సీఎస్‌ఓ) శుక్రవారం విడుదల చేసిన జాతీయ గణాంకాల ముందస్తు అంచనాలలో వెల్లడించింది. దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఏడు శాతం, అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది శాతం ఉండింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతం ఉండింది. నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 2014 మేలో ఏర్పడిన విషయం విదితమే. మానుఫాక్చరింగ్ సెక్టార్‌లో గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) వృద్ధి రేటు కూడా ఈ ఆర్థిక సంవత్సరం 4.6 శాతానికి తగ్గుతుందని సీఎస్‌ఓ అంచనా వేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇది 7.9 శాతం నమోదయింది. సగటు వృద్ధి రేటుపై జీఎస్‌టీ ప్రభావం కొంత వరకు ఉందని చీఫ్ స్టాటిస్టీసియన్ టీసీఏ ఆనంద్ ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకు బదులుగా చెప్పారు.

సరికొత్త స్థాయిలకు మార్కెట్లు

★ గరిష్ఠ రికార్డులు సృష్టించిన సూచీలు
★ 34,154 పాయింట్లకు చేరిన సెన్సెక్స్
★ 10,559 పాయింట్లకు పెరిగిన నిఫ్టీ

న్యూఢిల్లీ, జనవరి 5: విదేశీ నిధులు ఎడతెరిపి లేకుండా తరలి వస్తుండటంతో పాటు మదుపరులు టెలికం, కన్స్యూమర్ డ్యూరేబుల్స్, స్థిరాస్తి, లోహ, బ్యాంకింగ్ షేర్లను విస్తృతంగా కొనుగోలు చేయడంతో దేశీయ స్టాక్ మార్కెట్ల కీలక సూచీలు శుక్రవారం రికార్డు గరిష్ఠ స్థాయిలకు చేరుకున్నాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) సెన్సెక్స్ 184 పాయింట్లు పుంజుకొని, జీవితకాల గరిష్ఠ స్థాయి 34,153.85 పాయింట్ల వద్ద ముగిసింది. 50 షేర్లతో కూడిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) నిఫ్టీ కూడా రికార్డు గరిష్ఠ స్థాయి 10,558.85 వద్ద స్థిరపడింది. నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏల) భారంతో కుదేలయిన ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీలో భాగంగా రూ. 80వేల కోట్ల విలువ గల రీక్యాపిటలైజేషన్ బాండ్లను జారీ చేయడానికి లోక్‌సభ గురువారం ఆమోదం తెలుపడంతో శుక్రవారం స్టాక్ మార్కెట్లలో సెంటిమెంట్ బలపడింది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ తొలిసారి 25వేల మార్కుకు చేరడంతో పాటు అమెరికా స్టాక్ మార్కెట్లలో ర్యాలీ రావడం ఫలితంగా ప్రపంచ మార్కెట్లలో సూచీలు పైకి ఎగబాకటం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లకు ఊతమిచ్చింది. శుక్రవారం 30 షేర్లతో కూడిన సెన్సెక్స్ పటిష్ఠమైన స్థాయి వద్ద ప్రారంభమయి, పైకి ఎగబాకుతూ ఇంట్రా-డేలో జీవితకాల గరిష్ఠ స్థాయి 34,188.85 పాయింట్లకు చేరుకుంది. నిరుడు డిసెంబర్ 27న ఇంట్రా-డేలో చేరిన 34,137.97 పాయింట్ల రికార్డును సెన్సెక్స్ శుక్రవారం అధిగమించింది. అయితే ఈ దశలో మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడంతో కొంత దిగజారి, చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 184.21 పాయింట్ల (0.54 శాతం) లాభంతో 34,153.85 పాయింట్ల వద్ద ముగిసింది. నిరుడు డిసెంబర్ 29న సాధించిన రికార్డు ముగింపు 34,056.83 పాయింట్లను అధిగమించింది. సెన్సెక్స్ గురువారం 176.26 పాయింట్లు పుంజుకున్న విషయం విదితమే. నిఫ్టీ కూడా శుక్రవారం ఇంట్రా- డేలో గరిష్ఠ స్థాయి 10,566.10 పాయింట్లను తాకింది. అయితే చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 54.05 పాయింట్లు (0.51 శాతం) పుంజుకొని, 10,558.85 పాయింట్ల వద్ద స్థిరపడింది. 10,534.25 పాయింట్ల వద్ద పటిష్ఠమైన స్థితిలో ప్రారంభమయిన నిఫ్టీ 10,566.10- 10,520.10 పాయింట్ల మధ్య కదలాడింది. నిరుడు డిసెంబర్ 26న ముగిసిన 10,531.50 పాయింట్ల స్థాయిని శుక్రవారం అధిగమించింది. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభపడటం ఇది వరుసగా అయిదో వారం. 2018 తొలి వారంలో సెన్సెక్స్ 97.02 పాయింట్లు (0.28 శాతం) పుంజుకోగా, నిఫ్టీ 28.15 పాయింట్లు (0.26 శాతం) పెరిగింది.





ఎన్‌ఎస్‌ఈలో శుక్రవారం జరిగిన లావాదేవీల్లో రంగాల వారీగా చూస్తే మీడియా 1.45 శాతం, ప్రైవేటు బ్యాంకులు 0.95 శాతం, ఇన్‌ఫ్రా 0.94 శాతం, ఎఫ్‌ఎంసీజీ 0.84 శాతం, ఫార్మా 0.70 శాతం, బ్యాంక్ 0.55 శాతం, మెటల్ 0.45 శాతం, ఫైనాన్స్ సర్వీస్ 0.43 శాతం, ఐటీ 0.37 శాతం చొప్పున పెరిగాయి. అయితే, ఆటో, రియాల్టీలు వరుసగా 0.20, 0.19 శాతం చొప్పున పడిపోయాయి.

శుక్రవారం నాటి లావాదేవీల్లో లాభపడిన వాటిలో యెస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, అదాని పోర్ట్స్, ఇండస్ఇండ్ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, లుపిన్, డాక్టర్ రెడ్డీస్ ఉన్నాయి. నష్టపోయిన వాటిలో భారతి ఇన్‌ఫ్రాటెల్, హిండాల్కో, యూపీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీ, ఓఎన్‌జీసీ, సిప్లా, బీపీసీఎల్, విప్రో, ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్నాయి.

పెరిగిన మదుపరుల సంపద

న్యూఢిల్లీ: బీఎస్‌ఈలో శుక్రవారం జరిగిన లావాదేవీల్లో పలు షేర్ల ధరలు బాగా పెరగడంతో మదుపరుల సంపద రూ. 1.13 లక్షల కోట్లు పెరిగింది. స్టాక్ మార్కెట్‌లో ర్యాలీ రావడంతో బీఎస్‌ఈలో లిస్ట్ అయిన కంపెనీల షేర్ల విలువ రూ. 1,13,924.97 కోట్లు పెరిగి, రికార్డు స్థాయిలో రూ. 1,53,77,070 కోట్లకు చేరింది.

వంద లక్షల టన్నుల ఆహార ధాన్యాల నిల్వకు ప్రణాళిక

న్యూఢిల్లీ, జనవరి 5: దేశవ్యాప్తంగా వంద లక్షల టన్నుల ఆహారధాన్యాలను నిల్వ చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికను ఆమోదించినట్టు, మూడు దశల్లో ఇది పూర్తవుతుందని కేంద్రం తెలిపింది. రాజ్యసభలో శుక్రవారం నాడు కేంద్ర ఆహారశాఖ ఉప మంత్రి సీఆర్ చౌదరి ఈ విషయమై లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ, ఇప్పటికే 6.25 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను నిల్వ చేసేందుకు పటిష్ఠమైన స్టోరేజీ సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. నిల్వ చేసిన ఆహార ధాన్యాలు చెడిపోకుండా ఉండేందుకు 'ఇనుప గోతులు' నిర్మిస్తున్నామని వివరించారు. మరిన్ని ప్రాంతాల్లో ఈ తరహా గోతులను నిర్మించి వంద లక్షల టన్నుల ఆహార ధాన్యాలను నిల్వ చేస్తామన్నారు. 'ఇనుప గోతుల' నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పిలిచామని, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహా ఇతర సంస్థలు 726 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను నిల్వ చేస్తున్నాయని తెలిపారు. ఆహార పదార్థాలను భద్రంగా నిల్వ చేసేందుకు ప్రైవేటు సంస్థలను కూడా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎఫ్‌సిఐపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిస్తామని ఆయన ప్రకటించారు. ఎఫ్‌సిఐ గొడౌన్లలో బయో మెట్రిక్ హాజరు, సీసీ టీవీలు వంటి ఏర్పాట్లతో నకిలీ కూలీల వంటి అక్రమాలను అరికడతామన్నారు. 2016-17లో ఎఫ్‌సిఐలో కూలీలకు 3,664 కోట్ల రూపాయలను చెల్లించామన్నారు.

వాటాల విక్రయంపై నిర్ణయం తీసుకోలేదు!

స్టీల్ ప్లాంట్ సీఎండీ మధుసూదన్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 5: విశాఖ స్టీల్ ప్లాంట్ వాటాల విక్రయంపై నిర్దిష్టమైన నిర్ణయాన్ని తీసుకోలేదని స్టీల్ ప్లాంట్ సీఎండీ మధుసూదన్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌లో 10 శాతం వాటాలను విక్రయిస్తున్న కథనాలు వచ్చాయని, వాటాలు విక్రయించాలంటే, కేంద్రం చాలా అంశాలను పరిగణలోకి తీసుకుంటుందని అన్నారు. మార్కెట్ పరిస్థితులు, ఆర్థిక పనితీరు, స్టాక్ మార్కెట్, విస్తరణ పనులు, కంపెనీ అంతర్గత విషయాలను పరిశీలిస్తుందని ఆయన చెప్పారు. ఇప్పటి వరకూ వాటాల విక్రయంపై నిర్ణయం తీసుకోలేదని అన్నారు. విశాఖ స్టీల్ గడచిన మూడు నెలల నుంచి మార్కెట్‌లో మళ్లీ నిలదొక్కుకుందని అన్నారు. అయితే, ఉత్పత్తి వ్యయం పెరిగిపోయిందని అన్నారు. బొగ్గు ధరలు గణనీయంగా పెరిగాయని, ఎన్ఎండీసీ ఐరన్ ఓర్ ధరను పెంచిందని మధుసూదన్ తెలిపారు. దీనివలన ఉత్పత్తి వ్యయం పెరిగిందని చెప్పారు. మూడో త్రైమాసికంలో స్టీల్ ప్లాంట్ పనితీరు ఏవిధంగా ఉందో, నాలుగో త్రైమాసికంలో కూడా అదే విధంగా ఉంటుందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కాకినాడ - పిఠాపురం రైల్వే లైనుకు బ్రేకు!


★ ఆర్థికంగా లాభదాయకం కాదు
★ స్పష్టం చేసిన ద.మ. రైల్వే జీఎం యాదవ్

కాకినాడ, జనవరి 5: దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న కాకినాడ-పిఠాపురం రైల్వే లైన్ పనులను ప్రస్తుతానికి స్తంభింపజేశామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు వినోద్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ రైల్వే లైన్ నిర్మాణం వల్ల రైల్వే శాఖకు ఎటువంటి ఆర్థిక లాభం ఉండదన్నారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌కు తనిఖీల నిమిత్తం శుక్రవారం ఇక్కడకు వచ్చిన వినోద్‌కుమార్ యాదవ్ విలేఖర్లతో మాట్లాడారు. కాకినాడ- పిఠాపురం రైల్వే లైను నిర్మాణానికి రైల్వే శాఖ సుమారు రూ.230 కోట్లతో అంచనా వేసిందన్నారు. నిర్మాణం నిమిత్తం సర్వే నిర్వహించగా, ఎటువంటి ఉపయోగం ఉండదని, ఆర్థికంగా భారమని నివేదిక ఇవ్వడంతో ప్రస్తుతానికి ఆ ప్రాజెక్ట్ నిర్మాణానికి తాత్కాలిక బ్రేకు వేశామన్నారు. రూ.1045 కోట్ల వ్యయం కాగల కోటిపల్లి- నరసాపురం రైల్వే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కోటిపల్లిలో గోదావరి నదిపై ఐదు కిలోమీటర్ల వంతెనను నిర్మిస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకుల అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అక్కడకు చేరుకున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కాకినాడ-పిఠాపురం రైల్వేలైన్ నిర్మాణం ప్రజల చిరకాల కోరికని దీనిని దృష్టిలో పెట్టుకుని మరోసారి ఈ నిర్మాణ పనులను ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రాన్ని యాదవ్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిఆర్ఎం ఆర్ ధనుంజయులు, సిఓఎం ఎన్ మధుసూదన రావు, పిసిఇ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్ శ్రీధర్

కొత్తగూడెం, జనవరి 5: ఈ ఆర్థిక సంవత్సరానికి సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సింగరేణి కాలరీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్ శ్రీధర్ కోరారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని సింగరేణి భవన్‌లో 11 ఏరియాల జనరల్ మేనేజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రాజెక్టుల అవసరాలకు అనుగుణంగా బొగ్గును ఉత్పత్తి చేయటంతో పాటు రవాణాలో సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సింగరేణి సంస్థ త్వరలో చేపట్టనున్న నూతన ప్రాజెక్టుల ప్రారంభానికి అవసరమైన సన్నాహాలు చేయాలని కోరారు. ఒడిశా రాష్ట్రంలోలోని నైనీ బొగ్గుగని ప్రారంభానికి చర్యలు చేపట్టాలని జీఎం విజయరావును ఆదేశించారు. ఈ ఏడాది సింగరేణి యాజమాన్యం డిసెంబరు నెల చివరి నాటికి 420లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించాలని తెలిపారు. రానున్న మార్చి నాటికి 2.50లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని కోరారు. బొగ్గు ఉత్పత్తితో పాటు రవాణాలో గత ఏడాది కన్నా 9శాతం వృద్ధిని అధిగమించాలని అన్నారు. ఓపెన్‌కాస్ట్‌లో 282.9మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబిని తొలగించినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు భాస్కర్ రావు, చంద్రశేఖర్, శంకర్, జిఎంలు ఆంతోని రాజా, కిషన్‌రావు, నాగేశ్వర రావు, నాగయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్

రైల్వేలో సోలార్ పవర్

★ స్టేషన్లలో ప్రత్యేక ప్రాజెక్టులు
★ రెండేళ్ళల్లో పూర్తి స్థాయిలో నిర్వహణ

విశాఖపట్నం, జనవరి 5: అతి పెద్ద రైల్వే వ్యవస్థకు విద్యుత్ వాడకం విపరీతంగా ఉంటోంది. అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని తగ్గించే అవకాశాలు ఎక్కడా కనిపించడంలేదు. దీంతో రైల్వే ఇపుడు సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ను ప్రత్యామ్నాయంగా చేసుకుంటోంది. దీనివల్ల ఎటువంటి పర్యావరణ సమస్యలు ఉత్పన్నంకావు. పైగా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతోంది. ప్రధానంగా ఇంధన పొదుపు సాధ్యపడుతుంది. వీటితోపాటు చార్జీల భారాన్ని తగ్గించుకునే వీలుంటుంది. వృథాగా విద్యుత్ వాడకానికి కళ్ళెం వేసినట్టు అవుతుంది. ఇలా బహుళ ప్రయోజనాలు కలిగి ఉండే సోలార్ పవర్ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే నిర్ణయించింది. రానున్న రెండేళ్ళకాలంలో దేశవ్యాప్తంగా ఉన్న రైల్వేస్టేషన్లకు సోలార్ పవర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాల్సిందిగా ఆయా రైల్వేజోన్లకు ఆదేశించినట్టు తెలిసింది. దేశంలో ఉన్న పెద్ద రైల్వేస్టేషన్లలో సోలార్ పవర్‌ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వచ్చే ఫలితాలను దృష్టిలోపెట్టుకుని మిగిలిన రైల్వేస్టేషన్లకు ఈ ప్రాజెక్టును విస్తరించాలని కూడా రైల్వే ఆలోచన చేస్తోంది. అత్యధికంగా విద్యుత్ వాడకం జరిగే రైల్వేస్టేషన్లను గుర్తించడం, వీటి వద్ద సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తే అయ్యే ఖర్చు, ప్రతినెల ఎంత వరకు దీనివల్ల ఖర్చును తగ్గించుకోవచ్చనే అంశాలను రైల్వే నిశితంగా పరిశీలిస్తోంది. సోలార్ పవర్‌ను అందుబాటులోకి తీసుకురావాలంటే తొలుత భారీగానే వెచ్చించాల్సి ఉన్నందున ఇది రైల్వేకు భారం కాకుండా చూడాల్సి ఉంది. అలాగే ఏ-1 క్యాటగిరీలుగా గుర్తింపు పొందిన రైల్వేస్టేషన్లలో సోలార్ పవర్‌ను అందుబాటులోకి తీసుకువస్తే దీని ద్వారా అయ్యే వ్యయాన్ని అంచనా వేయవచ్చని రైల్వే అభిప్రాయపడుతోంది. దేశంలో హౌరా, గౌహతి, పూణే, భువనేశ్వర్, ముంబై, చెన్నై, సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం రైల్వేస్టేషన్లకు సోలార్ పవర్ అవసరాన్ని గుర్తించినట్టు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ఏడు వేలకు పైగా రైల్వేస్టేషన్లు ఉండగా, ఇందులో 20 శాతం మేర రైల్వేస్టేషన్లకు తొలిదశలో సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ విధంగా 16 రైల్వేజోన్ల పరిధిలో ఉన్న డివిజన్లకు ఈ ప్రాజెక్టును దశలవారీగా విస్తరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, వీటన్నింటికంటే ముందుగా ఈ ప్రాజెక్టును ఏర్పాటు సాధ్యసాధ్యాలను పరిశీలిస్తోంది. దీనికి అవసరమైన ప్రాజెక్టు నివేదికలు ఇవ్వాల్సిందిగా కూడా ఆయా జోన్లు, డివిజన్లకు ఆదేశించినట్టు తెలిసింది. రానున్న రెండేళ్ళల్లో అన్ని రైల్వేస్టేషన్లలో సోలార్ పవర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్న రైల్వే దీనికి అవసరమైన చర్యలు త్వరలో చేపట్టనుంది. రైల్వేస్టేషన్ల విస్తీర్ణం, ప్లాట్‌ఫారాల సంఖ్య, పై భాగంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశాలు, మొత్తం మీద ప్రాజెక్టుకు అయ్యే వ్యయం, దీని ఏర్పాటు ద్వారా ఇంధన పొదుపు ఎంత మేర సాధ్యపడుతుందన్న అంశాలపైన దృష్టిపెట్టింది.

కేంద్ర ప్రభుత్వ కంపెనీని మోసగించిన కేసులో
రెండు రాష్ట్రాల్లో సీబీఐ సోదాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యూసి), పితని లిమిటెడ్‌ను మోసం చేసిన కేసులో ఆరుగురు నిందితుల నివాసాల్లో సోదాలు నిర్వహించినట్లు కేంద్ర నేర పరిశోధన సంస్థ (సిబిఐ) తెలిపింది. ఈ రెండు సంస్థల కొల్లేటరల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న పంచదార నిల్వను మోసపూరితంగా తరలించి రూ.82,11,44,273 మొత్తం నష్టాన్ని కలిగించినందుకు సిబిఐ ఈ కేసును నమోదు చేసింది. నిందితులపై గత డిసెంబర్ 28న ఐపిసి 409, 420 ఆర్/డబ్ల్యు 120-బి, అవినీతినిరోధక చట్టం 1988ని అనుసరించి సెక్షన్ 13(2) ఆర్/డబ్ల్యు 13(1) (డి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు హైదరాబాద్ సిబిఐ డిఐజి కార్యాలయం తెలిపింది. కేసులో ఒకటో నిందితుడిగా బషీర్‌బాగ్‌లోని దక్కన్ టవర్స్‌లో ఉన్న ఎన్ఎస్ షుగర్స్, రెండో నిందితుడిగా ఎన్ఎస్ఎస్ షుగర్స్ ఎండి ఎ.ఎన్.నాగేశ్వర రావు, మూడో నిందితునిగా ఆ కంపెనీ డైరెక్టర్ జి.కనకబాబు, నాల్గో నిందితునిగా సిడబ్ల్యూసి సిఎఫ్ఎస్ మేనేజర్ డి.లక్ష్మణరావు, ఐదో నిందితునిగా కాకినాడ సెంట్రల్ వేర్ హౌస్ సూపరింటెండెంట్ బి.బి.రాజేంద్రప్రసాద్, ఆరో నిందితునిగా విశాఖపట్నం సిడబ్ల్యూసి యూనిట్ 1 రిటైర్డ్ సూపరింటెండెంట్ పి.కృష్ణమోహన్‌లను పేర్కొంటూ కేసు నమోదు చేసినట్లు డిఐజి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌లోని ఎన్ఎస్ షుగర్స్ కార్పొరేట్ కార్యాలయంలోనూ, 4, 5, 6 నిందితులకు చెందిన విశాఖపట్నంలోని నివాసాల్లో ఏక కాలంలో సోదాలు నిర్వహించినట్లు పేర్కొంది.

వాకపల్లి కేసు కొత్త మలుపు
స్పెషల్ పీపీని నేరుగా నియమించిన హైకోర్టు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: విశాఖపట్నం జిల్లా ఏజెన్సీలోని వాకపల్లి గ్రామానికి సంబంధించిన గిరిజన మహిళలపై అత్యాచారం ఘటన కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో బాధితుల తరఫున కోర్టులో వాదించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి త్రినాథరావును హైకోర్టు నేరుగా నియమిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై 9 మంది మహిళలు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం సీతారామ మూర్తి విచారించారు. విశాఖపట్నం జిల్లా11వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో తమ తరఫున వాదనలు వినిపించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలంటూ బాధితులైన మహిళలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ కేసుకు త్రినాథరావును పిపిగా నియమించాలని ఆర్డీవో కోరారు. గత నెల 29వ తేదీన త్రినాథరావుపై కేసు నమోదైందంటూ ఆర్డీవో దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. త్రినాథరావును పిపిగా నియమించేందుకు ఆయనపై ఉన్న కేసు అడ్డుకాదని హైకోర్టు స్పష్టం చేసింది. బాధితులకు ప్రాసిక్యూటర్‌ను ఎంపిక చేసుకునే హక్కును చట్టం కల్పిస్తోందని హైకోర్టు పేర్కొంది. ఈ కేసులో త్రినాథరావు వద్ద నుంచి ఈ ఘటనలో నిందితుల ఫోటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, ఆయనపై కేసు కూడా ఉందని ఏపి ప్రభుత్వతరఫు న్యాయవాది విద్యాసాగర్ తెలిపారు. ముగ్గురు అడ్వకేట్స్‌తో కూడిన ప్యానెల్‌ను రాష్ట్రప్రభుత్వం ఖరారు చేస్తుందని, వీరిలో ఒకరిని ప్రత్యేక పిపిగా నియమించాలని ఆమె కోర్టును అభ్యర్థించారు.

ఆయనేమిటీ.. అలా అన్నారు?
జైట్లీ ప్రకటనపై సీఆర్‌డీఏ అధికారుల వ్యాఖ్య

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 5: అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల లో తాజాగా రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనకు తాము ఇచ్చిన లెక్కలకు ఎక్కడా పొంతన లేదని సీఆర్‌డీఏ చెబుతోంది. హడ్కోతో పాటు ప్రపంచ బ్యాంకు, ఇతర బ్యాంకుల నుంచి రూ.14,200 కోట్లు మంజూరయ్యాయని రాజధాని అభివృద్ధి నివేదికలో సీఆర్‌డీఏ పేర్కొంది. అయితే ప్రాజెక్టుల నిర్మాణం ఇంకా ప్రారంభదశలోనే ఉందని జైట్లీ రాజ్యసభలో సమాధానమిచ్చారు. కాగా ప్రపంచ బ్యాంకు రుణంలో 30 శాతం నిధులను ముందుగానే ఖర్చు చేసే అవకాశముందని ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో రహదారి ప్రాజెక్టులను ఈ నిధులతోనే చేపట్టినట్లు సీఆర్‌డీఏ చెబుతోంది. రాజధాని నిర్మాణంలో నిధుల విషయంలో ఎలాంటి గందరగోళం లేదని సీర్‌డీఏ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కిడ్నీ కేసులతో కాసుల వర్షం

కిడ్నీ కావాలంటే 25 లక్షలు ఇవ్వాల్సిందే ◆ దాతకు ముట్టేది మూడు లక్షలే ◆ సొమ్ము చేసుకుంటున్న దళారులు, ఆసుపత్రులు

ఆంధ్రభూమి బ్యూరో

గుంటూరు/నరసరావుపేట, జనవరి 5: దళారులు, ఆసుపత్రులకు కాసుల వర్షం కురిపిస్తున్న కిడ్నీల మార్పిడి వ్యవహారం తాజాగా గుంటూరు జిల్లాలో మరోసారి కలకలం రేపుతోంది. నరసరావుపేట వేదికగా వెలుగు చూసిన ఈ కిడ్నీ రాకెట్ ఛేదించేందుకు జిల్లా పోలీసులు కసరత్తు జరుపుతున్నారు. తెరవెనుక సూత్రధారులు, పాత్రధారులపై ఇప్పటికీ ఓ స్పష్టత రాలేదు. కేసులో ప్రధాన భూమిక వహిస్తున్న వెంకటేశ్వర్లు నాయక్ ఆచూకీ తెలిస్తే కానీ రాకెట్ గుట్టు బట్టబయలయ్యే అవకాశాలు లేవు. అయితే ఇప్పటి వరకు దుర్గి మండలంలో నివసిస్తున్న బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ సరిహద్దున తెలంగాణలోని నల్గొండ జిల్లా హాలియాకు పరారైనట్లు చెప్తున్నారు. అతన్ని పట్టుకునేందుకు నరసరావుపేట సీఐ శివప్రసాద్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. వెంకటేశ్వర్లు నాయక్ ఆధార్ కార్డులో తన ఫొటోను మార్ఫింగ్‌చేసి గుంటూరు వేదాంత ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సకు వచ్చిన శివనాగేశ్వరరావు బంధువు రావూరి రవిచౌదరిగా అవతారమెత్తిన సంగతి విదితమే. నరసరావుపేటలోని ఓ టీడీపీ నేత ఒత్తిడి మేరకు తహశీల్దారు విజయకుమారి వెంకటేశ్వర్లునాయక్ ఫైల్‌ను విచారణ నిమిత్తం అక్కడి పోలీసులకు పంపిన నేపథ్యంలో అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అయితే శివనాగేశ్వరరావు తమ వద్దకు వచ్చినప్పటికీ శస్త్ర చికిత్స సాధ్యపడదని చెప్పామని ఈ వ్యవహారంతో తమకెలాంటి ప్రమేయం లేదని వేదాంత ఆసుపత్రి నిర్వాహకులు చెప్తున్నప్పటికీ గతంలో కూడా ఒకటి, రెండు సందర్భాలలో ఇలాంటి శస్త్రచికిత్సలే జరిగాయనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. కాగా శివనాగేశ్వరరావుకు విజయవాడ ఆయుష్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స పూర్తయిందని వేదాంత యాజమాన్యం స్పష్టం చేస్తున్నారు. గుంటూరులో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు వెంకటేశ్వర్లు నాయక్‌తో శివనాగేశ్వరరావుకు లింక్ ఎలా కుదిరిందనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

విజయవాడ ఆయుష్ ఆసుపత్రిలో మార్పిడి శస్త్ర చికిత్స ఎలా జరిగిందనే విషయమై ఆరా తీస్తున్నారు. కాగా కిడ్నీ రాకెట్ వెనుక పెద్దలను గుర్తించి తక్షణమే అరెస్టుచేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నరసరావుపేటలో ఆందోళన నిర్వహించారు. నరసరావుపేట వేదికగా జరుగుతున్న దందాలకు అంతేలేదు. ఇప్పటి వరకు మందులు, పాలు, నూనె, ఆహార పదార్థాల కల్తీలకు నిలయంగా మారిన నరసరావుపేట నేడు కిడ్నీలు విక్రయించే ముఠాకు వేదిక కావడం మరోసారి సంచలనం రేకెత్తించింది. తాజాగా రాష్ట్రంలో చర్చనీయాంశమైన కిడ్నీ రాకెట్‌లో స్థానికంగా బ్రోకర్లు తమ తెలివితేటలు చూపించి పేదలు, మధ్య తరగతి కుటుంబాల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఒక కిడ్నీ విక్రయంలో లక్ష రూపాయల నుండి పది, పాతిక లక్షల వరకు పైగా చేతులు మారుతున్న వైనం ఆందోళనకు గురిచేస్తోంది. ఈజీ మనీకి ఈ ప్రాంత వాసులకు కిడ్నీ దందా వేదికైంది. ఈ కిడ్నీల దందా నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి బయటకు పొక్కడంతో ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. తహశీల్దార్ కార్యాలయం నుండి రెండు నెలల క్రితం కిడ్నీ మార్పిడికి సంబంధించిన అనుమతి పత్రాలు లభించినట్లు పోలీస్ అధికారులు చెపుతున్న మాటలను, వినిపిస్తున్న అంశాలతో విచారణ ఎలా జరుగుతుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తాజాగా వెలుగుచూసిన ఉదంతంతో పాటు గత ఐదారునెలల కాలంలో ఎన్ని జరిగుంటాయోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కిడ్నీ కావాల్సిన వారి నుండి 25 లక్షల నుండి 30 లక్షల వరకు పైగా వైద్యశాల నిర్వాహకులు వసూలు చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. అయితే కిడ్నీ దాతకు కేవలం రెండునుండి ఐదు లక్షలు మాత్రమే ముట్టజెప్పి మిగిలిన పైకం ఆస్పత్రివారు, మధ్యవర్తులు నొక్కేస్తున్నట్లు తెలుస్తోంది. దాతను వైద్యశాలకు వరకు మాయ మాటలతో తీసుకువచ్చే బ్రోకర్లకు లక్ష నుండి మూడు లక్షల రూపాయలు గిట్టుబాటు అవుతోందని విశ్వసనీయంగా తెలుస్తోంది. రెవెన్యూ, పోలీస్ అధికారులు ఈ విషయంలో చూసిచూడనట్లు వ్యవహరించి, సంబంధిత పత్రాలు అందించేందుకు భారీ మొత్తంలో చెల్లించాల్సి ఉంటుందని సమాచారం. మిగిలిన సొమ్ము వైద్యశాల నిర్వాహకులకు అందుతుంది. ఈ వ్యవహారం మొత్తం 25 లక్షలుగా నడుస్తోంది. గడచిన ఆరు మాసాల్లో ఐదారు కిడ్నీల మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయని తెలుస్తోంది. ప్రస్తుత తాజా సంఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గుంటూరు వైద్యశాలలో ఇలాంటివి చోటుచేసుకున్నాయా.. ఒకవేళ కిడ్నీ మార్పిడి జరిగి ఉంటే ఎన్ని కిడ్నీ శస్త్రచికిత్సలు జరిగి ఉంటాయి.. ఇందులో ఎవరు ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. అందుకు కారణాలు ఏమిటనేది విచారణలో తేలాల్సి ఉంది. పల్నాడు ప్రాంతాల్లోని మారుమూల పల్లెలు, తండాలను టార్గెట్ చేసుకుని, దళారులు ఈ కిడ్నీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ దళారులు ఎంత మంది పనిచేస్తున్నారనేది తేలాల్సి ఉంది. శస్త్ర చికిత్సలకు సంబంధించిన అనుమతి పత్రాలు నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం నుండి వెలువడ్డాయా.. లేక తాజా సంఘటనలో మాత్రమే ఈ కార్యాలయం నుండి అనుమతిపత్రాలు వచ్చాయా.. అనేది తేలాల్సి ఉంది. ఈ కిడ్నీ స్కాంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సదుం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న వైఎస్ జగన్

ఆర్టీసీని విలీనం చేస్తా: జగన్

సదుం, జనవరి 5: వైకాపా అధికారంలోకి రాగానే ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తానని వైకాపా అధినేత వైఎస్ జగన్ అన్నారు. చిత్తూరు జిల్లా సదుంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పుంగనూరులో ఆర్టీసీ డిపో నిర్మించి ఏడేళ్లు గడుస్తున్న ఇంతవరకు బస్సులు ఏర్పాటుచేయడంలో జాప్యం జరుగుతూనే ఉందని జగన్ అన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముందుగా ఆర్టీసీలో కాంట్రాక్టు కార్మిక సోదరుల సర్వీసు రెగ్యులర్ చేస్తానన్నారు. దీర్ఘకాలంతో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి నెలకు 10వేల రూపాయలు పింఛన్ రూపంలో ఇస్తామన్నారు. వైద్య చికిత్సల్లో వెయ్యిరూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ కింద ఎంత ఖర్చయినా భరించి ప్రభుత్వం తరపున వైద్యం అందిస్తానన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికలల్లో చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.కాగా రాష్ట్రానికి చంద్రగ్రహణం పట్టిందని జగన్ ఎద్దేవా చేశారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాబోయే ఎన్నికలల్లో ప్రజలను ఓటు అడిగేందుకు సిగ్గుపడాలని జగన్ అన్నారు. ప్రత్యేక హోదాకోసం పోరాడకుండ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన ఘనత బాబుదేనన్నారు.ప్రత్యేక హోదా వచ్చి ఉంటే లక్షలాది ఉద్యోగాలు వచ్చేవన్నారు. జిల్లాలో పలు చిన్న ప్రాజెక్టులు వైఎస్ హయాంలో నిర్మించినవేనన్నారు. అయితే వాటికి పైపులైను వేయకుండా చంద్రబాబు తాత్సారం చేస్తున్నారన్నారు. అలాగే పుంగనూరు ఆర్టీసీ డిపోకు బస్సులు కేటాయించే విషయంలో కూడాజాగు చేయడం బాధాకరమన్నారు.రాజన్న ప్రభుత్వం వస్తే గ్రహణ వీడి అభివృద్ధిపనులన్ని కొనసాగుతాయని జగన్ అన్నారు.

శ్రీకాళహస్తిలో
క్షుద్రపూజల కలకలం

శ్రీకాళహస్తి, జనవరి 5: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో క్షుద్ర పూజలు జరిగాయని ఆరోపణలు మరచిపోకముందే శ్రీకాళహస్తిలో కూడా అటువంటి పూజలే జరిగినట్లు కలకలం రేగింది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీకాళహస్తి మండలం వేడం గ్రామం వద్ద కొండపై ఉన్న భైరవ కోనలో క్షుద్ర పూజలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 18వ తేదీ అమావాస్య సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ ధనపాల్ క్షుద్ర పూజలు చేయించారని విమర్శలు వస్తున్నాయి. అన్నదానం విరాళం బ్యాంకుకు జమచేయకుండా వాడుకొన్నాడని ఆరోపణపై ఆయనను ఈఓ భ్రమరాంబ ఈ నెల 4వ తేదీ న సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేసిన వెంటనే ఆయనపై క్షుద్రపూజల ఆరోపణలు కూడా చుట్టుముట్టాయి. ప్రతి మంగళవారం రాత్రి, అమావాస్య రోజు భైరవకోనలో ప్రత్యేక హోమాలు జరగడం సాధారణం. అయితే గత నెల 18న ధనపాల్ క్షుద్రపూజలు చేయించాడని కొందరు వీడియోను బయటపెట్టారు. ప్రతిసారి లాగే హోమం జరిగిందే తప్ప క్షుద్రపూజలంటూ ఏమీ జరగలేదని మరికొందరు వాదిస్తున్నారు.



ప్రమాదానికి గురైన ఎస్కార్ట్ వాహనం

సీఎం పర్యటనలో అపశ్రుతి
హోం మంత్రి ఎస్కార్ట్ వాహనంలో చెలరేగిన మంటలు

మాకవరపాలెం, జనవరి 5: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం జిల్లా, ధర్మసాగరం గ్రామంలో శుక్రవారం జరిగే జన్మభూమి గ్రామసభలో పాల్గొనేందుకు వెళ్తున్న రాష్ట్ర హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప కాన్వాయిలోని ఒక వాహనం నుండి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం సమీపంలోకి వచ్చే సరికి కాన్వాయిలోని బోలేరా వాహనం నుండి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వాహనంలో ఆరుగురు ఎస్కార్ట్ సిబ్బంది ఉన్నారు. వీరంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ వాహనాన్ని ఆపడంతో అందులో ఉన్నవారంతా బయటకు దూకేశారు. వాహనంలోని సీట్లు, వైరింగ్ కాలిబూడిదయ్యాయి. వాహనంలో రన్నింగ్‌లో ఉండగానే మంటలు ఏర్పడ్డాయని, షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఎస్కార్ట్ సిబ్బందికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

1వ పేజీ తరువాయి

ట్రిపుల్ తలాక్!

చేశాయి. ఈ అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజ్యసభలో తీవ్రస్థాయిలో వాగ్వాదం, గొడవ జరిగింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు మొండిపట్టు పట్టడంతో ట్రిపుల్ తలాక్ బిల్లు బడ్జెట్ సమావేశాల వరకూ వాయిదా పడింది. లోక్‌సభ శుక్రవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమం ముగిసిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు నిరవధికంగా వాయిదా పడింది. ప్రశ్నోత్తరాల కార్యక్రమం ముగిసిన వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేయటాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. లోక్‌సభలో ప్రతిపక్షం నాయకుడు మల్లికార్జున ఖర్గే తమ పార్టీ అసంతృప్తిని సభలోనే వ్యక్తం చేశారు. రాజ్యసభ శుక్రవారం ఉదయం 11 గంటలకు సమావేశం కాగానే చైర్మన్ వెంకయ్యానాయుడు మొదట ప్రభుత్వ పత్రాలను సభకు సమర్పింపజేశారు. ముగ్గురు సీనియర్ సభ్యులు కరణ్‌సింగ్, జనార్దన్ ద్వివేదీ, పర్వీన్ హాష్మీ రాజ్యసభ్యత్వం ముగుస్తున్న సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతలు వారు దేశానికి, రాజ్యసభకు చేసిన సేవలను కొనియాడారు. చైర్మన్ వెంకయ్యానాయుడు వారు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాజ్యసభ నుండి రిటైర్ అయినంత మాత్రాన ప్రజా జీవితం నుండి రిటైర్ అయినట్లు కాదని వెంకయ్యానాయుడు సూచించారు. శీతాకాల సమావేశాల సందర్భంగా లోక్‌సభలో 13 ప్రభుత్వ బిల్లులను ఆమోదించినట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ వెల్లడించారు. 14 రోజుల్లో 13 బిల్లులను ఆమోదించటం లోక్‌సభలో ఇదే మొదటిసారి అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ తెలిపారు. గొడవల మూలంగా నాలుగు గంటల సమయం వృధా అయినా 8 గంటల పాటు ఎక్కువ సేపు సమావేశం కావటం ద్వారా ఈ నష్టాన్ని పూడ్చుకున్నట్లు మహాజన్ తెలిపారు. ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించటం చారిత్రాత్మికమని ఆమె అన్నారు. రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లు పాస్ కాకపోవటానికి కాంగ్రెస్ వ్యవహరించిన తీరే ప్రధాన కారణమని అనంతకుమార్ విమర్శించారు. రాజ్యసభ శీతాకాల సమావేశాల్లో తొమ్మిది ప్రభుత్వ బిల్లులను ఆమోదించారు. . దేశ ఆర్థిక వ్యవస్థపై లోతుగా చర్చ జరిగింది. రాజ్యసభలో అధికార, ప్రతిపక్షం మధ్య వివిధ అంశాలపై నెలకొన్న విభేదాల మూలంగా గొడవ చేలరేగి దాదాపు ముప్పై ఐదు గంటల సమయం వృధా అయ్యింది. కేవలం నాలుగు రోజుల పాటు మాత్రమే ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగింది. జనవర్ 2న జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో గత పదిహేనేళ్లలో మొదటిసారి అన్ని ప్రశ్నలపై చర్చ జరగటం గమనార్హం. రాజ్యసభ ప్రశ్నోత్తరాల కార్యక్రమాల్లో 46 స్టార్డ్ ప్రశ్నలకు మంత్రులు సమాధానాలిచ్చారు. వెంకయ్యానాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన అనంతరం చైర్మన్‌గా నిర్వహించిన రాజ్యసభ మొదటి సమావేశం ఇదే. వెంకయ్యానాయుడు నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తానని ప్రకటించటంతో కాంగ్రెస్ సభ్యులు పోడియం వద్దకు రావటం దాదాపుగా మానివేయటం గమనార్హం.

సమస్యలపై టాస్క్ ఫోర్స్

నిన్న రాజ్యసభలో విభజన హామీలపై ప్రస్తావించిన మరుసటి రోజే తెలుగుదేశం ఎంపీలు ప్రధానికి వినతిపత్రం ఇవ్వటం గమనార్హం. శాసన సభ సీట్లను 175 నుండి 225కు పెంచుతామనే హామీ ఇంతవరకు అమలు కాలేదని ఎంపీలు ప్రధానికి వివరించారు. అసెంబ్లీ సీట్ల పెంపు ఎంత అవసరమో ఏకరువుపెట్టారు. విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు అంశం కూడా పెండింగ్‌లో ఉండటం పట్ల ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. విభజన చట్టంలో హామీ ఇచ్చిన విధంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 90:10 నిష్పత్తిలో ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని మోదీని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన 3,217 కోట్ల బకాయిలను వెంటనే చెల్లాంచాలన్నారు. పునర్విభజన మూలంగా తమ రాష్ట్రం పన్నులకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలనూ పరిశీలించాలని తెలుగుదేశం ఏంపీలు ప్రధాన మంత్రిని కోరారు. పన్నుల చట్టానికి అవరమైన సవరణలు చేయకపోతే తమ రాష్ట్రానికి దాదాపు 3,820 రూపాయల నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విభజన చట్టం 13వ షెడ్యూలులో పేర్కొన్న 11 సంస్థల నుంచి తొమ్మిదింటిని కేటాయించారన్నారు. అనంతపురంలో కేంద్రీయ వర్శిటీ, విజయనగరంలో గిరిజన వర్శిటీ ఇంకా ఏర్పాటు చేయాల్సి ఉందని నరేంద్ర మోదీ దృష్టికి తెచ్చారు. తొమ్మిది సంస్థల ఏర్పాటుకు మొత్తం ఖర్చు 11,6673 కోట్లు కాగా కేంద్రం ఇంతవరకు కేవలం 421 కోట్లు మాత్రమే విడుదలు చేసిందని ప్రధానితో చెప్పారు. విభజన చట్టం ప్రకారం దుగ్గిరాజపట్నం ఓడరేవును ఏర్పాటు చేయవలసి ఉండగా నీతి ఆయోగ్ మాత్రం దీన్ని ఏర్పాటు చేయటం సాధ్యం కాదంటోందన్నారు. కాకినాడలో ఏర్పాటు చేయాల్సిన పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కు ఆర్థిక సాయం చేయాలన్నారు. కడపలో ఉక్కు కార్మాగారం, వైజాగ్- చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు, కొత్త రాజధానికి రైల్ రోడ్ కనెక్టివిటీ, విశాపట్నం, విజయవాడలకు మెట్రో రైలు సౌకర్యం కల్పించటంవంటి హామీలింకా అమలు కాలేదన్నారు.

కోడి పందేలకు కౌంట్‌డౌన్!

జరుగుతాయనే సంగతి తెలిసిందే. దీనితో పందేలరాయుళ్లు ముందస్తుజాగ్రత్తగా నగదు నిల్వలపై దృష్టిసారించారు. ఇప్పటికే దాదాపు అన్ని ఏటీఎంల వద్ద నో క్యాష్ బోర్డులు దర్శనమిస్తుండగా, కొద్ది రోజుల్లో బ్యాంకులు కూడా ఈ బోర్డులు పెడతాయని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో నగదు విత్‌డ్రా చేయడం దుస్సాధ్యంగా మారింది. గత ఏడాది మాదిరిగా నగదు విషయంలో ఆన్‌లైన్ చెల్లింపుల విధానాన్ని ప్రోత్సహించాలన్న ఆలోచన కూడా పందాల రాయుళ్ళు చేస్తున్నట్లు సమాచారం. సంక్రాంతి కోడి పందాల విషయంలో పశ్చిమ గోదావరి జిల్లాలో మాత్రం 2014 నుంచి భారతీయ జనతా పార్టీ పెద్దలదే పై చేయి అవుతోంది. న్యాయస్థానాల్లో ఎన్ని కేసులు వేసినా వాటిపై మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించి, పబ్బం గడుపుకుంటున్నారు. భీమవరం ప్రాంతంలో ప్రథమంగా కత్తులు కట్టకుండా పందాలు వేసి, పందేలకు శ్రీకారం చుడుతుంటారు. ఈ ఏడాది కూడా కొందరు బీజేపీ పెద్దలు ఈ పందాలకు సన్నాహాలు చేసుకుంటున్నట్టు సమాచారం.

పాక్‌కు భారీ ఝలక్!

సంబంధించి అశం వారి దృష్టికి తీసుకెళ్తాం. ఏం జరుగుతుందో వేచిచూడాలి'అని పాక్ వ్యాఖ్యానించింది. అమెరికా జాతీయ ప్రయోజనాలు అలాగే విస్తృతమైన అంతర్జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే తమకు సహాయం అందుతోందని పాక్ విదేశాంగ శాఖ ఇస్లామాబాద్‌లో విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఉగ్రవాద సంస్థలపై తాము కఠినంగానే ఉంటున్నామని, ఉగ్రవాదుల ఏరివేతలో సమర్థవంతంగానే పనిచేస్తున్నామని పాక్ చెప్పుకొచ్చింది. ఇలా ఉండగా భద్రతా అవసరాల నిమిత్తం పాకిస్తాన్‌కు ఏటా బిలియన్ డాలర్ల సాయాన్ని అమెరికా అందిస్తూవస్తోంది. ఇది చారిత్రక సత్యం.

అయితే గత ఆగస్టులో దక్షిణ ఆసియా వ్యూహం ఖరారు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాకిస్తాన్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. శాంతి నెలకొల్పడం అలాగే భద్రత విషయంలో పాక్ అంకిత భావంతో పనిచేయడం లేదని ఆయన నిప్పులు చెరిగారు. పరిస్థితి ఇలానే ఉంటే కఠిన నిర్ణయాలు తప్పవని అధ్యక్షుడు ఆనాడే హెచ్చరించారని హీథర్ శుక్రవారం ఇక్కడ గుర్తుచేశారు. ముంబయిపై ఉగ్రదాడికి సూత్రధారి, జేయూడీ చీఫ్ హాఫీజ్ సయీద్ విషయంలోనూ పాక్ మైతక వైఖరిని అమెరికా తప్పుపడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. కరుడు గట్టిన ఉగ్రవాదిని స్వేచ్ఛగా ఎలా వదిలేస్తారని ఆమె ప్రశ్నించారు. హాఫీజ్ సమాచారం చెబితే 10 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటించిన విషయాన్ని విదేశాంగ ప్రతినిధి తెలిపారు.

గజల్ శ్రీనివాస్‌కు చుక్కెదురు

నిరాకరించింది. కాగా పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటీషన్‌ను ఇప్పటికే కోర్టు నిరాకరించిన సంగతి తెలిసిందే. కావాల్సిన ఆధారాలు అన్నీ సేకరించిన తర్వాత, రిమాండ్ రిపోర్టులో అన్ని విషయాలు వెల్లడించాక ఈ కేసులో ఇక నిందితుడి నుంచి రాబట్టాల్సిన సమాచారం ఏముందని కోర్టు అడిగింది. ఇంతేకాకుండా శుక్రవారం ఈ కేసు విచారణలో పోలీసులపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసులో రెండో నిందితురాలు సావిత్రిని ఇంకా అరెస్టు చేయకపోవడంపై మండిపడింది. టివిల్లో ఇంటర్వ్యూలు ఇస్తూ మాట్లాడుతున్న నిందితురాలు మీకు కనిపించలేదా, ఎందుకు అరెస్టు చేయలేకపోతున్నారని నిలదీసింది. పరారీలో ఉన్నారని ఎలా చెబుతారని అడిగింది. ఈ కేసులో అతిముఖ్యమైన సాక్ష్యాధారాలుగా ఉన్న గజల్ శ్రీనివాస్ లైంగిక ఆరోపణల వీడియో క్లిప్పింగ్‌లను తమ అనుమతి లేకుండా మీకు మీరుగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఎలా పంపించి వేస్తారా అని ప్రశ్నించింది. వీడియో క్లిప్పింగ్‌ల సిడిలను కోర్టుకు ఎందుకు సమర్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. బెయిల్ మంజూరు కాకపోవడంతో ఈ నెల 12 వరకు గజల్ శ్రీనివాస్ రిమాండ్‌లోనే కొనసాగే అవకాశం ఉంది.



మంగళగిరిలో కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా గాయత్రి పరివార్ కలశయాత్ర

మంగళగిరి, జనవరి 5: అఖిల విశ్వ గాయత్రి పరివార్, శాంతికుంజ్ హరిద్వార్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో శుక్రవారం సాయంత్రం శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై వైద్య కళాశాల ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరుప తలపెట్టిన అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞం (వాతావరణ కాలుష్యాన్ని పోగొట్టి దేశాన్ని సమర్థవంతం, శక్తివంతం, సుసంపన్నం చేసే గొప్ప ఆధ్యాత్మిక ప్రయోగం) సందర్భంగా మంగళగిరిలో 11వేలకు పైగా కలశాలతో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద టిటిడి కల్యాణ మండపం నుంచి వేలాది మందితో కలశాలతో ప్రారంభమైన మంగళ శోభాయాత్ర తాలూకా సెంటర్, గౌతమబుద్ధ రోడ్డు, ఆర్‌టీసీ బస్టాండ్, పాతబస్టాండ్ మీదుగా 3 కీమీ దూరంలో గల చినకాకానిలోని ఎన్నారై వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన యజ్ఞ ప్రాంగణానికి చేరుకుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గాయత్రి పరివార్ సభ్యులు, రష్యా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, తదితర దేశాలకు చెందిన సభ్యులు కలశ యాత్రలో పాల్గొన్నారు. వివిధ ధార్మిక ఇతివృత్తాలు కలిగిన ప్రదర్శనలతో శోభాయాత్ర నభూతో.. నభవిష్యతి చందంగా సాగింది. వేలాదిమంది తరలివచ్చి యాత్రలో పాల్గొనటంతో పట్టణ వీధులన్నీ కిక్కిరిసాయి. పట్టణ ప్రజలు కలశ యాత్రను కన్నుల పండువగా తిలకించి పరవశులయ్యారు. గాయత్రి మాతాకీ జై నినాదాలతో పట్టణ వీధులన్నీ మార్మోగాయి. గాయత్రి పరివార్ సభ్యుల నుద్దేశించి యజ్ఞ ప్రాంగణంలో గాయత్రి ట్రస్ట్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జ్, యాగ నిర్వాహకులు అశ్వనీ సుబ్బారావు స్వాగతోపన్యాసం చేస్తూ ఈ అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆధ్యాత్మిక మహోత్సవమని, ఉభయ తెలుగు రాష్ట్రాల ఆస్తిక మహాశయులందరూ ఈ పుణ్య యజ్ఞంలో పాల్గొని పునీతులు కావాలన్నారు. ఊహించిన దానికంటే కలశ యాత్రకు పెద్దసంఖ్యలో తరలివచ్చారని అన్నారు. అశ్వమేధ గాయత్రి మహాయజ్ఞం జరపటం వలన రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని, వాతావరణ కాలుష్యం పోయి ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లుతారని అన్నారు. సమాజంలో నేడు ధనార్జన ధ్యేయంగా ఎక్కువ మంది పని చేస్తున్నారన్నారు.

జన్మభూమి కాదది జాదుభూమి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమం జాదుభూమిగా మారిందని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఇక్కడ విలేఖర్లతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా 19 లక్షల ఇండ్లు, రెండు లక్షల రేషన్ కార్డులు, నాలుగు లక్షల పెన్షన్లు ఇస్తామని చెప్పారని, తాజాగా కొత్తగా ఇంటికి మరో పెన్షన్ ఇస్తామంటున్నారన్నారు. కాని ఈ హామీలను నెరవేర్చలేదన్నారు. జగన్ ప్రజా సంకల్పయాత్రకు విశేష స్పందన వస్తోందని, చంద్రబాబు మోసాలను భరించలేక ప్రజలు జగన్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారన్నారు.

ఆన్‌లైన్‌లో 56,593
ఆర్జిత సేవా టిక్కెట్లు విడుదల

ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 5: శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించిన ఏప్రిల్ నెలలో మొత్తం 56,593 టిక్కెట్లను శుక్రవారం ఉదయం 10 గంటలకు విడుదల చేసినట్లు టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఆన్‌లైన్ డిప్ విధానంలో 10,658 సేవాటిక్కెట్లు విడుదల చేశామని, ఇందులో సుప్రభాతం 7,878, తోమాల 120, అర్చన 120, అష్టదళ పాదపద్మారాధన 240, నిజపాద దర్శనం 2,300 టిక్కెట్లు ఉన్నాయని ప్రకటించారు. ఆన్‌లైన్‌లో జనరల్ కేటగిరిలో మొత్తం 45,935 సేవాటిక్కెట్లు ఉన్నాయని వివరించారు.

క్రీడ

దక్షిణాఫ్రికాలో తమతమ మొదటి స్పెల్స్‌లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్న వారిలో రవీంద్ర జడేజా మొదటి స్థానంలో నిలుస్తాడు. 2013 దర్బన్ టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో అతను 138 పరుగులకు ఆరు వికెట్లు పడగొట్టాడు. జడేజా స్పిన్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమైన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫాస్ట్ బౌలర్లకు అనుకూలించే దక్షిణాఫ్రికా పిచ్‌లపై ఒక స్పిన్నర్ అద్భుత ప్రతిభ కనబరచడం అప్పట్లో సంచలనం సృష్టించింది. కాగా, 2006లో శ్రీశాంత్ (జొహానె్నస్‌బర్గ్ టెస్టు) 40 పరుగులకు ఐదు, 1996లో వెంకటేశ్ ప్రసాద్ (దర్బన్ టెస్టు) 60 పరుగులకు ఐదు చొప్పున వికెట్లు కూల్చారు. దక్షిణాఫ్రికాలో మొదటిసారి ఒక టెస్టు ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసిన భువనేశ్వర్ కుమార్ ఈ మ్యాచ్‌లో 87 పరుగులకు నాలుగు వికెట్లు సాధించాడు.

విదేశాల్లో టీమిండియా ఒక టెస్టు మొదటి రోజునే ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేయడం ఇది పదోసారి. 1932లో ఇంగ్లాండ్‌ను లార్డ్స్ మైదానంలో 259 పరుగులకు కట్టడి చేసింది. 1976లో న్యూజిలాండ్‌ను ఆక్లాండ్ టెస్టులో 266 పరుగులకు, 1977లో ఆస్ట్రేలియాను బ్రిస్బేన్ టెస్టులో 166 పరుగులకు నియంత్రించింది. దక్షిణాఫ్రికాను మొదటిసారి 1996లో, దర్బన్ టెస్టులో 235 పరుగులకే ఆలౌట్ చేయగలిగింది. 1998లో జింబాబ్వేను హరారే టెస్టులో 221, అదే జటును 2001 బులవాయో టెస్టులో 173, బంగ్లాదేశ్‌ను 2004లో, ఢాకా టెస్టులో 184, న్యూజిలాండ్‌ను 2009 హామిల్టన్ టెస్టులో 279, శ్రీలంకను 2015 గాలే టెస్టులో 183 పరుగులకు భారత్ ఆలౌట్ చేసింది. ఇప్పుడు దక్షిణాఫ్రికాకు కేప్ టౌన్‌లో మొదటి రోజు ఆటలోనే, 286 పరుగుల వద్ద బ్రేక్ వేసింది.

కుప్పకూలిన దక్షిణాఫ్రికా

అదే దారిలో టీమిండియా! • కేప్ టౌన్‌లో తొలి టెస్టు

కేప్ టౌన్, జనవరి 5: భారత్‌తో శుక్రవారం ఆరంభమైన మొదటి టెస్టు మ్యాచ్ మొదటి రోజు ఆటలో బౌలర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. పరుగుల కోసం ఇరు జట్ల బ్యాట్స్‌మెన్ నానా తంటాలు పడ్డారు. ఈ క్రమంలోనే, తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 286 పరుగులకే కుప్పకూలింది. ఏబీ డివిలియర్స్ (65), కెప్టెన్ ఫఫ్ డు ప్లెసిస్ (62) అర్ధ శతకాలతో రాణించకపోతే, ఆ జట్టుకు ఈ మాత్రం స్కోరు కూడా సాధ్యమయ్యేది కాదు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా మొదటి ఓవర్ మూడో బంతికే వికెట్‌ను కోల్పోయింది. భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో స్వింగ్ అవుతూ దూసుకొచ్చిన బంతిని అర్థం చేరుకోలేక, వికెట్‌కీపర్ వృద్ధిమాన్ సాహాకు క్యాచ్ ఇచ్చి డీన్ ఎల్గార్ (0) ఔటయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు కేవలం ఒక పరుగు. మరో ఆరు పరుగుల అనంతరం అయిడెన్ మర్‌క్రామ్ వికెట్ కూడా కూలింది. 5 పరుగులు చేసిన అతనిని భువనేశ్వర్ ఎల్‌బీగా పెవిలియన్‌కు పంపాడు. సీనియర్ బ్యాట్స్‌మన్ హషీం ఆమ్లా (3) కూడా ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలవలేక, భువీ బౌలింగ్‌లోనే సహాకు చిక్కాడు. 12 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన దశలో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను చేపట్టిన డివిలియర్స్, డుప్లెసిస్ జాగ్రత్తగా ఆడుతూ స్కోరుబోర్డును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. నాలుగో వికెట్‌కు 114 పరుగులు జోడించిన తర్వాత డివిలియర్స్ వికెట్ కూలింది. 84 బంతులు ఎదుర్కొని, 11 ఫోర్లతో 65 పరుగులు చేసిన అతనిని ఈ మ్యాచ్‌తోనే టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేసిన జస్‌ప్రీత్ బుమ్రా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆతర్వాత డుప్లెసిస్ ఎక్కువ సేపు క్రీజ్‌లో కొనసాగలేకపోయాడు. 104 బంతుల్లో 62 పరుగులు చేసి, హార్దిక్ పాండ్య బౌలింగ్‌లో వికెట్‌కీపర్ సాహాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగిన అతని స్కోరులో 12 ఫోర్లు ఉన్నాయి. క్వింటన్ డికాక్ వేగంగా స్కోరును పెంచేందుకు ప్రయత్నించాడు. 40 బంతుల్లో, ఏడు ఫోర్లతో 43 పరుగులు చేసిన అతను భువీ బౌలింగ్‌లో సాహాకు దొరికాడు. వెర్నన్ ఫిలాండర్ (23), కేశవ్ మహారాజ్ (39), కాగిసో రబదా (26), మోర్న్ మోర్కెల్ (2) కూడా అనవసరంగా తొందరపడి వికెట్లు పారేసుకున్నారు. 73.1 ఓవర్లలో దక్షిణాఫ్రికా 286 పరుగుల వద్ద ఆలౌట్‌కాగా, డేల్ స్టెయిన్ అప్పటికి 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో భువీ 48 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. రవిచంద్రన్ అశ్విన్ 21 పరుగులకు రెండు వికెట్లు కూల్చాడు. మహమ్మద్ షమీ, జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్య తలా ఒక్కో వికెట్ పడగొట్టారు.

భారత ఇన్నింగ్స్ కూడా దక్షిణాఫ్రికా మాదిరిగానే తడబాటుతోనే మొదలైంది. పరుగులు రాబట్టడం చాలా కష్టంగా మారిన పిచ్‌పై, జట్టు స్కోరు 16 పరుగులవద్ద మురళీ విజయ్ వికెట్‌ను కోల్పోయింది. కేవలం ఒక పరుగు చేసిన అతను వెర్నన్ ఫిలాండ్ బౌలింగ్‌లో, డీన్ ఎల్గార్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో రెండు పరుగుల తర్వాత శిఖర్ ధావన్ కూడా పెవిలియన్ చేరాడు. డేల్ స్టెయిన్ బౌలింగ్‌లో అతను రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. జట్టును ఆదుకుంటాడనుకున్న విరాట్ కోహ్లీ కూడా వచ్చినంత వేగంగా వెనక్కు మళ్లాడు. ఐదు పరుగులు చేసిన అతను మోర్న్ మోర్కెల్ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ క్వింటన్ డికాక్‌కు చిక్కాడు. చటేశ్వర్ పుజారా (5), రోహిత్ శర్మ (0) మరో వికెట్ కూలకుండా జాగ్రత్త పడుతూ, మొదటి రోజు ఆటను ముగించారు. 11 ఓవర్లు ఆడిన భారత్ 28 పరుగులకే మూడు వికెట్లు కోల్పోవడంతో, రెండో రోజు ఆటలో ఏ విధంగా రాణిస్తుందనేది ఆసక్తి రేపుతున్నది. దక్షిణాఫ్రికా కంటే ఇంకా 258 పరుగులు వెనుకబడిన టీమిండియా చేతిలో ఏడు వికెట్లు ఉన్నాయి. పిచ్ తీరు రెండో రోజుకు మారితేనే భారత్‌కు ఊరట లభిస్తుంది.



దక్షిణాఫ్రికాతో శుక్రవారం కేప్ టౌన్‌లో మొదలైన మొదటి టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆటలో, మొదటి ఓవర్‌లోనే డీన్ ఎల్గార్‌ను ఔట్ చేసిన భారత ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌ను దారుణంగా దెబ్బతీసిన అతను భారత్‌కు ఆధిపత్యాన్ని అందించాడు. అయితే, దానిని బ్యాట్స్‌మెన్ ఏ విధంగా నిలబెట్టుకుంటారన్నది ప్రశ్న.

బౌలర్లకు అనుకూలం

కేప్ టౌన్ పిచ్ బ్యాట్స్‌మెన్‌కు స్వర్గధామమన్న వాదనకు భిన్నంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్టు, మొదటి రోజు ఆట కొనసాగింది. బౌలర్లది పైచేయికాగా, బ్యాట్స్‌మెన్ పరుగుల వేటలో విఫలమయ్యారు. మొత్తం మీద మొదటి రోజు ఆటలో 314 పరుగులు నమోదుకాగా, 13 వికెట్లు పడ్డాయి. దక్షిణాఫ్రికా 286 పరుగులకు ఆలౌట్‌కాగా, భారత్ 28 పరుగులు మాత్రమే చేసి, మూడు వికెట్లు కోల్పోయింది. రెండో రోజు ఆటలో పిచ్ ఏ రకంగా మారుతుందో చూడాలి. ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం, ఇది లో స్కోరింగ్ మ్యాచ్‌గా మారే ప్రమాదం ఉంది. అయితే, క్రమంగా పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించవచ్చని సమాచారం.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: డీన్ ఎల్గార్ సి వృద్ధిమాన్ సాహా బి భువనేశ్వర్ కుమార్ 0, అయిడెన్ మర్‌క్రామ్ ఎల్‌బి భువనేశ్వర్ కుమార్ 5, హషీం ఆమ్లా సి వృద్ధిమాన్ సాహా బి భువనేశ్వర్ కుమార్ 3, ఏబీ డివిలియర్స్ బి జస్‌ప్రీత్ బుమ్రా 65, ఫఫ్ డు ప్లెసిస్ సి వృద్ధిమాన్ సాహా బి హార్దిక్ పాండ్య 62, క్వింటన్ డికాక్ సి వృద్ధిమాన్ సాహా భువనేశ్వర్ కుమార్ 43, వెర్నర్ ఫిలాండర్ బి మహమ్మద్ షమీ 23, కేశవ్ మహజన్ రనౌట్ 35, కాగిసో రబదా సి వృద్ధిమాన్ సాహా బి అశ్విన్ 26, డేల్ స్టెయిన్ 16 నాటౌట్, మోర్న్ మోర్కెల్ ఎల్‌బి అశ్విన్ 2, ఎక్స్‌ట్రాలు 6, **మొత్తం (73.1 ఓవర్లలో ఆలౌట్) 286.**

వికెట్ల పతనం: 1-0, 2-7, 3-12, 4-126, 5-142, 6-202, 7-221, 8-258, 9-280, 10-286.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 19-4-87-4, మహమ్మద్ షమీ 16-6-47-1, జస్‌ప్రీత్ బుమ్రా 19-1-73-1, హార్దిక్ పాండ్య 12-1-53-1, అశ్విన్ 7.1-1-21-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: మురళీ విజయ్ సి డీన్ ఎల్గార్ బి వెర్నన్ ఫిలాండర్ 1, శిఖర్ ధావన్ సి అండ్ బి డేల్ స్టెయిన్ 16, చటేశ్వర్ పుజారా 5 నాటౌట్, విరాట్ కోహ్లీ సి క్వింటన్ డికాక్ బి మోర్న్ మోర్కెల్ 5, రోహిత్ శర్మ 0 నాటౌట్, ఎక్స్‌ట్రాలు 1, **మొత్తం (11 ఓవర్లలో 3 వికెట్లకు) 28.**

వికెట్ల పతనం: 1-16, 2-18, 3-27.

బౌలింగ్: వెర్నన్ ఫిలాండర్ 4-1-13-1, డేల్ స్టెయిన్ 4-1-13-1, మోర్న్ మోర్కెల్ 2-2-0-1, కాగిసో రబదా 1-0-1-0.



టెస్టుల్లో బుమ్రా అరంగేట్రం

కేప్ టౌన్: భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా దక్షిణాఫ్రికాతో ఇక్కడ మొదలైన మొదటి మ్యాచ్‌లో ఆడడం ద్వారా టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. మ్యాచ్ ఆరంభానికి ముందు అతను కెప్టెన్ కోహ్లీ నుంచి టెస్టు క్యాప్ తీసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 19 ఓవర్లు బౌల్ చేశాడు. వీటిలో ఒకటి మెయిడిన్ ఓవర్. 73 పరుగులిచ్చి, ఏబీ డివిలియర్స్ వికెట్‌ను సాధించాడు.

ఇంగ్లాండ్ 346 ఆలౌట్

ఆస్ట్రేలియాతో చివరి టెస్టు

టెస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా 6,000 పరుగుల మైలురాయిని చేరిన రెండో బ్యాట్స్‌మన్‌గా సర్ గారీ సోబర్స్ సరసన స్థానం సంపాదించిన ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవెన్ స్మిత్. సోబర్స్‌తో సమానంగా అతను కూడా 111 ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయిని చేరుకున్నాడు. కాగా, సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ 68 ఇన్నింగ్స్‌లోనే ఆరు వేల పరుగులను పూర్తి చేసి, ఈ జాబితాలో నంబర్ వన్‌గా ఉన్నాడు.



సిడ్నీ, జనవరి 5: ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి, ఐదో టెస్టు మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 346 పరుగులకు ఆలౌటైంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లకు 233 పరుగులు చేసిన ఇంగ్లాండ్ ఈ ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు, శుక్రవారం ఆటను కొనసాగించింది. మరో 113 పరుగులు జోడించి, మిగతా ఐదు వికెట్లను చేజార్చుకుంది. కెప్టెన్ జో రూట్ మొదటి రోజు ఆటలో 83 పరుగులతో రాణించగా, రెండో రోజున దావీద్ మిలాన్ (62) అర్ధ శతకాన్ని నమోదు చేశాడు. మొయిన్ అలీ (30), టామ్ క్యూరెన్ (39), స్టువర్ట్ బ్రాడ్ (31) కొంత సేపు ఆసీస్ బౌలింగ్‌ను ఎదురునిలవడంతో, ఇంగ్లాండ్‌కు 300 పరుగుల మైలురాయిని అధిగమించడం సులభమైంది. పాట్ కమిన్స్ 80 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. మిచెల్ స్టార్క్ 80 పరుగులకు రెండు, జొష్ హాజెల్‌వుడ్ 65 పరుగులకు రెండు చొప్పున వికెట్లు కూల్చారు. 86 పరుగులు సమర్పించుకున్న నాథన్ లియాన్ ఒక వికెట్‌తో సంతృప్తి చెందాడు.

వార్నర్, ఖాజా హాఫ్ సెంచరీలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ నిరాశాజనకంగా ప్రారంభమైంది. జట్టు స్కోరు ఒక పరుగు వద్ద తొలి వికెట్‌ను ఆ జట్టు కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ (0) రూపంలో కోల్పోయింది. ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఉస్మాన్ ఖాజాతో కలిసి స్కోరుబోర్డును డేవిడ్ వార్నర్ ముందుకు దూకించాడు. 56 పరుగులు చేసిన తర్వాత అతను కూడా పెవిలియన్ చేరాడు. 86 పరుగుల వద్ద రెండో వికెట్ కూలగా, ఉస్మాన్ ఖాజా, కెప్టెన్ స్టీవెన్ స్మిత్ జట్టును ఆదుకున్నారు. ఈ ఇన్నింగ్స్‌లో వార్నర్‌తోపాటు ఉస్మాన్ ఖాజా కూడా హాఫ్ సెంచరీ చేశాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండు వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. అప్పటికి ఉస్మాన్ ఖాజా 204 బంతుల్లో 91, స్మిత్ 88 బంతుల్లో 44 చొప్పున పరుగులు చేసి క్రీజ్‌లో ఉన్నారు. జేమ్స్ ఆండర్సన్ 25, స్టువర్ట్ బ్రాడ్ 28 పరుగులిచ్చి, చెరొక వికెట్ పడగొట్టారు.


సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు 5 వికెట్లకు 233 పరుగులు): 112.3 ఓవర్లలో 346 ఆలౌట్ (జో రూట్ 83, దావీద్ మిలాన్ 62, మొయిన్ అలీ 30, టామ్ క్యూరెన్ 39, స్టువర్ట్ బ్రాడ్ 31, పాట్ కమిన్స్ 4/80, మిచెల్ స్టార్క్ 2/80, జొష్ హాజెల్‌వుడ్ 2/65, నాథన్ లియాన్ 1/86).

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 67 ఓవర్లలో 2 వికెట్లకు 193 (డేవిడ్ వార్నర్ 56, ఉస్మాన్ ఖాజా 91 నాటౌట్, స్టీవెన్ స్మిత్ 44 నాటౌట్, జేమ్స్ ఆండర్సన్ 1/25, స్టువర్ట్ బ్రాడ్ 1/28).

జన్మభూమి మా ఊరు 2018

5వ విడత, 2-11 జనవరి.



మౌలిక సదుపాయాలు

అత్యుత్తమ గ్రామాల్లో దేశంలోనే అగ్రగామి ఆంధ్రప్రదేశ్

ప్రతి పల్లెకు పక్కా రోడ్డు, కనీస సౌకర్యాలు కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి. ఈ దిశగా చేపట్టిన కార్యక్రమాలు :

- అంత్యోదయ మిషన్ కింద దేశ వ్యాప్తంగా ఎంపికైన 83 అత్యుత్తమ గ్రామాల్లో 33 మన గ్రామాలే.
- 2014 నుంచి 2017 వరకు MGNREGS నిధుల ద్వారా రూ.16,878 కోట్లను సద్వినియోగం చేసుకున్నాం.
- 7,047 అంగన్‌వాడీలకు సొంత భవనాల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటికి 3,655 భవనాలు పూర్తి చేసాం.
- 2,449 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టి, ఇప్పటికే 1,628 పూర్తి చేసాం.

ప్రతి పల్లెను ప్రగతి పథంలో నడిపిద్దాం!
జై జన్మభూమి జై ఆంధ్రప్రదేశ్!

జారీచేసినవారు: కమిషనర్, సమాచార - పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

స్వతంత్రంగా.. సాధికార దిశగా..!


భూమిక

ఆంధ్రభూమి

శనివారం 6, జనవరి 2018

ఆలంబన కాదు.. అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి

'ప్రతి పురుషుడి విజయం వెనుక మహిళ ఉంటుంది' అనేది నానుడి. కానీ నేడు ప్రతి మహిళ అధికారం వెనుక పురుషుడి పెత్తనం ప్రస్ఫుటిస్తోంది. మహిళా సాధికారత పురుషుడికి వరంగా మారింది. 'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి, స్వతంత్రంగా ఎదగాలి, నిర్ణయాత్మకంగా తయారుకావాలి'.. అంటూనే మహిళల రాజ్యాంగబద్ధ పదవులను అడ్డం పెట్టుకుని పురుషులే క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మహిళల నిర్వహణ సామర్థ్యం మరుగున పడుతోంది. సాధికారత కోసం మహిళలే ఉద్యమించాలి. ఇందుకు పార్టీలు అడ్డుగోడలు కాకూడదు. మొన్న తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సు, అంతకుముందు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జరిగిన మహిళా సాధికార సదస్సుల్లో ఒక్క మహిళకీ ప్రాధాన్యమివ్వకుండా పురుషాధిక్యాన్ని చాటుకున్నారు. 'ఆమె ఉద్యమిస్తే.. మేమెందుకు ఊతమివ్వాలి?' అనే భావనను స్త్రీలు కూడా విడనాడాలి. ఐక్యంగా ఉంటేనే సాధికారత సాధ్యం.



చదువు ఉంటే ఆత్మవిశ్వాసం మెండుగా లభిస్తుంది. విజ్ఞానం వికసిస్తుంది. శక్తి సామర్థ్యాలు వెలుగులోకి వస్తాయి. స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి విద్య దోహదపడుతుంది. విద్యావంతులు కావడానికీ భారతీయ మహిళలు ఎన్నో ఆటంకాలను ఎదుర్కొన్నారు. మొదట్లో చాకలి పద్దు చదువు చాలని అనుకునేవారు. ఏడో తరగతి, తరువాత పదో తరగతితో ఫుల్‌స్టాప్ పెట్టేవారు. ఆ మెట్లన్నీ దాటుకుని నేడు మహిళలు ఉన్నత విద్య చదవి డాక్టరేట్లు కూడా పొందుతున్నారు. చదువుకున్న మహిళలు ఉద్యోగావకాశాల్లోనూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. 'ది యాక్ట్ ఆఫ్ 1935 ఇండియా' ఏకంగా కొన్ని సర్వీసులకి అనర్హులుగా మహిళలపై నిషేధం విధించింది. ఇండియన్ సివిల్ సర్వీస్, మెడికల్ సర్వీస్, పోలీస్ సర్వీస్, ఆడిట్ అండ్ అకౌంట్, రైల్వే అండ్ ఏవియేషన్ రంగాల్లో మహిళలకు తలుపులు మూసేసింది. అలాంటిది నేడు ఈ శాఖలన్నింటిలోనూ మహిళలు ప్రవేశించి తమదైన పనితీరుతో ఉన్నతాధికారులుగా రాణిస్తున్నారు. తమ సత్తా చాటుతున్నారు. సవాళ్లను ఎదురొడ్డి గెలుస్తున్నారు. రైళ్ళ, విమానాలు నడుపుతున్నారు. మొన్నటికి మొన్న హైదరాబాద్‌లో తొలి మెట్రో రైలు నడిపింది కూడా మహిళే. వ్యోమగామి కల్పనా చావ్లాకి జాతి మొత్తం శాల్యూట్ చేయాల్సిందే.

ఇక ప్రైవేట్ రంగంలోనూ మహిళలు ఉద్యోగులుగా అనేక సవాళ్లను అధిగమించారు. నైపుణ్యం అవసరం లేని ప్రాంతాల్లోనే మహిళలు కనిపించేవారు. అదీ మగవారితో సమానంగా వేతనం ఉండేదికాదు. అక్కడా తమ హక్కులను పోరాటాల ద్వారానే సాధించుకున్నారు. ఇప్పుడు మహిళలు నైపుణ్యం అవసరమైన రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. న్యాయ, వైద్య, పరిపాలనా రంగాల్లోనూ తమ సేవలను విస్తరించారు. మిలిటరీ అధికారులుగానూ దేశానికి సేవలందిస్తున్నారు. రాజకీయాల్లో 40 శాతం కంటే ఎక్కువ సీట్లలో మహిళలు గెలిచారు. చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ, ఉన్నత పదవులు సాధిస్తున్నా.. గ్రామాల్లో సామాజికంగా కొన్నిచోట్ల మహిళలు వెనుకబడే ఉంటున్నారు. దేశంలో 18 ఏళ్లలోపు వివాహమైన మహిళలు 26.8 శాతం ఉన్నారు. బాల్య వివాహాల్లో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో ఉంది. 40 శాతం బాలికలకి మైనార్టీ తీరకముందే పెళ్లి చేసేస్తున్నారు. బీహార్ 39 శాతం, జార్ఖండ్ 38 శాతంతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయి. 7.6 శాతంతో పంజాబ్, కేరళ చివరి స్థానంలో ఉన్నాయి. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, పోరాటాలు చేసి వరకట్న నిషేధ చట్టం సాధించినా అది కాగితాలకే పరిమితమయింది. మహిళా సమస్యల్ని పరిష్కరించడానికి ప్రపంచ వ్యాప్తంగా కృషి జరుగుతూనే ఉంది. మన దేశంలో జాతీయ మహిళా కమిషన్ ఏర్పడింది. భారత రాజ్యాంగం స్త్రీలకి సమాన హక్కులు ఇవ్వడమేగాక, వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి హక్కులు కల్పించింది.

సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ హక్కుల్ని ఉపయోగించుకోవచ్చు. 2012ని ప్రపంచ మహిళా సాధికార దినోత్సవంగా ప్రకటించగా మన ప్రభుత్వం 2001నే మహిళా సాధికార సంవత్సరంగా ప్రకటించింది. ఆ సంవత్సరం మహిళల అభ్యున్నతికి ప్రతినెలా ఒక ప్రత్యేక కార్యక్రమంగా మహిళా హక్కులు, మహిళల ఆర్థిక సాధికారత, సాంఘిక సాధికారత వంటి కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రాల్లోనూ మహిళా చైతన్య శిబిరాలు నిర్వహించారు. 2001 నవంబర్‌లోనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సహకారంతో ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ మీట్ ఢిల్లీలో జరిగింది.

మొన్నటికి మొన్న నవంబర్‌లో హైదరాబాద్‌లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల గ్లోబల్ శిఖరాగ్ర సదస్సు జరిగింది. 150 దేశాల నుండి 1500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 'కొందరు' మహిళల శక్తిసామర్థ్యాలు ప్రస్ఫుటించిన 'అద్వితీయ' వేదిక అది. ఈ సదస్సులో 52 శాతం మంది మహిళలు పాల్గొనడం గర్వకారణమని అమెరికా అధ్యక్షుడి కూతురు, శ్వేతసౌధం సలహాదారు ఇవాంక ట్రంప్ ప్రశంసించారు. కొత్త ఆవిష్కరణలతో ముందుకి వస్తున్న యువతకి ఆమె స్వాగతం పలుకుతూ.. 'కాంక్ష వీడకుండా నిరంతరం పనిచేయాల'ని సూచించారు. ఇక్కడ మహిళలు వ్యాపార రంగంలోకి రాలేకపోవడానికి కారణాలు అనేకం ఉన్నాయని గమనించాలి. డిగ్రీ, వృత్తి శిక్షణలో సరైన మార్గదర్శక గురువు లేకపోడం, తల్లిదండ్రుల నుంచి సహకారం లేక, సామాజిక అవరోధాలు, రిస్క్ తీసుకోలేకపోడం, పెట్టుబడి సమకూర్చుకోలేక... ఇలా అనేక కారణాలున్నాయి.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వాలు కూడా ఎన్నో అవకాశాలు, మరెన్నో ప్రోత్సాహకాలు కల్పిస్తున్నాయి. అయితే వాటిని అందుకోగలిగిన ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకోవాలి. తమ కౌశల్యాన్ని, నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవాలి. విజయాలు సాధించాలి. ఎన్ని సభలు, సమావేశాలు, సదస్సులు జరిగినా అవి అప్పటికే అంతోఇంతో ఎదుగుదల ఉండి వృద్ధి సాధించినవారికే ఉపయోగపడుతున్నాయి. అంతేకాదు, ఇంత చెప్పుకున్నా, ఇన్ని చట్టాలున్నా లింగ వివక్షలో 144 దేశాల్లో మన దేశం 136వ స్థానంలో ఉంది. స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు కల్పించడంలో 139వ స్థానంలో ఉంది. రాజకీయ సాధికారతలో మాత్రం 15వ స్థానంలో ఉంది. ఇక్కడే అసలు 'రాజకీయం' దాగుంది. రిజర్వేషన్లు.. గట్రా అంటూ భార్యల పేరున భర్తలు పెత్తనం చలాయించటం పరిపాటిగా మారింది. అదే.. ఆ వ్యవస్థ మారాలి. సాధికారత సాధ్యమవాలంటే మహిళలు ఆలంబన కోసం ఎదురుచూడకూడదు. వారిలో మార్పు రావాలి. అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి. స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగలగాలి.

- జోస్యుల మల్లేశ్వరి

సత్తాచాటారు..

మహిళా సాధికారత కోసం ఉద్యమించాలి. అది అవసరం కూడా. సాధికారత సాధ్యమవకముందే కుల, మత, వర్గ, రాజకీయ, తదితర తారతమ్యాలతో ఐక్యతను మరచి కొట్లాడటం అవివేకం. సాధికారత సాధించాక దాన్ని మహిళలంతా ఆస్వాదించడం వివేకం. వ్యవహార దక్షత, నిర్వహణా సామర్థ్యపు సత్తా కలిగిన ఇందిరా గాంధీ, మమతా బెనర్జీ, జయలలిత వంటి నేతలను ఆదర్శంగా తీసుకోవాలి. మహిళా సాధికారతతోనే మహిళకు అన్నిరకాల భద్రతలూ సాధ్యమవుతాయి. వేద కాలంలోనే మహిళలకు ప్రముఖ స్థానం ఉండేదట. ఆరోజుల్లోనే గార్గి, కాత్యాయని లాంటి విద్యావేత్తలు ఉన్నారు. రానురాను పురుషాధికార వ్యవస్థ మహిళను వంటింటి కుందేలుగా మార్చింది. వారి చదువులను చాకలి పద్దులకు పరిమితం చేసింది. బాల్య వివాహాలు, సతీ సహగమనం లాంటి మూఢాచారాలతో మహిళలకు అణచివేసింది. దీంతో మహిళల జీవితం పురుషుల చేతిలో ఆటబొమ్మగా మారింది. ఆ కాలంలోనే రాణి దుర్గావతి, రజియా సుల్తానా, జిజియాబాయి, మీరాబాయి వంటివారు ఎన్నో సమస్యల్ని సమర్థంగా ఎదుర్కొన్నారు. సమస్యల్ని శక్తిమంతంగా, ధైర్యంగా, సొంతంగా పరిష్కరించుకున్నారు. సాంఘిక దురాచారాలకి బ్రిటీష్ కాలంలోనే రాజా రామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, జ్యోతీరావు పూలే వంటి సంఘ సంస్కర్తలు ఎదురొడ్డారు. మహిళల వెనుకబాటుతనానికి అవిద్యే కారణమంటూ.. తరువాతి కాలంలో ఆడపిల్లల్ని బాగా చదివించడం మొదలుపెట్టారు.





ఉద్యమ ధీర

సాధికారత కోసం జనాభాలో సగభాగానికి పైగా ఉన్న మహిళలు పురుషులను దేబిరించాల్సిన పని ఉండదు. ఉద్యమం ఉత్తుంగ తరంగంగా ఎగసినప్పుడు సాధికారత దానికదే సాధ్యమవుతుంది. ఇందుకు చక్కటి నిదర్శనమే నెల్లూరు జిల్లాకు చెందిన దూబగుంట రోశమ్మ. ఆమె నిరక్షరాస్యురాలే. అయినా ఆ నిరక్షరాస్యతనూ 70 ఏళ్ల వయసున్న ఆమె ఆత్మవిశ్వాసం జయించింది. ఫలితంగా నాడు ఆమె ఉద్యమంతో మద్యపాన నిషేధం సాధ్యమైంది. ప్రభుత్వానికి మద్యపానంపై ఎక్కువ ఆదాయం లభిస్తున్నా రోశమ్మ పోరాట పటిమకు పాలకులు తలొగ్గక తప్పలేదు. ఇక్కడ మనం గమనించాల్సింది ఆమెలోని పోరాట పటిమ.



కిర్రాక్ స్టెప్పులు..

• నవతరానికి ఉత్సాహాన్ని పెంచే 'వెస్టన్ డ్యాన్స్'

• 'మై డాన్స్ వరల్డ్ ఇనిస్టిట్యూట్'లో పేదలకు ఉచిత శిక్షణ • డాన్స్ మాస్టర్ మైఖేల్ రాజ్ ప్రోత్సాహం



నవనాగరిక ప్రపంచంలో ప్రతినిత్యం ఎన్నో మార్పులు కనిపిస్తుంటే దానికి తగినట్లు యువత కేవలం విద్యలోనే కాకుండా కాలానుగుణంగా పాశ్చాత్య నృత్యంలోను, సినీ సంగీత అడుగుల సవ్వడిలోను ఉత్సాహాన్ని చూపిస్తూ తమదైన శైలిలో వేదికలపై నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. చదువుకోవడానికి పరిస్థితులు అనుకూలించని కొంతమంది తమకు తెలిసిన నృత్యంలోనే సినిమాలలో అవకాశాలు సంపాదించుకుంటున్నారు. ఇటువంటి వారిలో మైఖేల్‌రాజ్ ఒకరు. సినీ నృత్య దర్శకులు లారెన్స్, రాజు సుందరం, అమ్మ రాజశేఖర్ వంటి ప్రముఖుల నేతృత్వంలో అనేక చిత్రాల్లో డాన్సర్‌గా పనిచేసి ఆరు చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించి పరిస్థితులు అనుకూలించక తన జన్మస్థలమైన తిరుపతిలో 'మై డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్' స్థాపించి యువతీ యువకులకు వెస్టన్ డాన్స్ నేర్పిస్తున్నారు.

నృత్యం ఒక వ్యాయామం

పిచ్చి డాన్సులు అంటూ వ్యాఖ్యానించే పాత తరానికి నేటి తరం తమదైన శైలిలో నచ్చచెప్పి వెస్టన్ డాన్స్ స్టెప్పులు నేర్చుకోవడమే కాకుండా వేదికలపై ప్రదర్శనలు కూడా ఇస్తున్నారు. ఇది కేవలం నృత్యం మాత్రమే కాదు ఒక వ్యాయామం కూడా అని అంటున్నారు మైఖేల్ రాజ్. సుమారు నలభై ఐదు సంవత్సరాల క్రితం 'దమ్మరే ... దమ్' అంటూ వచ్చిన హిప్పీ ఫ్యాషన్‌లతో వచ్చిన హిందీ పాట యువతను నిద్రను లేపితే, ఇటీవల నాగార్జున - శ్రీదేవిల కాంబినేషన్‌లో వచ్చిన 'గోవిందా గోవిందా' సినీ గీతం ఉత్సాహాన్ని పెంచింది. శాస్త్రీయ సంగీత నృత్యాలను ఆదరించి ప్రోత్సహించినట్లే ఈ నృత్యాన్ని కూడా చూసి ప్రేక్షకులు ఎంతో ఉత్సాహంగా ఆనందిస్తున్నారని, అందుకే తాము కూడా వెరైటీ కోసం ఈ నృత్యం నేర్చుకుంటున్నామని విద్యార్థులు అంటున్నారు.

సినీ పరిశ్రమ ఆదరణ కొత్త ఉత్సాహాన్నిచ్చింది

ఒక డాన్సర్‌గా తాను స్టెప్పులు వేస్తున్నపుడు చూసిన హీరో బాలకృష్ణ, రాజాలతోపాటు ఈనాటి హీరోన్‌లు కూడా డాన్స్ చాలా బాగుంది అంటూ మెచ్చుకోవడం సినీ పరిశ్రమలో కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది అని మైఖేల్‌రాజ్ అన్నారు. ఆ ఉత్సాహాన్ని ఊపిరిగా చేసుకొని ఈనాటి నవ శతాబ్దంలో యువతకు నృత్య శిక్షణలో హారతి పడుతున్నానని అన్నారు. తనకు తగిలిన ఎదురుదెబ్బలు నృత్యంలో జీవితం నేర్పిన పాఠాలుగా జీర్ణం చేసుకొని విద్యార్థులకు కొత్త పోకడలు తెలిసే విధంగా శిక్షణ ఇస్తూ వారి చదువులకు ఆటంకం కలుగకుండా ప్రోత్సహిస్తున్నానని, ప్రస్తుతం పేరెంట్స్ కూడా వెస్టెన్ డాన్స్‌పై కొంత అవగాహన కలిగించుకొని ప్రోత్సహిస్తున్నారని మైఖేల్ రాజ్ అన్నారు.

ప్రేక్షకుల కేరింతలే ప్రోత్సాహం

ప్రస్తుతం చాలా కాలేజీలలోను, విద్యా సంస్థల వార్షికోత్సవాలలోను యువత ఈ నృత్యాలు చేస్తుంటే ప్రేక్షకులు ఈలలు వేస్తూ గెంతులు వెయ్యడం అల్లరి కాదని, కళాకారులను ప్రోత్సహించటమేనని రాజ్ అన్నారు. తిరుపతిలోని గాంధీపురంలో జన్మించిన నాగరాజు సినిమా పాట వినిపించినపుడుల్లా స్టెప్పులు వేస్తూంటే కొంతమంది హేళన చేసినా అది వారి ఆశీర్వాదంగా భావించి హైదరాబాద్‌కు వచ్చి 'ఒసే రాములమ్మ' చిత్రంలో అవకాశం సంపాదించి దాసరి నారాయణరావు ఆశీర్వాదంతో, ప్రేక్షకుల మన్ననలతో ఎదిగానని అన్నారు. ఆనాటి నాగరాజు ఈనాటి మైఖేల్ రాజ్‌గా ఎదగడానికి ఎంతోమంది సినీ ప్రముఖులు, స్నేహితులు, ప్రోత్సహించిన పెద్దలు, ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు అని అన్నారు. పరిశ్రమలో నిలబడటానికి అదృష్టంతోపాటు కాసులు కూడా కొంత వుండాలి. ఆ కాసులు లేక ఎన్నో కష్టాలు పడ్డాను. అందుకే తాను స్థాపించిన 'మై డాన్స్ వరల్డ్ ఇనిస్టిట్యూట్'లో పేదలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. ఈనవశకంలో యువతీ యువకులకు తనదైన శైలిలో శిక్షణ ఇస్తూ వేదికలపై అవకాశాలను కల్పిస్తూ ధైర్యాన్ని కలిగిస్తున్న మైకేల్‌రాజ్ భవిష్యత్తులో 'చికుబుకు చికుబుక రైలే' అంటూ నృత్యం చేసిన ప్రభుదేవా స్థాయికి ఎదగాలని విద్యార్థులు మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

-మురళీధర్

పటాన్ని దాటిన చిత్రం

ఎన్నాళ్లనుంచో చూస్తూనే ఉన్నాం కదా..
మెడలో వేలాడే దునిమిన దుర్జనుల పుర్రెల పూమాలని
చేతిలో హెచ్చరికల ప్రతీకలా పట్టుకున్న ఒక త్రిశూలాన్ని
ఎన్నాళ్లనుంచో చూస్తూనే ఉన్నాం కదా..
ధైర్యం ఎగరేసిన పతాకలా పైకొచ్చిన ఎర్రెర్రని నాలుకని
కోపం రగిలించిన దీపాల్లా మండే చూపుల నేత్రాలని
ఎన్నాళ్లనుంచో చూస్తూనే ఉన్నాం కదా
జూలు పట్టుకు సింహాన్ని నడిపించే బొమ్మల ఆత్మస్థైర్యాన్ని
కాళ్ళక్రింద నొక్కిపెట్టిన రాక్షస దేహాన్ని
ఎన్నాళ్లనుంచో చూస్తూనే ఉన్నాం కదా
బలికి తెగిపడ్డ అమాయక మేకపిల్ల తలకాయలని
నిప్పుల గుండాలమీంచి నడిచి ఆవిరులుకక్కిన అరికాళ్ళని
ఎన్నాళ్లనుంచో చూస్తూనే ఉన్నాం కదా
పూనకంతో ఊగిపోతూ ఉద్రేకపడిన ఉద్వేగాలని
బతుకు జాతరలో కదిలిన బాధల కన్నీటి కడవలని
'సురవర పోషిణి దుర్ధర దుర్షిణి దుర్ముఖ మర్ధిని హర్షరతే..'
లోకాన్ని శ్లోకాలతో నింపినా శోకం తీరనే లేదు కదా తల్లీ
పటాన్ని దాటి చిత్రం పైకొచ్చినపుడల్లా.. చూసాం..
ఆదిశక్తి అవతారమొకటి కదం తొక్కే దృశ్యాన్ని..
ఝాన్సీ రాణిలా... రుద్రమదేవిలా.. మగువ మాంచాలలా
మరోసారి పటాన్ని దాటిందట.. చిత్రం ఇపుడిపుడే..
కలకత్తా వీధుల్లో కీచకుడి పీచమణిచిన మోనా
పూనాలో మృగాడిని జుట్టుపట్టుకు ఉతికేసిన దుర్గ
ఆర్టీసీ బస్సులో ఆకతాయికి దేహశుద్ధి చేసిన దేవిక
వీడియోలలో ఇంటింటా చేస్తున్నారిప్పుడు వేడుక.
పంచాలి ఈ దృశ్యాలని పదిమందికీ ప్రసాదంలా
ఊరేగించాలి ఈ ఉద్యమ ఉత్సాహాన్ని ఊరూరా..
చైతన్యం నిండిన హృదయాలతో కదం తొక్కుతూ
పటాలు దాటుకుని కదిలొస్తారిక.. బాలికలే కాళికలై!



-గరిమెళ్ళ నాగేశ్వరరావు
9951573059

ముత్యాల ముగ్గు

చుండూరు తన్మయి,
ఎ.ఎస్.రావు నగర్,
హైదరాబాద్.





19 చుక్కలు
19 వరుసలు

కట్టమూరి
వ్యూహశ్రీ,
బ్రాహ్మణపల్లి,
పిడుగురాళ్లు,
గుంటూరు జిల్లా

ముగ్గులు పంపాల్సిన చిరునామా

ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్-500003.

★కలర్ స్కానింగ్ చేసిన ముగ్గులను JPG ఫార్మాట్‌లో bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.

భూమికకు రచనలు పంపండి

రచనలను ఈ మెయిల్‌లో స్కాన్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో bhoomika@andhrabhoomi.netకు మెయిల్ చేయవచ్చు.
లేదా ఈకింది చిరునామాకు పంపగలరు.

మా చిరునామా : ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక
36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్- 03



వ్యూహం

12 అలపర్తి రామకృష్ణ

ఆ ఆపరేషన్ డాక్టర్ మౌర్య చేసింది కాదు.. అతనికి ఎలాట్ చేసిన బ్లాకులో ఆ ఆపరేషన్ జరగలేదు.

పోస్టుమార్టమ్ రిపోర్టులో నా ఫైండింగ్స్ అన్నీ రికార్డు చేశాను. ఆ రిపోర్టు పోలీసులు సెషన్స్ కోర్టు ముందు ఉంచారు. కేసు విచారణలో వుంది. ఆ కేసు వివరాలు డాక్టర్ మౌర్యగారింటికి వెళ్లినపుడు ఆయనకు చెప్పాను.. ఆయన తల పట్టుకుని బాధపడ్డాడు..

''ఆ హాస్పిటల్లో ఏదో గూడుపుఠాణి జరుగుతోంది.. మరికొన్ని వివరాలు సేకరించి జిల్లాలోని ఎస్పీని పర్సనల్‌గా కలిసి వివరంగా చెబుతాను''' అన్నాడు డాక్టర్ మౌర్య నాతో..

రెండు రోజుల తరువాత ఆయన మరణవార్తవిన్నాను.

తనకు తెలిసిన విషయాలు ఉన్నది ఉన్నట్లు చెప్పేశాడు డాక్టర్ రమేష్.

''ఆ హాస్పిటల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని, అమాయకమైన పేద ప్రజల శరీర అవయవాలు తొలగించి పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించిన ధనికులకు అమర్చుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. వీరి వెనుక పెద్ద మాఫియా గ్యాంగ్ వున్నదని, పలు రాష్ట్రాల్లో ఇలాగే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వాటిని ఛేదించే పనిని రాష్ట్ర డిజిపి నాకు అప్పగించారు. ఆ పనిలోనే వున్నాం మేము.. మా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వచ్చి మీ దగ్గర స్టేట్‌మెంట్ తీసుకుంటాడు.. పోలీసు డిపార్టుమెంటుకు సహకరించండి, ప్లీజ్'' అన్నాడు స్కంద.

''తప్పకుండా సర్'' అన్నాడు రమేష్.

❖❖❖

చెల్లెల్ని తీసుకుని జూబిలీ హిల్స్ వెళ్లింది లోహిత.

అదే మొదటిసారి స్కంద వాళ్ళింటికి వెళ్ళడం. ఇల్లు ఎక్కడో తెలుసుకోవడానికి కొంచెం ఇబ్బంది పడింది. నాలుగైదు రోడ్లు తిరగాల్సి వచ్చింది.


''బావగారికి ఫోన్ చెయ్యి.. వచ్చి మనల్ని తీసుకువెళ్తారు'' అంది సావేరి అక్కతో.

''మా ఇద్దరికీ పెళ్లికాకముందే బావగారని పిలవడం ఏమిటి? వాళ్లింట్లో కూడా హద్దులు మరిచి మాట్లాడకు.. పోకిరీ పిల్ల అనుకుంటారు నిన్ను'' అంది లోసిత.

''ముందు ఫోన్ చెయ్యి తల్లీ.. నడవలేక చస్తున్నా'''

''వేషాలు వెయ్యకు.. నాలుగు అడుగులు వేసేసరికే అలసిపోయావా? మనం ఫోన్ చెయ్యకుండా వెళ్లి స్కందను సర్‌ప్రైజ్ చెయ్యాలి.. అపుడే కిక్ వుంటుంది'' నుదుట పట్టిన చెమటను ఖర్చీఫ్‌తో తుడుచుకుంటూ.

''నీ ప్రియుడి దగ్గరకు వెళ్తున్నావ్ కాబట్టి నీకు కిక్ వుంటుంది.. అనవసరంగా నన్ను లాక్కొచ్చావ్''.



''కొంటె మాటలు మాట్లాడకు కోణంగి''.

''ఈ ఇల్లే అయి వుంటుంది అక్కా! పచ్చ రంగు పెయింట్ చేసిన బిల్డింగ్.. బిల్డింగ్ చుట్టూ దట్టంగా చెట్లు. ఇంటిముందు గార్డెన్ వుంటుందని చెప్పాడు గదా! ఇదే ఇల్లు'' అంటూ గేటు తీసుకుని లోపలికి వెళ్లబోయింది.

ప్రహరీ గోడ ప్రక్కన నిలబడి సిగరెట్ కాల్చుకుంటున్న సెక్యూరిటీ పోలీసు గార్డు గేటు కదిలిన శబ్దం విని సిగిరెట్ అవతల పడేసి పరుగెత్తుకొచ్చాడు.

''పర్మిషన్ లేకుండా లోపలికి వెళ్లిపోవడమేనా? ఎవరు కావాలి మీకు'' గేటు నెట్టుకుని లోపలికి వెళ్ళబోతున్నది ఆడపిల్లలవ్వడంతో ఊపిరి పీల్చుకున్నాడు సెక్యూరిటీ గార్డు.

''స్కందగారి ఫ్రెండ్‌ను.. నా పేరు డాక్టర్ లోహిత.. స్కందగారిని, వాళ్ళమ్మగారు మానసను కలవడానికి వచ్చాం'' అంది లోహిత.

''ఒక్క నిమిషం ఆగండి.. ఫోన్ చేసి కనుక్కుంటాను''- ఇంట్లో వున్నవారితో అతను ఫోన్‌లో మాట్లాడేడు.

''అక్కా.. స్కందగారు ప్రెస్ రిపోర్టరో.. జర్నలిస్టో అన్నావ్.. ఇంటిముందు పోలీసు సెక్యూరిటీ వుందేమిటి?'' అడిగింది సావేరి.

''నాకూ అర్థం కావడంలేదు. స్కంద గారి ఇల్లు కాదేమో'' గొణుక్కుంది లోహిత.

''అక్కడ చూడు.. బోర్డుమీద పి.స్కంద, ఐ.పి.యస్ అని వుంటే!

''ఐపిఎస్ ఆఫీసర్‌నని ఎప్పుడూ అనలేదే నాతో''.

''ఆయన ఏం ఉద్యోగం చేస్తున్నాడో తెలుసుకోకుండా ప్రేమించేసావన్నమాట! అందుకే ప్రేమ గుడ్డిది'' అంటారు.

''లోపలికి వెళ్ళండమ్మా! అమ్మగారు పూజ గదిలో వున్నారు.. హాల్లోకి వెళ్లి కూర్చోండి'' అన్నాడు సెక్యూరిటీ గార్డు.

పచ్చటి లాన్.. పోర్టికోకు వెళ్ళేదాకి అటు, ఇటు రకరకాల పూల మొక్కలు కనువిందుగా కన్పించాయి.. ఎర్ర గులాబీ పువ్వు తెంపుకుని జడలో పెట్టుకుంది.

''వాళ్ళు చూస్తే ఏమనుకుంటారు? లేకి మనుష్యులనుకోరూ!'' అంది లోహిత గులాబీ పువ్వు తెంచడం ఇష్టంలేక.

''మీ ఆస్తి తరిగిపోదులే తల్లీ!''

''నీతో మాట్లాడటం కష్టమే!'' మరో గులాబీ పువ్వు మీద చెయ్యి వెయ్యబోతున్న చెల్లెలు చేతిని పట్టుకుని లోపలకు లాక్కెళ్లినంత పనిచేసింది లోహిత.

హాల్లో కిటికీ అద్దాలను తుడుస్తున్న యువకుడు కన్పించాడు.

''హాల్లో వున్న సోఫాలో కూర్చుంటూ, బాబూ.. రెండు గ్లాసుల మంచినీళ్ళు పట్టుకురా! ఎండలో పడి వచ్చాం!'' అంది సావేరి ఆ యువకుడి వైపు తిరిగి.

వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుని రెండు గ్లాసుల మంచినీళ్ళు తెచ్చి వాళ్లిద్దరికీ ఇచ్చాడతను.

గ్రేప్ జ్యూస్ గ్లాసులు ట్రేలో పెట్టుకొని తెచ్చి ఇద్దరికీ ఇచ్చాడు.

హాల్లో గోడలకు వేలాడదీసిన వాటర్‌కలర్ పెయింటింగ్స్ కేసి చూస్తూ వుండిపోయింది లోహిత.

కాలుమీద కాలు వేసుకుని దర్జాగా ఓ చెయ్యి సోఫామీద వేసి మరో చేత్తో హాయిగా వొలకిస్తూ కూర్చున్న సావేరి మీదే ఆ యువకుడి దృష్టి నిలిచింది.

''కాసేపు టీవీ ఆన్ చెయ్యి అబ్బాయి.. అమ్మగారు పూజ గదినుంచి వచ్చేవరకు కాలక్షేపంగా వుంటుంది'' అది సావేరి తనను తదేకంగా చూస్తున్న ఆ కుర్రవాడి వైపు చూస్తూ అంది.

- ఇంకా ఉంది

నేర్చుకుందాం

శ్రీ నరసింహ శతకములోని పద్యము



సీ. మందుఁడ నని నన్ను నిందఁ జేసిన నేమి?
నా దీనతను జూచి నవ్వలేమి
దూర భావము లేక తూలనాడిన నేమి
ప్రీతి సేయక వంకఁ బెట్టనేమి?
కక్కసంబులు పల్కి వెక్కిరించిన నేమి?
తీవ్రకోపము చేతఁ దిట్టనేమి?
హెచ్చుమాటల చేత నెమ్మెలాడిన నేమి?
చేరి దాపడ గేలి సేయనేమి?

తే. కల్పవృక్షము వలె నీవు గల్గనింకఁ
ప్రజల లక్ష్యంబు నాకేల పద్మనాభ!
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం: పద్మనాభా! నరసింహస్వామీ! మందబుద్ధిననీ, దీనుణ్ణనీ నిందించినా, కసిరికొట్టినా, తప్పులెంచినా, తూలనాడినా, తిట్టినా, అనరాని మాటలన్నా , గేలి సేసినా, ఈ జనులు నన్నేమన్నా కోరిన కోర్కెల్ని పండించే కల్పతరువు లాంటి నీవుండగా వీళ్లని లెక్కచేయవలసిన పనేముంది? ఇతరములన్నీ అశాశ్వతిమైనవే. గుణదోషభూయిష్టమైనవి. కనుక తనతోటి వారు తన్ను గేలిచేసినా భగవంతుడు తన్ను చూస్తే తన ఉనికిని గుర్తిస్తే చాలు కదా. వేరెవరో తిట్టారని బాధపడడమెందుకు. ఎదుట వానికి తెలియక పోయినా ఎదలోనికి వానికి గుట్టుమట్టులన్నీ తెలుస్తాయికనుక ఆ పరమాత్మ మెప్పు పొందితే చాలు.

మాటాట : 1530

నిర్వహణ: సుధామ

1		2	■	3		■
■	■	4	5		■	6
7	■	■		■	■	
8			■	9		
	■	■	10	■	■	
	■	11		12	■	■
■	13		■	14		

ఆధారాలు

అడ్డం:
1. కిల్లీ
3. తుషారం
4. గార్దభం
8. పెరుగు చిలికి చేసేది
9. అద్దె
11. ఉరుము వెంట నంటి వచ్చేది
13. దుకాణము
14. ఇంగ్లీషు మద్యం

నిలువు:
2. స్త్రీలలలో ఉడుపు
3. గుంపు
5. చిన్నడ బ్బా
6. అమెరికె, కెనడా లమధ్య పెద్ద జలపాతం
7. పేరు
10. రథము
11. సోపానం
12. వ్యాఘ్రము

మాటాట - 1529 సమాధానం

1 ర	థ	2 చ	క్రం	■	■	3 వ
జ	■	న్న	■	4 వి	నో	దం
5 తం	పు	■	6 శా	స్త	■	తి
■	■	7 జీ	■	రి	■	■
8 బా	■	9 గు	డి	■	10 దొం	11 గ
12 హు	షా	రు	■	13 సీ	■	ళ
వు	■	■	14 మ	రా	ళ	ము

మంచిమాట

పరమపదం



తిరుప్పావై 22వ పాశురం 'అంగణ్ మా'

అంగణ్ మా ఇలత్తు అరశర్ అభిమాన
బంగమాయ్ వందు నిన్ పళ్ళిక్కట్టిక్కీళే
శంగం ఇరుప్పార్ పోల్ వందు తలైప్పెయ్ దోమ్
కింగిణి వాయ్‌చ్చెయ్‌ద తామరై పూప్పోలే
శెన్‌గణ్ శిఱిచ్చిఱిదే ఎమ్మేల్ విళియావో
తింగళుం అదిత్తియనుమ్ ఎళుందార్ పోల్
అన్‌గణ్ ఇరండుం గొండు ఎంగళ్ మేల్ నోక్కుదియేల్
ఎంగళ్ మేల్ శాపం ఇళందు ఎలోరెమ్బావాయ్

భావం:ఈనాటి పాశురంలో పరమాత్మ నేత్రాల కారుణ్యతను స్తుతిస్తున్నారు గోపికలు. విశాలమైన భూమండలాన్ని పాలించిన రాజులు తమ అభిమానాన్ని, గర్వమును విడిచి నీవు శయమించిన సింహాసనము క్రింద గుంపులు గుంపులుగా వచ్చి చేరినట్లుగా మేము కూడా అహంకారాన్ని పూర్తిగా విడిచి గుంపులుగా వచ్చి నీ పాదాల చెంత చేరాము. తామరలు విచ్చుకొన్నట్లుగా నీ సుందర నయనాలు విచ్చి మెల్లగా సూర్యచంద్రులు ఒకేసారి వెలిగినట్లు మాకు జ్ఞాన ప్రకాశాన్ని, అమృతమయమైన ఆనందపు వెన్నెలను మా మీద ప్రసరింపజేయి.. అప్పుడు మా పాప కర్మలన్నీ నశించిపోతాయి. మా కోరిక ఇది మాత్రమే కృష్ణా! అని గోపికలు శ్రీకృష్ణపరమాత్మను వేడుకుంటున్నారు.

సుందరమైన మిక్కిలి గొప్పదైన, విశాలమైన భూమండలాన్ని పాలించిన రాజులు, ఇపుడు తమ అహంకార మమకారాలనే గుణాలను విడిచి వచ్చి నీ యొక్క పర్యంకమునకు, శయనించిన పరమ పదమనే మంచం క్రింద గుంపులు గుంపులుగా ముక్తి కోరి వచ్చి ఉన్న విధముగా, మేము కూడా నిన్ను కోరి నీ పాదాల చెంత చేరాము. చిరుగంట ముఖమువలె సగము విచ్చిన తామర పూలవలె వాత్సల్యము చేత రాగభావాలను నింపుకున్న నీ సుందరమైన రెండు కళ్ళను ఒకేసారి తెరిచి నీ కరుణా కటాక్షాలు మా మీద ప్రసరింపజేయాలి. చంద్రుడు (ముందుగా ఆచార్య కటాక్షము) సూర్యుడును ఒకేసారి ఉదయించినట్లుగా, ఆచార్యానుగ్రహంవల్ల పరమాత్మ చైతన్యం కలిగి జ్ఞానప్రకాశం కల్గినట్లుగా మావైపు నీవు చూస్తే చాలు మా మీది శాపము విడిపోవును, కర్మబంధాలన్నీ తొలగిపోతాయని వేడుకుంటున్నారు గోపికలు ఈ పాశురంలో.

ఆండాళ్ తిరువడిగళే శరణమ్

- డాక్టర్. పరవస్తు. కమల

యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 4

నాకిప్పుడు నీ సహాయం అవసరమైంది. నాకు ధన సహాయం చేయుము'' అని అన్నాడు.

ఆ మాటలు విన్న ద్రుపదుడు రాజ్యమదంతో, గతాన్ని మరిచి, మిత్రుడని కూడా గౌరవించక ''నేను రాజును. నీవు ఒక బీద బ్రాహ్మణుడవు. నాకూ, నీకూ స్నేహం ఎక్కడ? సరితూగే రాజులతో మాత్రమే స్నేహము ఉంటుంది. నీవు వెంటనే ఇక్కడనుండి మరలిపొమ్ము'' అని అవమానపరచి వెడలగొట్టిస్తాడు.


ధనాన్నిగానీ, పాడి ఆవులను గానీ ఇవ్వకపోయినా కనీసం ఒక బ్రాహ్మణుడననీ, బాల్యమిత్రుడననీ గౌరవించక అవమానపరిచిన ద్రుపదుడిమీద ప్రతీకారం తీసుకోవాలని తలంచాడు ద్రోణుడు. ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. భార్యాబిడ్డలతో కలిసి కురు రాజ్య రాజధాని అయిన హస్తినాపురానికి పయనమైనాడు. హస్తినకు చేరాడు.

3

ఒకనాడు ద్రోణుడు బయలువెడలి వస్తూ దారి ప్రక్కన పిల్లలు ఆడుకొనటం చూస్తాడు. వారు ఒక బావి వద్ద గుమికూడి బావిలోనికి త్రొంగిజూస్తూ ఆందోళనలో కనిపించారు. ద్రోణుడు అక్కడికి వచ్చి వారితో ''మీరు రాజకుమారులుగా కనిపిస్తున్నారు. ఇక్కడ ఎందుకు గుమికూడారు? ఏం జరిగింది?'' అని అడిగాడు.

అందుకు కురు పాండవ రాకుమారులు ''మహర్షీ! మేము ఆటలాడుకుంటున్న చెండు ఈ బావిలో పడింది. చాలా లోతుగా వున్నది. దానిని ఎలా పైకి తీయాలో తెలియక ఆలోచిస్తున్నాం'' అని వినయంతో అన్నారు.

''పిల్లలారా! మీ అస్త్ర గురువెవ్వరు? మీరు విలువిద్యలు నేర్చుకొనలేదా? ఆ బంతిని పైకి ఎలా తియ్యాలో తెలియదా?'' అని అన్నాడు ద్రోణుడు.



''మహర్షీ! మా గురువర్యులు 'కృపాచార్యులవారు'. తమరు దయతో ఈ చెండును పైకి ఎలా రాబట్టాలో సెలవియ్యండి'' అని ప్రార్థించారు రాకుమారులు.

అంత ద్రోణుడు రాకుమారుల వద్దనున్న ఒక ధనుస్సును కొన్ని బాణాలను తీసికొని బాణాలను ఒక దాని వెనుక మరొకదాన్ని సంధిస్తూ బావిలోనికి వదలి చెండును గ్రుచ్చి దానిని పైకి తీశాడు. అది చూచిన రాకుమారులు ఆశ్చర్యచకితులైనారు. వారు వెంటనే పోయి జరిగిన విషయాన్ని భీష్మ పితామహునికి విన్నవిస్తారు.

భీష్మ పితామహుడు ద్రోణుని సగౌరవంగా ఆహ్వానించాడు. ద్రోణుడు పితామహునికి తనకు తాను పరిచయం చేసుకున్నాడు. జరిగిన వృత్తాంతాన్ని వివరించి చెప్పగా మతిమంతుడైన భీష్ముడు మహర్షితో...

''మహర్షీ! వీరందరూ నా మనమలు. వీరందరికి గురుత్వం వహించి గొప్పగా విలువిద్యలన్నింటినీ నేర్పండి. విలువిద్యలో, నీతిలో, పరాక్రమంలో పరశురాముడు కూడా మిమ్ములను పోలడని విన్నాను'' అని అన్నాడు.

''పితామహా! మీరు కోరినట్లే నా శక్తిమేర వీరిని పరాక్రమవంతులుగా చేస్తాను'' అని ద్రోణుడు వారిని శిష్యులుగా స్వీకరించాడు.

4

అది ద్రోణాచార్యుడి ఆశ్రమ ప్రాంతం. తపోవనాన్ని తలపించేటట్లుగా ఉన్నది. సువిశాల ప్రాంగణంలో పర్ణశాలతో శోభాయమానంగా ప్రకాశిస్తున్నది.

పొడవుగా పెరిగిన చెట్లతో, గుబురుగా పూలు పూచిన అశోక వృక్షాలతో, సుపొన్నలు, పొన్నలతో, మొగలి పొదలతో, చక్కగా కాయలు కాచి పండిన అందమైన తియ్యమాడి చెట్లతో, గుంపులుగా యున్న రంభాతరువులతో (అరటిచెట్లు) చూడముచ్చటగావిస్తున్నది.

కోయిల గుంపుల మధురస్వరాలు, శుకపికధ్వనుల, పక్షుల కిలకిలారావాలు వీనులకు విందు చేస్తున్నాయి.

ఆశ్రమానికి అల్లంత దూరంలో పెద్ద పెద్ద సువిశాల మైదానాలు కనిపిస్తున్నాయి. ఒక చోట మల్ల యుద్ధ యోధులు శిక్షణ పొందేందుకు నిర్మింపబడిన ఇసుకతో నింపిన ప్రాంగణములు.

రథికులు తమ తమ రథలపై శిక్షణ పొందటానికై ఏర్పాటుచేసిన మైదానాలు కొన్నిచోట్ల కనిపిస్తున్నాయి.

అశ్వములపై శిక్షణ పొందటానికై యున్న సువిశాల ప్రాంఘాలు అల్లంత దూరంలో వున్నాయి. గదాయుద్ధం కొరకు నిర్మింపబడిన ఒక పాటి ప్రాంగణాలు కనిపిస్తున్నాయి.

ఈటె, కత్తి, తోమరం, కుంతం, శక్తి మొదలైన ఆయుధలను ఉపయోగించే విధానాలలో శిక్షణ పొందేందుకు ప్రాంగణాలు ఉన్నాయ.

రాకుమారులు ముఖ్యంగా నేర్చుకొనే ధనుర్విద్యకు అవసరమైన సువిశాల ప్రదేవాలు ఒకచోట కానవస్తున్నాయి.

ద్రోణాచార్డు కౌరవ పాండవుల శస్త్రాస్త్ర విద్య గురువుగా భీష్మ పితామహునిచే నియమింపబడ్డాడు.

- ఇంకా ఉంది

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
నూతన కార్యాలు ప్రారంభిస్తారు. అల్పభోజనంవల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురిచేస్తుంది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైరమేర్పడకుండా మెలగాలి. ఆటంకాలెదురవుతాయి. ప్రతి విషయంలో స్వల్ప అభివృద్ధి ఉంటుంది.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
పిల్లలపట్ల ఎక్కువ పట్టుదలతో నుండుట అంత మంచిది కాదు. చెడు పనులకు దూరంగా నుండుట మంచిది. మనోద్వేగానికి గురి అవుతారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఆకస్మిక ధనలాభంతో, ఋణబాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
సంతోషంగా కాలం గడుపుతారు. శుభవార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుందురు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచనలను కలిగివుంటారు. బంధు, మిత్రులు గౌరవిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ధనలాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రులతో కలుస్తారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
ఋణప్రయత్నాలు తొందరగా ఫలిస్తాయి. స్థానచలన సూచనలుంటాయి. శుభకార్యాల మూలకంగా ధనవ్యయం అధికమవుతుంది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఆకస్మిక ధనలాభంతో ఋణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు.


● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ఆకస్మిక ధనలాభముంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ముఖ్యమైన వ్యక్తుల్ని కలుస్తారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
మిక్కిలి ధైర్య సాహసాలు కలిగియుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శతృబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
విదేశయాన ప్రయత్నాలకు అనుకూలంగా వుంటుంది. ప్రయాణాలెక్కువచేస్తారు. మెలకువగా నుండుట అవసరం. స్థానచలన మేర్పడే అవకాశాలుంటాయి. ఋణలాభం పొందుతారు.

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

పరిచయం



కులం నీడలో
అభివృద్ధి రాజకీయాలు
-ప్రొ.ఎస్.సింహాద్రి
వెల: రూ.60/-
ప్రతులకు: ప్రజాశక్తి, నవచేతన బుక్‌హౌస్, విశాలాంధ్ర, నవోదయ బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో

కులం నీడలో అభివృద్ధి రాజకీయాలు అనే ఈ పుస్తకంలో 2008లో తొలిసారి ముద్రించారు. చిన్నచిన్న మార్పులతో రెండో ఎడిషన్‌ను ప్రస్తుతం ముద్రిస్తున్నారు. ముఖ్యంగా అభివృద్ధి వాస్తవాలను పరిశీలిస్తుంటే రాష్ట్రం ఎంత లోతుగా కులతత్వ పాలనతో కూరుకుపోయిందో అర్థమవుతుంది. అధికార నియామకాలు రాజ్యాంగ వ్యవస్థనే అపహాస్యం చేసే విధంగా ఉన్నాయి. రాజకీయ పార్టీలు కేవలం రెండు, మూడు కులాల కబ్జాలయిపోయాయి. ప్రజాస్వామిక స్పృహతో ఉండాల్సిన వేదికలు కుల సంఘాలుగా మారిపోయాయి. దీనితో ప్రభుత్వరంగం అత్యధిక కుల చైతన్యంలో భాగంగా ఉంటూ స్వంత అస్థిత్వాన్ని కోల్పోతున్నది. కులమే ప్రజాస్వామ్యాన్ని, అభివృద్ధిని శాసిస్తున్నాయి. ప్రజాస్వామిక స్పృహతో కుల సంఘాలు సామాజిక న్యాయానికై, సామాజిక మార్పుకై నిరంతరం పోరాడుతున్నాయి. కాని వాటిని గుర్తించక వారి ఆకాంక్షలను గౌరవించక పాలక కుల ప్రయోజనాలకు అనుగుణంగా మలిచే ప్రయత్నం జరుగుతుంది. ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు, మహిళలు ప్రజా సంఘాలలో భాగంగా పాలకవర్గ కుట్రలను పసికట్టడం జరుగుతుంది. సామాజిక ఆకాంక్షల కేంద్రంగా ఉద్యమిస్తేనే లక్ష్యం దగ్గరవుతుంది. అభివృద్ధి, రాజకీయం, నియామకాలు, రిజర్వేషన్లు.. ఇత్యాది అంశాలను ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ★

కొత్త పుస్తకం



పిల్లల మనస్తత్వ శాస్త్రం
-డా.ధూర్జటి సుబ్బారావు
వెల: 110
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విశాలాంధ్ర బుక్‌హౌస్




కవితాచక్ర
నివేదన
వెల: రూ.150
ప్రతులకు: జ్యోతి వలబోజు
80963 10140



యశస్వి నానీలు
తిమ్మిరి బిళ్లలు
-డా.రమణ యశస్వి
వెల: రూ.80
ప్రతులకు: రచయిత
యశస్వి హాస్పిటల్స్
కాకాని రోడ్,
గుంటూరు -522 001
98480 78807



దీపారాధన
-డి.తేజోవతి
వెల: రూ.95
ప్రతులకు: ప్రిస్మ్ బుక్స్ ప్రై.లి.
1-1-728/ఎ, స్ట్రీట్ నెం.10
గాంధీనగర్
హైదరాబాద్-500 080
04027612928



వ్యాస పారిజాతం
-డా.అడువాల సుజాత
వెల: రూ.180
ప్రతులకు: రచయిత్రి
ఇం.నెం.2-10-1040
నియర్ గాయత్రి ఎస్ఆర్ఆర్ ఎన్‌క్లేవ్
జ్యోతినగర్
కరీంనగర్ - 505 001
9989558678

సత్యాలోకనం... సముదాత్త ధ్యాస

మనిషి నిరంతరం ఆలోచనాపరుడు. ఆలోచన అనేది కనులకు కనిపించని ఒక విచిత్రమైన మెకానిజం. ఆ మెకానిజంలో యంత్రమంటూ కనిపించదు కానీ యంత్రంలాగా పని చేస్తుంది ఒక వ్యవస్థ. మరి మెదడు అనేది ఒకటుంది కదా! జీవ విజ్ఞాన శాస్త్రం ప్రకారం అది ఒక అద్భుత యంత్రమే కదా! అనే ప్రశ్న ఒకటి ఉదయిస్తుంది. అయితే మెదడు అనేది ఇంద్రియాలు, నాడులు మొదలైన వాటిని సక్రమంగా నియంత్రిస్తుంది. కానీ ఆలోచన అనేది మెదడు అనే యంత్రం కంటే భిన్నమైనది. ఒక విధంగా ఉన్నతమైన, అధిక ప్రతిఫలదాయకమైన పనిని చేస్తుంది. ఆ ప్రతిఫలం ఏమిటి అంటే సత్యము, ధర్మము, వివేకము, ఆనందము, పరమాత్మ, సాత్వికత, నిశ్శబ్దత మొదలైన ఉదాత్త అంశాల గూర్చిన నిశ్చయాలను, సారాంశాలను మెదడుకు, అనుభవానికి, అనుభూతులకు ఇస్తుంది. ఇంత గొప్పదైన ఆలోచన అనే పనిలో తఱచుగా నిమగ్నుడైపోతూ జీవితానికి, అభ్యుదయానికి పనికొచ్చే ఎన్నో విషయాలను సూక్ష్మంలో మోక్షంలా అందించే ఒక మంచి ప్రయత్నం మునిమడుగుల రాజారావు గారి 'సత్యమంటే ఏమిటి?' అనే తాత్త్విక వ్యాసాల సంపుటిలో చూస్తాం.

ఇందులో 'సత్యమంటే ఏమిటి?' 'తెలివి జ్ఞాపకం కాదు' 'ఎరుక తక్కువ ఆలోచన ఎక్కువ' 'సంకల్ప బలముంటే చాలు' 'కర్మయోగ' 'ఆయుష్షును పెంచే నిద్ర' 'అంతిమ గమ్యం' లాంటి ఆలోచనాత్మక శీర్షికలతో ముప్పై చిన్నచిన్న వ్యాసాలున్నాయి.

'అంతిమ గమ్యం' అనే వ్యాసంలో తాత్త్విక అభ్యున్నతి - లేక- ఆధ్యాత్మిక భావనా పురోగతిపై అభిరుచి కలగటానికి, ధ్యాస పెంపొందటానికి రచయిత చెప్పిన ఉపమానాత్మక కథ బాగుంది.

'ఎన్నో టన్నుల బరువున్న ఒక పెద్ద బెల్లం ముద్ద కొన్ని వేల ముక్కలుగా విడగొట్టబడింది. అప్పుడు అందులోని ఏ ఒక్క ముక్కైనా దాని తీయని గుణాన్ని పోగొట్టుకుంటుందా? లేదే! అయితే కాలగమనంలో దానిపై దుమ్ము పేరుకుపోయి దాని ఉపరితలం మీద ఉన్న రుచి కప్పబడుతుంది. కానీ దాని లోపలి భాగమంతా వ్యాపించి ఉన్న రుచి అలాగే ఉంటుంది. విశ్వాత్మ నుండి విడిపోయిన జీవాత్మ 'మనసు' అనే (ధూళి)పొరను కప్పుకొని ఉంది. దాన్ని తీసేస్తే అగుపడేది, అనుభవంలోకి వచ్చేది అది లోనిది' - ఇలా ఎంతో ఉదాత్తతా సముచితంగా ఉంది రాజారావుగారు అందించిన ఉపమానం. 'న భూతో న భవిష్యతి' అనే దానికి మామూలుగా చెప్పుకునే అర్థం 'నిన్న లేదు. రేపు ఉండదు' అని. కానీ దానికి 'నిన్న లేకపోతే రేపు లేదు' అని మరో అర్థం కూడా ఉంది. నిన్నటి అనుభవంతో రేపటి భవిష్యత్తుకు రూపం ఇవ్వాలంటే 'ఇవాళ' పని చేయటం తప్పనిసరి. పనిని ధ్యానంలా భావించి



సత్యమంటే ఏమిటి?
(తాత్త్విక వ్యాసాల సంపుటి)
-మునిమడుగుల రాజారావు
పుటలు: 112
వెల: రూ.100
ప్రతులకు: ఎం.విజయలక్ష్మి
ఇం.నెం.7-2-83/49/2బి 4,
ఇందిరానగర్,
నిర్మల్-504 106

శ్రద్ధాభక్తులతో ప్రార్థనలా చేస్తే దొరికేది ఆనందమే' అని 'కర్మయోగ' వ్యాసంలో అంటారు రచయిత. ఒక ప్రసిద్ధ లోకోక్తికి రెండో అర్థం చెప్పటం, దాని ద్వారా 'పని' (కర్మ) అనే దాని ప్రాధాన్య, ఆవశ్యకతలను చెప్పటం రచయిత వివరణాత్మక నిపుణత (expounding expertise) కు ఒక ఉదాహరణ.

మహోదాత్త ఫలాలు నిశ్శబ్దంలోంచే వస్తాయి అని సోపపత్తికంగా తెలియజేశారు రచయిత 'నిశ్శబ్దం - సృజనాత్మకత - ఆనందం' అనే వ్యాసంలో. నిశ్శబ్దం అంటే ఆలోచనల వలలో చిక్కకుండా ఉండటం అని గంభీరార్థకంగా చెప్పారు. ఒప్పుకోవాల్సిందే.

'తెలివి జ్ఞాపకం కాదు' వ్యాసంలో జ్ఞానము - తెలివిలకు ఉన్న నిర్వచన సహితమైన వింగడింపు ఇంపుగా ఉంది.

14, 15వ పుటలలో ఎరుక (జ్ఞానం) - ఆలోచనల యొక్క భేద, ప్రాముఖ్య, ఆవశ్యకతల గురించి మంచి ఎఱిగింపు ఉంది. 'సంకల్ప బలం ఉంటే చాలు' అనే వ్యాసంలోని చక్కని సందేశాత్మక కథ ఉత్కంఠభరితంగా సాగిపోయింది. 'ఆయుష్షును పెంచే నిద్ర' వ్యాసం చదివితే నిద్ర యొక్క ప్రబల ఆవశ్యకత ఏమిటో అర్థమయి, అనవసర ఆలోచనలు మాని, ఆరోగ్యదాయకమైన, కలలు, కలతలు లేని నిద్రా సౌఖ్య, సత్ఫలితాలను అనుభవిస్తాం అని తెలుస్తుంది.

సంఘంలో ఐడెంటిటీ కోసం ఆరాటపడే ప్రతి మనిషి 'ఇతరులను తనకి సమాంతరంగా రాకుండా, లేదా తనకన్నా పైకి వెళ్లకుండా, ఒక ప్రణాళిక అల్లుకొని దానిని అమలుపరుస్తుంటాడు' అనటం (57వ పేజీలో ఒక సందర్భోచిత వాక్యం)లో ప్రణాళిక అనే పద ప్రయోగం లలిత హాస్య స్ఫోరకం.

ఉన్న ముప్పై వ్యాసాలలో మూడవ వంతు వ్యాసాలకు వాక్యరూపంలోని శీర్షికలకన్న క్లుప్తత (బ్రివిటీ)తో కూడి ఒకటి రెండు పదాల శీర్షికలయితే ముచ్చటగా ఉండేది; భావ గాంభీర్యంతో అలరారేవి.

14వ పుటలో 'మానసిక గోడలు' పదం వికృతంగా ఉంది. మనః కుడ్యాలు, తలపుల గోడలు, మానసికపు గోడలు, ఆటంకాలు - ఇలా మరేదైనా సాధు రూపమో భావసామ్య రూపమో ఎన్నుకుంటే బాగుండేది.

మొత్తం మీద ఇది ఉత్తమ జిజ్ఞాసకు ఊపిరులూదే పుస్తకం. ముందు మాటలో డా.అప్పాల చక్రధారి గారన్నట్టు 'సత్యానికి, మనిషికి అనుసంధాన కర్తగా రాజారావు యొక్క కృషి' ఇది.

-శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

చిన్నపాటి తెలంగాణ దర్శిని

సుసంపన్నమైన తెలంగాణ సాంస్కృతిక చరిత్ర, పూర్వ చారిత్రకుల అవగాహనా రాహిత్యం వల్లనూ, ఇతర ప్రాంతీయుల నిరాదరణ, నిర్లక్ష్యాల కారణంగానూ తెర మరుగున పడిపోయింది. చిరకాల పోరాటం ఫలితంగా సిద్ధించిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఇంతకాలమూ అజ్ఞాతంగా ఉండిన తెలంగాణ సాహిత్య సాంస్కృతిక విశేషాలు క్రమక్రమంగా తెరపైకి రావడం హర్షదాయకం. సాహిత్య చరిత్రకు సంబంధించిన కొన్ని గ్రంథాలు వెలువడినా, సాంస్కృతిక వైభవాన్ని చాటే రచనలు అరుదుగానే ఉన్నాయి. ఆ కొరతను తీర్చడానికి డా.ఎస్వీరామారావు ఈ పుస్తకాన్ని వెలువరించారు.



తెలంగాణ సాంస్కృతిక వైభవం
-ఆచార్య ఎస్వీ రామారావు
వెల: రూ.170
పేజీలు: 252
ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్

ఇందులోని మొదటి భాగం 'పూర్వ యుగంలో తెలంగాణ సంస్కృతి'. ఇందులోని మొదటి అధ్యాయంలో శాతవాహనుల నుండి అసఫ్ జాహిల వరకు తెలంగాణను పరిపాలించిన రాజవంశాల చరిత్రను తెలియజేశారు. వనపర్తి, ఆత్మకూరు, గద్వాల, జటప్రోలు, గోపాల్‌పేట - అలంపురం, లోకాయపల్లి, దోమకొండ, పాపన్నపేట, పాల్వంచ, మునగాల సంస్థానాలు చేసిన సాంస్కృతిక సేవను రెండవ అధ్యాయంలో వివరించారు. ప్రాచీన తెలంగాణ కవుల కావ్యాల్లో ప్రతిబింబితమైన సామాజిక - చారిత్రక అంశాల సంక్షిప్త వివరణ మూడవ అధ్యాయంలో కనిపిస్తుంది. పండితారాధ్య చరిత్ర, క్రీడాభిరామం మొదలైన తెలుగు కావ్యాల్లో చోటు చేసుకున్న పర్యాటక స్థలాల విశేషాల గురించి నాల్గవ అధ్యాయంలో తెలియజేశారు.

ఇక రెండవ భాగం 'ఆధునిక యుగంలో సాంస్కృతిక పునరుజ్జీవనం'. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో మహోజ్వలమైన చారిత్రాత్మక ఘట్టం 'గ్రంథాలయోద్యమం'. ప్రజలకు వాక్, పత్రికా స్వాతంత్ర్యాలు, రాజకీయ హక్కులు లేని గడ్డుకాలంలో వారి సామాజిక చైతన్యాన్ని ఉద్దీప్తం చేయటంలో గ్రంథాలయోద్యమం ప్రముఖ పాత్ర వహించిందని తెలియజేశారు. లభిస్తున్న సాక్ష్యాల ఆధారంగా 1901-56 మధ్య నెలకొన్న గ్రంథమాలల విశిష్టసేవను వివరించారు. గ్రంథాలయాలు, గ్రంథమాలల స్థాపన సాహిత్య సంస్థల ఏర్పాటుకు ప్రేరణగా నిలిచాయి. ఆంధ్రోద్యమంలో భాగంగా తెలంగాణలోని అన్ని జిల్లాలలో కొనసాగిన ఆంధ్ర మహాసభలు సాహితీ సంస్థల ఆవిర్భావానికి దోహదంగా నిలిచాయి. తెలంగాణలో ఉన్న రకరకాల చారిత్రక నిర్మాణాల విశేషాలను, తెలంగాణ కోటలు - గడీల గురించి వివరించారు. నీటి వసతులు, వైద్యశాలలు, రవాణా సౌకర్యాలు, పౌర రక్షణ మొదలయిన సౌకర్యాల వివరాలను సంక్షిప్తంగా వివరించారు. చివరగా తెలంగాణలో ప్రత్యేకంగా జరుపుకునే హిందూ ముస్లింల పండుగల గురించి తెలియజేయడం విశేషం. మొత్తానికి ఈ పుస్తకాన్ని మినీ 'తెలంగాణ దర్శిని'లా రూపొందించారు. బృహత్తర ప్రణాళిక కోసం రూపుకట్టుకున్న స్థూల రూపం ఇది. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులే కాకుండా తెలంగాణ గురించి, సమాచారం తెలుసుకో దలచిన వారికి ఈ పుస్తకం రెడీ రెఫరెన్స్‌లా పనికివస్తుంది.

-కె.పి.అశోక్‌కుమార్



శ్రీ సాయి లీలా తరంగిణి
-డా.వై.రామకృష్ణారావు
వెల: రూ.100
ప్రతులకు: పి.వి.జి.కె.మూర్తి
11-13-153, రోడ్ నెం.4
అలకాపురి కాలనీ
ఎస్.ఆర్.కె.పురం పోస్ట్
హైదరాబాద్-500 035
9704655707

నేనూ మా అమ్మా
(నవలిక)
-పంతుల జోగారావు
వెల: రూ.50
ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



వగచడం దేనికి సంకేతం?

రష్యా విప్లవం వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత అక్టోబర్ - నవంబర్ మాసాల్లో ఎంతో సాహిత్యం, సమాచారం మరోసారి వెలుగు చూసింది. అందులో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు అమెరికా పత్రికా రచయిత ఆల్బర్ట్ రీస్ విలియమ్స్ గతంలో రాసిన 'రష్యాలో విప్లవం' పుస్తకం పునర్ముద్రణ ఒకటి. పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు ఈ పునర్ముద్రణకు 19 పేజీల పీఠిక రాశారు. 'పార్టీని ఆయుధంగా చేసుకుని స్వప్రయోజనాలకు వాడుకునే నయవంచక గుంటనక్కలూ ఉండవచ్చు. అంత మాత్రంచేత మానవాళికి విముక్తి ప్రదాతగా నిలవాలనే సంకల్పంతో ప్రారంభమైన మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీని, కమ్యూనిస్టు కార్యకర్తలను నిందించి, నిరుత్సాహపడి ప్రయోజనం లేదు. జరిగిన పొరపాట్లకు కారణాలను అన్వేషించి, ఆ పొరపాట్లు చేయకుండా ముందుకు పోవడమే అక్టోబర్ విప్లవానికి నిజమైన నీరాజనం...' (పేజీ 19) అన్నారు.

ఇలాంటి అభిప్రాయాల్ని, ఆలోచనల్ని, అవగాహనను, ఆత్మశోధనను ప్రపంచవ్యాప్తంగా అనేక మంది వ్యక్తం చేసి ఉంటారు. అందులో కోటేశ్వరరావు ఒకరు.

మానవాళికి విముక్తి ప్రదాతగా మార్క్సిజం - లెనినిజాన్ని 21వ శతాబ్దంలో పేర్కొనడం పూర్తిగా అన్యాయం, అసంబద్ధం, అజ్ఞానం. 'విముక్తి' అనే పద ప్రయోగం పూర్తిగా అనాలోచితం. నిరంతర ప్రవాహం మాదిరి కొనసాగే మానవ జీవితానికి, మానవాళికి ఆ పదం అన్వయమవదు. కాని చాలా మంది మార్క్స్ అభిమానులు అలవోకగా, నిరభ్యంతరంగా ఆ పదాన్ని ప్రయోగిస్తారు. మానవాళి ఒకచోట నిలువ వున్న తటాకం లాంటిది కాదు. అది నిరంతరం చైతన్యంతో కదిలే ఝరి. మరి దాన్ని విముక్తి చేసే ప్రదాతగా మార్క్సిజం - లెనినిజాన్ని పేర్కొనడం అజ్ఞానమవుతుంది తప్ప మరొకటి ఎలా అవుతుంది? ఈ ప్రాథమిక వివేకం- వివేచన కోల్పోవడం కారణంగా విప్లవం పేర అనేకానేక అఘాయిత్యాలు జరిగాయి. అజ్ఞానమే జ్ఞానమనుకున్న ఉన్మత్త స్థితిలో కోట్లాది మంది ప్రజలను కడతేర్చారు. ఏదైతే మానవాళి విముక్తి ప్రదాత అంటున్నారో, ఆ సిద్ధాంత స్ఫూర్తితో, ప్రేరణతో కోట్లాది మంది ప్రజల ప్రాణాలు హరించి తిరిగి మళ్లీ, మళ్లీ ఆ సిద్ధాంతం మానవాళి విముక్తి ప్రదాత అనడం అన్యాయం, అసహజం, అరాచకం కాక ఏమవుతుంది? ఈ విషయమై వంద సంవత్సరాల అనంతరం కూడా జ్ఞానోదయం కలగకపోతే ఎలా?

రష్యాలో ఏడు దశాబ్దాల అనంతరం అక్కడి ప్రభుత్వం, వ్యవస్థ కుప్పకూలిపోవడాన్ని జీర్ణించుకోలేక వగచడం ఎక్కువగా కనిపిస్తోంది. విప్లవం విజయవంతమైనంత మాత్రాన అది ఆచంద్రతార్కారం కొనసాగాలని భావించడం భావ దారిద్ర్యం తప్ప మరొకటి కాదు. ఆ విప్లవ సారాంశంలో కాలానుగుణమైన ప్రయోజన లక్షణం, మానవాళికి ఉపకరించే మెరుగైన దారి, దర్శనం ఉంటే ఎవరైన ఎందుకు తిరస్కరిస్తారు?.. ఆ విప్లవ నాయకుడైన లెనిన్ విగ్రహాలను ఎందుకు ధ్వంసం చేస్తారు? అలా జరిగిందంటే తీవ్రమైన తప్పిదం జరిగిందనే కదా? ఈ పార్శ్వాన్ని విస్మరించి తాతల కాలంనాటి చైతన్య స్రవంతి, సైబీరియా మంచులా ఘనీభవించి ఉండాలని ఆశించడం పూర్తిగా అన్యాయం, అశాస్త్రీయం. శాస్త్రీయ సిద్ధాంతమని పదేపదే పేర్కొనే మార్క్సిజం జడ పదార్థంగా చూసేందుకే ఇష్టపడేవారే ఎక్కువగా వగచడం కనిపిస్తోంది.



రష్యాలో విప్లవం
-ఆల్బర్ట్ రీస్ విలియమ్స్
(అమెరికా పాత్రికేయుడు)
పేజీలు: 306
వెల: రూ.250
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ

ప్రపంచవ్యాప్తంగా రష్యా విప్లవంపై ఇటీవల వెలువడిన, వెలువడుతున్న రచనలు, అభిప్రాయాలు, ఆలోచనలు ఎక్కువగా ఇదే మూస ధోరణిలో వెలువడటం విషాదం.

ఆల్బర్ట్ రీస్ విలియమ్స్ పుస్తకం కొత్త కోణాన్ని ఏమీ చూపలేదు. చర్విత చరణంగా అవే విషయాల్ని ఆయన చెప్పారు. అమెరికా పత్రికా రచయిత చెప్పినంత మాత్రాన శంఖంలో పోసిన నీళ్లు తీర్థంగా మారవు కదా?

వేల సంవత్సరాల మానవ జాతి చరిత్రలో ఆయా దేశ కాల పరిస్థితుల్లో ఎందరో విప్లవకారులు పుట్టారు. వారివారి ప్రభావాన్ని చూపారు. కాలం కొత్త మలుపు తిరిగినప్పడల్లా కొత్త అన్వేషణ, ఆవిష్కరణలు జరగడం సహజం. ఇప్పడు అదే జరిగింది. జరుగుతోంది. ఇందులో వగచడానికి ఏముంది?

2017 సంవత్సరం అక్టోబర్ - నవంబర్ నాటి కాలమాన పరిస్థితులేమిటి? ఈ కాలపు జ్ఞాన సంచయమేమిటి అన్న ఆలోచన మార్క్స్, రష్యా విప్లవ అభిమానులు వేసుకున్న, వేసుకుంటున్న పాపాన పోవడంలేదు. గత మూడు వందల సంవత్సరాల కాలంలో జరగని అభివృద్ధి, సాంకేతిక పురోభివృద్ధి గత మూడు నాలుగు దశాబ్దాల్లో జరిగింది. ఆవిరి యంత్రాల కాలంనాటి రష్యా విప్లవం నాటి అభిప్రాయాలకు, ఆలోచనలకు నాల్గవ పారిశ్రామిక విప్లవం విస్తృతమవుతున్న 2017 సంవత్సరపు ఆలోచనలకు, అభిప్రాయాలకు, మానవ అభివృద్ధికి ఎంత తేడా ఉందో పోల్చుకోలేక, తేల్చుకోలేక కేవలం వగచడం వల్ల ఎవరైనా సాధించేది ఏమీ కనిపించదు.

వేల సంవత్సరాల మానవ జాతి చరిత్రలో ఆయా దేశ కాల పరిస్థితుల్లో ఎందరో విప్లవకారులు పుట్టారు. వారివారి ప్రభావాన్ని చూపారు. కాలం కొత్త మలుపు తిరిగినప్పుడల్లా కొత్త అన్వేషణ, ఆవిష్కరణలు జరగడం సహజం. ఇప్పుడు అదే జరిగింది. జరుగుతోంది. ఇందులో వగచడానికి ఏముంది? కమ్యూనిస్టులు మాత్రం నాస్టాల్జియాలో చిక్కుకుని లెనిన్ కాలం దాటి ముందుకు కదలడానికి ఇష్టపడకపోవడం విడ్డూరం. ఇంకా ఎన్ని దశాబ్దాల పాటు వగచడం?

ఇక ఈ పుస్తకం అనువాదం అంత అభినందనీయంగా లేదు. ఉదాహరణకు.. విప్లవ ప్రతీఘాత సేనలు ఒకటి తరువాత ఒకటిగా ఇసుకలా రాలిపోయాయి (పే.303), నైయిల్ - కొల్లాక్ యుద్ధ శ్రేణిలో ఉరితీయబడ్డాడు (పే.304)

-వుప్పల నరసింహం

భౌతికవాద కోణంలో వివేకానంద

స్వామి వివేకానంద బోధనలు, ప్రవచనాలు ఇవీ అని సవ్యాఖ్యాన గ్రంథాలు ఇప్పటికే చాలా వెలువడ్డాయి అసంఖ్యాకంగా. విచిత్రం ఏమిటంటే ఆ మహనీయుని వాక్కులను ఎవరికిష్టమొచ్చిన రీతిలో వారు అన్వయించి రాశారు, రాస్తున్నారు. ఆస్తికతకు, అఖండ భారత జాతీయతా వాదానికి పందొమ్మిదవ శతాబ్దపు వైతాళికుడుగా అధిక సంఖ్యాలు భావిస్తున్న ఆ భగవత్తాత్వికవేత్త సూక్తులను పోరాటవాదులు, ఆధ్యాత్మికత అంటే కిట్టని కొందరు మానవతావాదులు, ప్రచ్ఛన్న నాస్తికతా వాదులు, నేటి కొందరు వంగదేశ భౌతికవాదులు, వర్గ పోరాటవాదులు మొదలైన వాళ్లు కూడా తమతమ ధోరణులకు అనుకూలంగా అన్వయిస్తూ చెప్పుకుపోతున్నారు.

హిమాచల శృంగానికి కొన్ని వేల మైళ్ల దూరంలో వున్న, దేశ దక్షిణపు కొన అయిన కన్యాకుమారిలోని ఒక రాతిగుట్ట మీద కూర్చొని, కళ్లు మూసుకుని భగవంతుడిని, భారతమాతను ధ్యానిస్తూ అఖండ భారత చిరంతన జాతిని, గౌరీ శంకర శిఖరాన్ని దర్శించి దివ్యానుభూతికి లోనైన వివేకానందుడిని ఒక అద్వైత తత్త్వవేత్తగా పేర్కొంటూనే అతనిని ఒక వర్గ పోరాట వాదిగా చిత్రిస్తూ కె.రాజేశ్వరరావు, ఎం.సారథి అనే ఇద్దరు రచయితలు కలిసి ఒక అనువాద గ్రంథాన్ని రాశారు. పుస్తకం పేరు 'వివేకానందుని సామాజిక రాజకీయ దృక్పథాలు' మూలం బినయ్ కె.రాయ్ అని పేర్కొన్నారు.

'సత్యంపైన, అఖండ సర్వవ్యాపక పరమాత్మ భావన పైననే నా బోధలన్నీ ఆధారపడి ఉన్నాయి' అంటూ ముగిస్తారు వివేకానంద.

'చాలాకాలం నుంచీ దివ్య జ్ఞాన సామాజికులు, పాశ్చాత్య మిషనరీల వాళ్లు, పాక్షిక దృష్టిగల పరిశీలకులు సాగించిన కపట ప్రచారం వల్ల భారతదేశం మార్మికత, మంత్ర తంత్రాలతో నిండిన అర్ధ బర్బర దేశంగా కొనసాగిన భావన పశ్చిమాన వివేకానంద సాగించిన ప్రచారోద్యమ అవిశ్రాంత కృషి వల్ల గణనీయంగా కదలిపోయింది' వంటి వాస్తవాలు ఈ పుస్తకంలో చోటు చేసుకోవటం బాగానే ఉంది.



వివేకానందుని సామాజిక రాజకీయ దృక్పథాలు
మూల రచయిత: బినయ్ కె.రాయ్
అనువాదం: కె.రాజేశ్వరరావు
ఎం.సారథి
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

కానీ పుస్తకం మొత్తం అధిక భాగం 'మనం కూపస్థ మండూకాలం - బావిలో కప్పలం (పేజీ.27)' 'భారతదేశంలోని అగ్రవర్ణాలకు చెందిన వాళ్లల్లారా! మీరంటే శూన్యం. గతం యొక్క నిరర్థక వ్యక్తులు. మీరు గతకాలపు భారతదేశం యొక్క మాంసరహిత, రక్తరహిత కంకాళాలు (పేజీ.35)' 'బ్రాహ్మణుల ప్రభావము, క్షత్రియుని ప్రతాపము, వైశ్యుల అదృష్టము - ఇవన్నీ ఎవరి శారీరక శ్రమ వల్ల కలిగాయో అలాంటి వారు ఈనాడు ఎక్కడ ఉన్నారు? (పేజీ.50) ఇలాంటి వాక్యాలు అన్నీ వివేకానంద అన్నట్టు రాశారు.

ఇక పద 'సంయోజనము' సంగతికొస్తే, అభివృద్ధి నిరోధక శక్తులు, కాలం చెల్లిన శక్తులు, ఫ్యూడల్, బూర్జువా తత్త్వం, సామ్రాజ్యవాదం, పోరాటం, శ్రమ దోపిడీ మొదలైన మార్క్సిస్టుల పడికట్టు పిడివాదపు పదాలతోనే పుటలన్నీ చిటపటలాడిపోతుంటాయి. కుల ద్వేషం పెంచే రీతిలో చాలా పేరాగ్రాఫ్‌లు శివాలాడుతుంటాయి.

వివేకానంద యొక్క మార్గాన్ని విశ్లేషిస్తూ, కనిపించే 'వివేకానందుని అభిప్రాయం యొక్క తాత్త్విక పునాదిలో వైరుధ్యాలు, ద్వంద్వ ప్రమాణాలు అంతర్గతంగా ఉన్నాయి (పేజీ.44)'. 'శ్రమజీవులదే అనగా శూద్రులదే భవిష్యత్తు అని ముందే జోస్యం చెప్పినప్పటికీ వివేకానంద యొక్క జాతీయ పునరుజ్జీవన కార్యక్రమం సగంలో రాజీ పడేది (పేజీ.63). మొదలైన వాక్యాల ద్వారా వివేకానందుని స్వీయ పథగమనం ఈ సోషలిస్టులకు పూర్తి సంతృప్తి నివ్వలేదని అనుకోవాలి.

ఇక అనువాద శైలి సంగతి. మూల రచయిత వంగ భాషలోనో, హిందీలోనో చెప్పినదాన్ని అనువాదకులు ఇంగ్లీషులో అర్థం చేసుకొని తెలుగులో రాసినట్టు కృతకంగా ఉన్నది. ఉదాహరణలు: పాదార్థిక ప్రపంచంలోని దోపిడీ నియమాలన్నీ భారతదేశ ప్రజల్ని బంధనాల్లో ఉంచే వనరులైనాయి (పేజీ.12); 'మొదట్టమొదట ఆయన పదార్థాన్ని గురించి సూత్రీకరిస్తూ ఆ నిర్దిష్ట భౌతికసారాన్ని (తాత్త్విక భౌతికత) చేరారు. (పేజీ.13) వంటి ఎన్నో వాక్య సముదాయాలు.

అక్కడక్కడ కొన్ని కొన్ని శబ్ద దోషాలు మసిమరకలలాగా ఉన్నాయి - 'శక్తివంతము' 'బానిసత్వము' లాంటివి. 'శక్తిమంతము' 'బానిసత్వము' లాంటివి. శక్తిమంతము అనాలి. మతుబర్థం (కలవాడు, కలది అనే అర్థం)లో 'ఇ'కారం తరువాత 'మ'కారం వస్తుంది. 'వ'కారం కాదు, రాదు. బానిసతనము అని గాని, బానిసము అని గాని అనాలి. తెలుగు పదం మీద భావార్థక ప్రత్యయంగా 'త్వం' అని రాదు. దొంగత్వము, పిరికిత్వము, తీపిత్వము - ఇలాంటి శబ్దాలు ఎలా వికృతాలో అలాగే 'బానిసత్వం' కూడా. భాషారూప సహజతలను గమనించి, అధ్యయనం చేసి పద ప్రయోగాలు చేస్తే భాషే మనకు 'బానిసం' చేస్తుంది. ఆస్తికుడైన వివేకానందను నాస్తికవాదులైన మార్క్సిస్టులు కూడా తమ వానిగా చేసికోవటం ఒక చమత్కారం ఈ గ్రంథంలో.

-శ్రీ




దీపికా పదుకొనె

పెళ్లికి సిద్ధమైంది!

త్వరలో బాలీవుడ్‌లో మరో ప్రేమజంట ఒక్కటేయ్యే అవకాశాలు దగ్గర పడ్డాయి. తాజాగా బాలీవుడ్ గ్లామర్ భామ అనుష్కాశర్మ, క్రికెటర్ విరాట్ కోహ్లిని పెళ్లిచేసుకున్న విషయం తెలిసిందే. చాలాకాలం ఘాటు ప్రేమాయణం సాగించిన ఈ జంట పెళ్లితో ఒక్కటయ్యారు. ఇపుడు వీరి దారిలోనే మరో ప్రేమ జంట ఒక్కటి కానుంది. బాలీవుడ్ భామ దీపికా పదుకొనె గత కొన్నేళ్లుగా హీరో రణవీర్‌సింగ్‌తో ఘాటు ప్రేమాయణం సాగిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే వీరి వ్యవహారంపై బి టౌన్ మీడియా కోడై కూస్తోంది. తాజాగా వీరిద్దరూ ఒకటయ్యే సమయం ఆసన్నమైంది. వీరిద్దరూ కలిసి నిశ్చితార్థం జరుపుకోవడానికి సిద్ధమయ్యారట. అందుకోసం రెండు కుటుంబాలు కలిసి శ్రీలంక వెళ్లారని వార్తలొస్తున్నాయి. దాంతోపాటు శుక్రవారం దీపిక పుట్టినరోజు వేడుకలు కూడా అక్కడే జరుపనున్నారట. నిశ్చితార్థం తరువాత త్వరలోనే పెళ్లి జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ధియేటర్ల లీజుపై పోరాటం



ప్రతాని రామకృష్ణగౌడ్

తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో డిజిటల్ మరియు ధియేటర్ల లీజ్ విధానంపై మార్చి 31లోపు డిజిటల్ రేట్లు తగ్గించకున్నా, ధియేటర్ల లీజు విధానం తీసివేయకపోయినా ఆ రోజునుండి రెండు రాష్ట్రాలలో సినిమాలు, ధియేటర్లు, షూటింగ్‌లు బంద్ చేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. తాము పరిశ్రమలో సమస్యలపై గత 15 సంవత్సరాలుగా పోరాడుతున్నామని, చాలాకాలం నుంచి డిజిటల్ విధానం మరియు రెంటల్ విధానంపైన పోరాటం సాగిస్తున్నామని అన్నారు. పక్క రాష్ట్రాల్లో వున్న విధానం మనకు రావాలని, తెలుగు రాష్ట్రాల్లో డిజిటల్ ఛార్జీలు ఒక వారానికి 13 వేల రూపాయలు వసూలు చేస్తున్నారని, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో వారానికి 2,500 మాత్రమే వసూలు చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ రేటు మన రెండు రాష్ట్రాలకు కూడా కావాలని, చిన్న సినిమాలకు అదనంగా తీసుకునే 50వేల రూపాయల డిపాజిట్ కూడా నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సెన్సార్ పూర్తిచేసుకున్న 300 చిత్రాలు విడుదలకు నోచుకోలేదని, ఈ పరిస్థితి కారణం మన తెలుగు పరిశ్రమలో వుండే ముగ్గురు నలుగురు నిర్మాతలేనని ఆయన అన్నారు. నలుగురు కలిసి కొన్ని వేలమంది నిర్మాతల డిస్ట్రిబ్యూటర్ల రక్తం తాగుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు.



పోటీ ఉంటేనే మంచి సినిమాలు

రాజ్ తరుణ్

వరుస విజయాలతో జోరుమీదున్నాడు యువ హీరో రాజ్‌తరుణ్. భిన్నమైన సినిమాలతో పాటు కమర్షియల్ చిత్రాల హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రాజ్‌తరుణ్, తాజాగా 'రంగులరాట్నం'తో మనముందుకొస్తున్నాడు. శ్రీరంజనిని దర్శకురాలిగా పరిచయం చేస్తూ అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈనెల 14న విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హీరో రాజ్‌తరుణ్‌తో ఇంటర్వ్యూ..

ఈ ప్రాజెక్టు గురించి?

- ఒక రోజు సుప్రియ ఫోన్ చేసి సినిమా చేద్దామని మంచి కథ వుందని చెప్పారు. సరే అని కథ విన్నాను. చాలా బాగా నచ్చింది. ఒక అందమైన ప్రేమకథతోపాటు మదర్ సెంటిమెంట్, ఇద్దరు ప్రేమికులమధ్య వుండే రొమాంటిక్ సన్నివేశాలన్నీ కొత్తగా వుంటాయి. తప్పకుండా ప్రతి ఒక్కరికీ కనెక్టు అవుతుంది.

మీ పాత్ర ఎలా ఉంటుంది?

- ఇందులో నేను మిడిల్ క్లాస్ అబ్బాయినే. అందరిలాగానే వుంటా. కానీ సెలెక్టివ్ పర్సన్‌ని. నా లుక్, గెటప్ కొత్తగా వుంటుంది. మేము ఇప్పటివరకూ చేసిన అన్ని పాత్రల్లో ఈ పాత్రకు ఎక్కువ రెస్పాన్స్ వస్తుందని నమ్ముతున్నాను.

అన్నపూర్ణ బ్యానర్‌లో మరో సినిమా చేస్తున్నారు?

- అవును. నా మొదటి సినిమా 'ఉయ్యాలా జంపాలా'. ఈ బ్యానర్‌తోనే పరిచయం అయ్యాను. అప్పుడు టెన్షన్ వుండేది. ఆ సినిమాతో డైరెక్షన్ ఫీల్డ్‌లో కూడా పని చేశాను. కానీ ఈ సినిమాకు కేవలం హీరోగా చేస్తున్నాను. ఏ టెన్షన్ లేదు. అన్నపూర్ణ లాంటి పెద్ద బ్యానర్‌లో సినిమా చేయడం గర్వంగా వుంది. టీమ్ అంతా కొత్తవాళ్లైనా ఈ బ్యానర్‌లో ధైర్యంగా సినిమాలు చేయచ్చు. క్వాలిటీ పరంగా ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు.

సంక్రాంతికి పెద్ద సినిమాలతో పోటీగా వెళ్తున్నారు, టెన్షన్ లేదా?

- టెన్షన్ ఎందుకు? ప్రతీ రంగంలో పోటీ వుంటుంది. పోటీ వున్నపుడే మంచి సినిమాలు వస్తాయి. గత ఏడాది కూడా రెండు పెద్ద సినిమాల మధ్య వచ్చిన చిన్న సినిమా కూడా ఘనవిజయం సాధించింది. ఈ సినిమా మీద నాకెలాంటి టెన్షన్ లేదు. రెండు గంటలపాటు కుటుంబం అంతా సరదాగా నవ్వుకునేలా ఈ చిత్రం ఉంటుంది. సంక్రాంతి పండగ అంటేనే సినిమాలకు పెద్ద పండగ. ఈ పండగకు విడుదలయ్యే ప్రతి సినిమా మంచి విజయం సాధించాలి.

లేడీ దర్శకురాలితో పనిచేయడం?

- ఆడా, మగా అనే తేడా వుండదు. దర్శకుడంటే దర్శకుడే. స్క్రిప్ట్ ఫైనల్ అయ్యాక ఏ దర్శకుడికైనా వారికి కొన్ని ఆలోచనలు ఉంటాయి. దానికి తగ్గట్టుగానే సినిమాలు తీస్తారు. లేడీ దర్శకురాలైనా వారి ఆలోచనలు వారికుంటాయి. శ్రీరంజని, సెల్వరాఘవన్ దగ్గర పనిచేసింది. దర్శకత్వంపై మంచి పట్టుంది. మంచి తపన వున్న దర్శకురాలు. తనకేం కావాలో క్లారిటీ వుంది. అద్భుతంగా తెరకెక్కించింది.

సినిమాల్లో మీ ఇన్‌వాల్వ్‌మెంట్ ఎంతవరకు?

- ఏ సినిమాకైనా ఒక్కసారి కథ విన్నాక నా ఇన్‌వాల్వ్‌మెంట్ వుండదు. ఒకవేళ అవసరమైతే ఏమైనా సలహాలు అడిగితేనే ఇస్తా.

రంగులరాట్నం టైటిల్ ఎలా పెట్టారు?

- ఈ సినిమా కోసం చాలా రకాల టైటిల్స్ అనుకున్నాం. అయితే కథలోంచి టైటిల్ పుడితే బాగుంటుందని ఆలోచించి ఈ టైటిల్‌ను ఎంపిక చేయడం జరిగింది.

హైలెట్స్ గురించి?

- ఈ సినిమాకు కథతోపాటు ఫొటోగ్రఫీ, మ్యూజిక్ హైలెట్‌గా నిలుస్తాయి. శ్రీచరణ్ అందించిన సంగీతం, పాటలు అద్భుతంగా ఉన్నాయి. ఇందులో నేను ఒక పాటను కూడా రాశాను.

హీరోయిన్ గురించి?

- మొదటిసారిగా చిత్రశుక్లా హీరోయిన్‌గా పరిచయం అవుతుంది. ఎక్కువ రెస్పాన్సిబిలిటీ వున్న అమ్మాయి పాత్రలో నటించింది. అల్లరి చిల్లరిగా తిరిగే అబ్బాయికీ, అమ్మాయికీ మధ్య సాగే ప్రేమకథ. ఎమోషనల్ జర్నీ. ఆసక్తికరంగా ఉంటుంది.

తదుపరి చిత్రాలు

- ప్రస్తుతానికి రెండు సినిమాలు చర్చల దశలో వున్నాయి.

- శ్రీ

హద్దులను చెరిపేసే..



నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందించిన చిత్రం 'రాజరథం'. షూటింగ్ పూర్తిచేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుతున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను దగ్గుబాటి రాణా ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హీరో నిరూప్ భండారి మాట్లాడుతూ- సినిమా అందరికీ నచ్చే విధంగా రూపొందిందని, దర్శకత్వం, సంగీతం అన్నయ్య చేస్తే, వదిన కాస్ట్యూమ్స్ డిజైన్ చేశారని, ఈ చిత్రం ద్వారా తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నందుకు ఆనందంగా వుందని తెలిపారు. హైటెక్నికల్ విలువలతో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు అనూప్ భండారి తెలిపారు. అనూప్ భండారి రూపొందించిన 'రంగి తరంగ' కన్నడ చిత్రం అనేక అవార్డులను గెలుచుకుందని, ఈ సినిమాలో తాను కనిపించకుండా వినిపిస్తానని నటుడు రానా తెలిపారు.

'ప్రాజెక్ట్ జెడ్' విజయం



ఎస్‌బికె ఫిలిమ్స్ కార్పొరేషన్ పతాకంపై కె.ఎస్.అబ్దుల్లా సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'ప్రాజెక్ట్ జెడ్'. సందీప్‌కిషన్, లావణ్య త్రిపాఠి జంటగా నటించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై మంచి టాక్‌తో రన్ అవుతున్న సందర్భంగా శుక్రవారం సక్సెస్‌మీట్‌ను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు ఎస్.కె.బషీద్ మాట్లాడుతూ- ఇటీవల విడుదలైన 'ప్రాజెక్ట్ జెడ్' సినిమాను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. మంచి చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ ఉంటుందని మరోసారి నిరూపించినందుకు వారికి కృతజ్ఞతలు. ప్రతి సినిమాలో ఒక విలన్ వుంటాడు కానీ నా జీవితంలో విలన్ సందీప్‌కిషన్. ప్రతి విషయంలో నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా 2007లో ఇండస్ట్రీలోకి వచ్చాను. ఇప్పటివరకూ ఎవరి సహాయ సహకారాలు లేకుండా ఎదుగుతున్నాను. అలాంటి నాకు సందీప్‌కిషన్ విలన్‌గా మారాడు. ఈ సినిమా మొదలుపెట్టినప్పటినుంచి పలురకాలుగా అడ్డుపడుతున్నాడు. సందీప్ నటించిన సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్ అవుతున్నాయి. అందుకే ఈ సినిమాలో ఆయన వాయిస్ కాకుండా వేరే వాళ్లతో డబ్బింగ్ చెప్పించాను. దాంతో సందీప్ ఈ సినిమాలో నా వాయిస్ కాదు, అందుకనే సినిమా ప్రమోషన్ పాల్గొనని, విడుదలను అడ్డుకుంటానని చాలాసార్లు ప్రయత్నించాడు. అందుకు నేను లీగల్‌గా వెళ్లి ఎన్నో కష్టాలను ఎదుర్కొని సినిమాను విడుదల చేశాను. కాని సందీప్ నాపై పగ పట్టినట్లు వ్యవహరిస్తున్నాడు. సినిమా బాగా రాలేదని రీ షూట్ చేసి త్వరలో విడుదల చేస్తామని ప్రచారం చేస్తున్నాడు. నన్ను బ్రదర్ అని పిలుస్తూనే నా కొంప ముంచాడు. బయ్యర్స్‌ను బెదిరిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మరోసారి విడుదల చేస్తానంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.

గ్లామర్‌కు సై!



అమలాపాల్

హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో వున్నపుడే ప్రేమించి పెళ్లి చేసుకుని కొన్నాళ్లు కాపురం చేసి విడాకులు తీసుకున్న అందాల భామ అమలా పాల్ మళ్లీ హీరోయిన్‌గా బిజీ అవ్వాలని తెగ ప్రయత్నాలు చేస్తోంది. సాధారణంగా దక్షిణాదిలో హీరోయిన్లకు పెళ్లయిందంటే హీరోయిన్ అవకాశాలు తగ్గిపోవడం ఆనవాయితీ. ఇప్పుడు అదే టెన్షన్‌లో వుంది ఈ భామ. ఇప్పటికే అవకాశాలు వస్తున్నా, కూడా క్రేజీ హీరోల సరసన మాత్రం ఛాన్స్ దక్కడంలేదు. దాంతో మళ్లీ గ్లామర్ షోకి సిద్ధమైంది. ఇప్పటికే పలు ఈవెంట్‌లలో హాట్ హాట్‌గా ముస్తాబై షాకిస్తున్న ఈ భామ తాజాగా గ్లామర్ పాత్రలతోపాటు లిప్‌లాక్, రొమాంటిక్ సన్నివేశాలు చేస్తానని చెప్పేసింది. మొత్తానికి ఇన్నాళ్లు పెట్టుకున్న కండిషన్‌లను తుంగలో తొక్కేసింది. అవకాశాలు రాకపోవడంతో అమలాపాల్ గ్లామర్‌కు సిద్ధమైందని కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.

నేల టికెట్ మొదలైంది?



మాస్ మహారాజా రవితేజ కొత్త సినిమా ప్రారంభమైంది. 'సోగ్గాడే చిన్నినాయన' ఫేం కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. వరుస పరాజయాలతో సతమతమైన రవితేజకు 'రాజా ది గ్రేట్' కొత్త ఊపునిచ్చింది. ఆ సినిమా తరువాత 'టచ్ చేసి చూడు' చిత్రంలో నటిస్తున్నాడు రవితేజ. ఈ చిత్రాన్ని జనవరి 26న విడుదల చేయనున్నారు. ప్రస్తుతం కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కే చిత్రం ఈ రోజు పూజా కార్యక్రమాల్ని జరుపుకుంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. ఈ చిత్రానికి 'నేల టికెట్' అనే టైటిల్‌ను పెట్టే ఆలోచనలో వున్నారు దర్శక నిర్మాతలు.